సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 276

బుధవారం 19-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



విండీస్ ధనాధన్

టి20 ప్రపంచకప్‌లో అఫ్గాన్‌పై 104 పరుగులతో గెలుపు - 12లో



రికార్డుల ర్యాలీ

77 వేల స్థాయిపై ముగిసిన సెన్సెక్స్. జీవిత కాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద - 13లో



గంగా మాత దత్తత తీసుకుంది

గంగా మాత తనను దత్తత తీసుకున్నట్లుందని మోదీ అన్నారు. పీఎం కిసాన్ కింద రూ.20 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

వివరాలు 6లో ▸



ఆంక్షలపై సమష్టి సమరం

అమెరికా సారథ్యంలో కొనసాగుతున్న ఆంక్షలను ఉత్తర కొరియాతో కలిసి సమష్టిగా ఎదుర్కొంటామని పుతిన్ అన్నారు.

వివరాలు 6లో ▸



వలసదారులకు భారీ ఆఫర్

తమ పౌరులను పెళ్లాడి కనీసం పదేళ్లుగా నివసిస్తున్న వారికి పౌరసత్వం ఇవ్వాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



24 నుంచి కాంగ్రెస్ వరుస భేటీలు

మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా, జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ నేతలతో ఆ పార్టీ అగ్రనేతలు ఈనెల 24 నుంచి భేటీ కానున్నారు.

వివరాలు 6లో ▸

• ముసుగు తొలగింది..

బూతులు.. బెదిరింపులు

ఉద్యోగులపై మంత్రులు, టీడీపీ నేతల దుర్భాషలు..

- 'పచ్చ'చొక్కా వాళ్లొస్తే కుర్చీ వేసి టీ ఇవ్వాలన్న మంత్రి అచ్చెన్న
- అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు
- చెప్పింది చేయకపోతే ఏం జరుగుతుందో చెప్పాల్సిన పని లేదని హెచ్చరిక
- నర్సీపట్నం నడిరోడ్డులో మున్సిపల్ అధికారులపై 'అయ్యన్న' దుర్భాషలు
- స్పీకర్ అవుతున్నా.. అసెంబ్లీలో నిలబెడతానంటూ చిందులు
- పోలీసులను గత ప్రభుత్వ తొత్తులుగా అభివర్ణించిన హోం మంత్రి అనిత

శ్రీకాకుళం, సాక్షి, అనకాపల్లి, సింహాచలం: కొత్త అసెంబ్లీ ఇంకా కొలువుదీరలేదు. నూతన సభ్యుల ప్రమాణ స్వీకారాలు పూర్తి కాలేదు. కొందరు టీడీపీ ప్రజా ప్రతినిధులు నిజ స్వరూపాలు అప్పుడే బయటపడుతున్నాయి. బూతు భాష, బెదిరింపుల్లో పోటాపోటీగా దూసుకెళుతున్నారు. ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు హుందాగా నడుచుకోవాలనే

మిగతా 2వ పేజీలో ▶





లైన్‌లో పెడతా

"నేను మాటిస్తున్నా. అధికారులకు సమావేశం పెట్టి చెబుతా. రేపటి నుంచి ప్రతి కార్యకర్త ఎస్‌ఐ దగ్గరకు వెళ్లినా.. ఎమ్మార్వో, ఎండీఓ వద్దకు వెళ్లినా.. ఏ ఆఫీసుకు వెళ్లినా పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి. మీకు గౌరవంగా కుర్చీ వేసి టీ ఇచ్చి మీ పనేమిటి? అని అడిగి అందరికీ పనులు చేసే విధంగా అధికారులను లైన్‌లో పెడతా. ఎవరైనా మాట జవదాటితే ఏమవుతారో వాళ్లకు నేను చెప్పాల్సిన అవసరం లేదు.

- మంత్రి అచ్చెన్నాయుడు


తమాషాలు చేస్తున్నారా..

"తమాషాలు ...(బూతు)? ఇష్టం లేకపోతే ...(బూతు). నేను అసెంబ్లీ స్పీకర్‌ను అవుతున్నా.. మిమ్మల్ని గంటల కొద్దీ నిలబెడతా.. నర్సీపట్నంలో దిక్కుమాలిన మున్సిపల్ కమిషనర్ ఒకడున్నాడు. వాడి సంగతి తేలుస్తా. తమాషాలు చేస్తున్నారా..? కళ్లు మూసుకుపోయి ఏడుస్తున్నారా నా కొడకల్లారా! పని చేయడానికి ఇష్టం లేకపోతే.. పోండి.

- టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు

0.001 శాతం నిర్లక్ష్యమున్నా పరిష్కరించాల్సిందే

'నీట్' పరీక్ష విధానంపై సుప్రీంకోర్టు



వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన నీట్-యూజీ 2024 పరీక్ష విధానం, నిర్వహణలో 0.001 శాతం లోపం తలెత్తినా సరే సకాలంలో పరిష్కరించాలి. అత్యంత కఠినమైన ఇలాంటి ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతగా శ్రమిస్తారో మనందరికీ తెలుసు. వైద్యుడే అవినీతికి పాల్పడితే సమాజానికి ఎంతటి నష్టం చేకూరుతుందో ఊహించండి. ప్రవేశ పరీక్షలు నిర్వహించే ఒక బాధ్యతాయుత సంస్థగా ఒకే మాట మీద నిలబడాలి. మీ వైపు ఏదైనా తప్పు జరిగితే నిజాయతీగా ఒప్పుకోవాలి. సరిదిద్దేందుకు చేపట్టిన చర్యలనూ వివరించాలి. కనీసం ఆ దిశగా చర్యలకు సమాయత్తం అయ్యామని అయినా నిరూపించుకోవాలి. అప్పుడే మీ పనితీరుపై విశ్వాసం పెరుగుతుంది.

- ఎన్‌టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం

6 లో

మోదీ మౌనమేల?



- నీట్ పరీక్షపై ప్రధాని స్పందించరా?
- పేపర్ లీకేజీల రహిత పటిష్ట విధానాల కోసం పోరాడతాం
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్య

6లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి



ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. రెండో ఏడాది విద్యార్థులు 1,37,587 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. 1,27,190 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 74,868 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

వివరాలు 14లో ▸

మిర్చి ధర పతనం



మిర్చి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది మే చివరి నాటికి క్వింటాల్ మిర్చి గరిష్ట ధర రూ.26,500 ఉండగా.. ఈ ఏడాది రూ.20,700 పలుకుతోంది. కోల్డ్ స్టోరేజీలలో 75 లక్షల మిర్చి బస్తాలు నిల్వ ఉండిపోయాయి. దీంతో మిర్చి రైతుల్లో ఆందోళన నెలకొంది.

వివరాలు 5లో ▸

సముద్రంలో బోటుకు అగ్ని ప్రమాదం



పూడిమడక ప్రాంతంలో సముద్రంలో వేటకు వెళ్లిన బోటు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్ని ప్రమాదానికి గురైంది. వెంటనే అందులోని ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి దూకేశారు. వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

వివరాలు 5లో ▸

ఈవీఎంల వల్లే బీజేపీ కూటమికి ఎక్కువ సీట్లు



కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి అధిక లోక్‌సభ స్థానాలు సాధించడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలే(ఈవీఎంలు) కారణమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. ఈవీఎంల పనితీరుపై దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸

బ్యాలెట్టే బెటర్

అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు

దేశంలోనూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

ఈవీఎంలను పక్కన పెట్టాలి

అప్పుడే ప్రజాస్వామ్యం నిస్సందేహంగా మనగలదు

'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి,అమరావతి: ఏపీ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలపై ఒకవైపు.. ఈవీఎంల ట్యాంపరింగ్, హ్యాకింగ్, అన్‌లాకింగ్ తదితర అంశాలపై మరోవైపు తీవ్రస్థాయిలో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఫలితాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రమే కాదు.. ప్రజలు సైతం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక మాధ్యమం(ఎక్స్) ఖాతాలో ఓ కీలక సందేశాన్ని

మిగతా 2వ పేజీలో ▶



20న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

వైఎస్ జగన్ పులివెందుల పర్యటన వాయిదా

2లో

21 నుంచి అసెంబ్లీ సమావేశాలు



2 రోజులపాటు నిర్వహించే అవకాశం

సాక్షి, అమరావతి: ఈ నెల 21వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. తొలుత 19వ తేదీ అనుకున్నా, ఆ తర్వాత 24 నుంచి నిర్వహించాలని యోచించింది. ఎక్కువ మంది మంత్రులు ఇంకా బాధ్యతలు తీసుకోకపోవడం, పలు ఇతర కారణాలతో 21 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. 2 రోజులపాటు సమావేశాలు నిర్వహిస్తారని సమాచారం. మొదటిరోజు ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణం, రెండవ రోజు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారని చెబుతున్నారు.



కదలని 'నైరుతి'

- కొద్ది రోజులుగా విజయనగరం వద్దే తిష్ట
- ముందుకు కదలని రుతుపవనాలు
- దీంతో ఉష్ణతాపం.. అరకొర వానలు
- రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి అంటున్న నిపుణులు

14 లో

పవన్‌ను ఆలింగనం చేసుకున్న చంద్రబాబు



సీఎం చంద్రబాబుతో

పవన్ భేటీ

డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి సచివాలయానికి..

నేడు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్న పవన్‌కళ్యాణ్

3లో

తెలంగాణ

కొత్త వంగడాలతో తెగుళ్లకు చెక్

వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్నలో కొత్త రకాలు

విడుదల చేసిన వ్యవసాయ వర్సిటీ

సాక్షి, హైదరాబాద్, ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మంగళవారం వివిధ పంటల్లో ఎనిమిది నూతన వంగడాలను విడుదల చేసింది. సెంట్రల్ వెరైటల్ రిలీజ్ కమిటీ, రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీల ఆమోదంతో వీటిని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న పంటలలో మొత్తం ఎనిమిది రకాలను విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ఎం.రఘునందన్‌రావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. వరిలో రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో రెండు రకాలు, సెంట్రల్ వెరైటల్ రిలీజింగ్ కమిటీ ఆమోదంతో మరో రెండు రకాలను విడుదల చేశారు. అలాగే రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో జొన్న, రాగి సజ్జ పంటలో ఒక్కొక్కటి చొప్పున... అలాగే సెంట్రల్ వెరైటల్ కమిటీ ఆమోదంతో మొక్కజొన్నలో ఒక రకాన్ని విడుదల చేసినట్లు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత గత 8 ఏళ్లలో వివిధ పంటలలో 61 నూతన వంగడాలను రైతులకు అందుబాటులోకి తేవడం జరిగింది. అందులో భాగంగా వరిలో 25, మొక్కజొన్న 2, జొన్నలో 5, అపరాలలో 11, నూనె గింజల్లో 7, పత్తిలో 1, పశుగ్రాస పంటలలో పది రకాలను విడుదల చేయడం జరిగింది. అందులో రాష్ట్ర స్థాయిలో 23, జాతీయ స్థాయిలో 38 రకాలను విడుదల చేసినట్లు వారు వివరించారు.

తాజాగా వరిలో విడుదలైన రకాలేంటంటే..?

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా వరి విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ ఉండడంతో నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఒకే ఏడాది రెండు పంటలు వేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకోసం తక్కువ కాల వ్యవధితోపాటు అగ్గి తెగులు, సుడిదోమ, ఉల్లికోడులను తట్టుకొనే రకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వరిలో కొత్తగా నాలుగు రకాలను రైతులకు వర్సిటీ అందుబాటులోకి తెచ్చింది. రాజేంద్రనగర్ వరి పేరిట ఆర్ఎన్ఆర్-28361 అను దొడ్డు గింజల రకాన్ని రాష్ట్ర స్థాయి వెరైటల్ కమిటీ ఆమోదంతో విడుదల చేసినట్లు ఎం.రఘునందన్ రావు, డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. అలాగే తెలంగాణ వరి- (కేఎస్ఎం- 7037) పేరిట తక్కువ పంట కాలం కలిగిన, సన్నని, పొడవైన గింజ, తక్కువ నూక శాతం (దిగుబడి 62.3 కిలోలు), నాణ్యత కలిగిన అన్నం లక్షణాలు కలిగిన ఈ రకాన్ని జాతీయ స్థాయిలో విడుదల చేసినట్లు వివరించారు. సుడిదోమ, అగ్గి తెగులు, ఎండుకోళ్ళు తెగులును తట్టుకొనే తెలంగాణ వరి-1289 (డబ్ల్యూజీఎల్- 1289)ను కూడా జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఇది తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలోనూ సాగు చేయడానికి అనుకూలమైన రకమని వారు తెలిపారు. అలాగే ఉల్లికోడు బయోటైప్‌లను తట్టుకొనే వరంగల్ వరి-119ను కూడా రాష్ట్ర స్థాయిలో విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.



మొక్కజొన్న: కాండం కుళ్ళు తెగులు తట్టుకొని అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం-206 అనే నూతన మొక్కజొన్న హైబ్రిడ్ ను జాతీయస్థాయిలో విడుదల చేయడం జరిగింది. ఇది ఉత్తర భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో సాగుకు అనుకూలమైన మొక్కజొన్న హైబ్రిడ్.

జొన్న: యాసంగిలో సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపే మాల్దండి జొన్న రకానికి ధీటుగా, తాండూర్ పరిశోధన స్థానం నుంచి ఎస్‌వీటీ-55 అనే కొత్త జొన్న రకాన్ని విడుదల చేశారు. జొన్న రొట్టె నాణ్యతతో ఉండడం దీని ప్రత్యేకత.

సజ్జ - రాగి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా అధిక ఇనుము, అధిక జింక్ కలిగిన పీబీహెచ్-1625, సజ్జ హైబ్రిడ్‌ను అలాగే రాగిలో అధిక కాల్షియం కలిగిన పీఆర్ఎస్-38 రకాన్ని రాష్ట్రస్థాయిలో విడుదల చేయడం జరిగింది.

'పోలవరం' పనుల్లో సంక్షోభం..

బాబు తప్పిదం వల్లే..

మాజీమంత్రి అంబటి రాంబాబు స్పష్టీకరణ

- స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండానే డయాఫ్రమ్ వాల్‌ను నాటి టీడీపీ సర్కార్ పూర్తిచేసింది
- కాఫర్ డ్యామ్‌ల మధ్య ఖాళీలు వదిలేయడంతో వరద ఉధృతికి 2019లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు మేమే పూర్తిచేశాం
- స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, క్రిటికల్ నిర్మాణాలు కూడా పూర్తిచేసి గేట్లన్నీ పెట్టాం
- ఎంత వరద వచ్చినా ఆపరేట్ చేసే పరిస్థితికి ప్రాజెక్టును తీసుకెళ్లాం
- తప్పులు ఒప్పుకుని ప్రాజెక్టు పూర్తిపై చంద్రబాబు దృష్టిపెట్టాలి



చంద్రబాబు తప్పిదాలను మీడియాకు వివరిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014-19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదంవల్లే పోలవరం ప్రాజెక్టులో విధ్వంసం చోటుచేసుకుందని.. పనుల జాప్యానికి ఆయనే కారణమని మాజీమంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులపై సోమవారం సీఎం చంద్రబాబు చెప్పిన మాటలన్నీ

మిగతా 3వ పేజీలో ▶



మన ఎంపీల ఇళ్లలో కూడా ఇంత మంది ఆతిథ్యం దొరకలేదు మేడం!





వైఎస్ జగన్‌ను కలిసిన ముఖ్య నేతలు, పోటీ చేసిన అభ్యర్థులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య నేతలు, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో అదిప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, పొన్నాడ సతీష్, కోలగట్ల వీరభద్రస్వామి, సింహాద్రి చంద్రశేఖర్, ఆదిమూలపు సతీష్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, లబ్బి వెంకటస్వామి, తిరుపతిరావు, బొత్స అప్పల నరసయ్య, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

20న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

వైఎస్ జగన్ పులివెందుల పర్యటన వాయిదా

సాక్షి,అమరావతి: ఈ నెల 21న అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కార్యక్రమాల్లో పలు మార్పులు జరిగాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ ముందుకు జరిపింది. ఈ నెల 22కు బదులుగా ఈ నెల 20నే విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు ఈ సమావేశానికి హాజరవుతారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు (ఎంపీలు మినహా) ఈ సమావేశానికి హాజరవుతారు. పార్టీ అధ్యక్షుడు వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే జూన్ 19నాటి పులివెందుల పర్యటనను వైఎస్ జగన్ వాయిదా వేసుకున్నారు.

మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్

ఏలూరు (మెట్రో): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఏలూరులో మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మంత్రి అచ్చెంనాయుడు సోమవారం శ్రీకాకుళం జిల్లాలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడారని వారు తెలిపారు. ప్రభుత్వం అధికారంలో వచ్చి 10 రోజులు కూడా అవ్వకుండానే మంత్రి ఈ రకంగా మాట్లాడడం ఉద్యోగులను కించపరిచినట్లుగా భావిస్తున్నామన్నారు. ఉద్యోగులను బెదిరించడం, మాట వినని ఉద్యోగులను ఏమైనా చేస్తామని మాట్లాడడం బాధాకరమని తెలిపారు. ఆయన వెంటనే ఈ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల సర్టిఫికెట్లపై కొత్త మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లపై ఎలాంటి రాజకీయ సంబంధిత వ్యక్తుల ఫోటోలు లేదా గుర్తులు వాడొద్దని ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఉపయోగించిన పత్రాలతోనే సర్టిఫికెట్లను జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు జాయింట్ కలెక్టర్లు, జిల్లాల గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్ల పాటు అమలులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాల పేర్లను మార్చుతూ చంద్రబాబు ప్రభుత్వం కొత్తగా అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చేపడుతున్నట్టు గ్రామ, వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ పేర్కొన్నారు.

'సొంత రాష్ట్రానికి బదిలీ చేయండి'

సాక్షి, అమరావతి: తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న తమను సొంత రాష్ట్రానికి బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ స్థానికత కలిగిన హోంగార్డులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో హోంగార్డులుగా నియమితులైన తాము 15ఏళ్లుగా అక్కడే విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమను తెలంగాణలో నాన్‌లోకల్‌గా పరిగణిస్తుండటంతో కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వ పథకాలు కూడా వర్తించడంలేదన్నారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో తమను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆన్‌లైన్ మోసాలకు అంతేలేదు



దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డు, యూపీఐల ద్వారా విచ్చలవిడిగా దోపిడీ

- గడిచిన మూడేళ్లలో అత్యధికంగా 47 శాతం మంది బాధితులు పట్టణ వాసులే
- అనధికారిక యూపీఐ స్కాన్, లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా ఖాతాల్లో నగదు మాయం
- 2023-24లో అత్యధికంగా 36,075 మోసాలు..
- 2022-23తో పోలిస్తే 166 శాతం మేర పెరుగుదల
- వీటి విలువ సుమారు రూ.13,930 కోట్లు
- మోసాలపై ఫిర్యాదులు చేసేందుకు వెనుకాడుతున్న బాధితులు
- సోషల్ మీడియా రీసెర్చ్ ఫ్లాట్‌ఫారం సంస్థ లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి

దేశంలో ఆర్థిక మోసాలు పెచ్చరిల్లుతున్నాయి. వినియోగదారుల ఆర్థిక డేటా వివరాలు అంగట్లో సరుకులా అమ్ముడవుతున్నాయి. గడిచిన మూడేళ్లలో పట్టణ భారతీయుల్లో అధిక శాతం మంది క్రెడిట్ కార్డు మోసాలకు గురయ్యారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. ఆ తర్వాత.. నిత్యం లావాదేవీలకు కోసం వాడే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సరికొత్త చోరీలు తెరపైకి రావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా దేశంలోని వేలాది మంది డేటా విక్రేతల ద్వారా దేశీయ వినియోగదారుల క్రెడిట్ కార్డు సమాచారం మార్కెట్‌లో సులభంగా లభిస్తోందని సోషల్ మీడియా రీసెర్చ్ ఫ్లాట్‌ఫారం సంస్థ లోకల్ సర్కిల్స్ సర్వేలో తేలింది. సాక్షి, అమరావతి

క్రెడిట్ కార్డుల ద్వారా 43శాతం మోసాలు..

దేశవ్యాప్తంగా గడిచిన 36 నెలల్లో ఏకంగా 47 శాతం మంది పట్టణ భారతీయులు, వారి కుటుంబ సభ్యులు ఆర్థిక మోసాల బారినపడినట్లు నివేదిక పేర్కొంది. 43 శాతం మంది తమ క్రెడిట్ కార్డు ద్వారా.. 30 శాతం మంది యూపీఐ లావాదేవీల ద్వారా మోసపోయారు. క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన మోసాల్లో దాదాపు ప్రతి ఇద్దరిలో ఒకరు దేశీయ, అంతర్జాతీయ వ్యాపారులు వెబ్‌సైట్‌ల ద్వారా అనధికారిక చార్జీల మోతను భరించాల్సి వచ్చింది. బ్యాంకర్ల పేరుతో ఫోన్లుచేసి ఓటీపీలు ద్వారా డెబిట్ కార్డు వివరాలు అప్‌డేట్ చేయాలంటూ ఖాతాల్లోని నగదును దోచేస్తున్నారు. ఇక యూపీఐ ద్వారా ఆన్‌లైన్ దోపిడీ విషయంలో ప్రతి పదిమంది బాధితుల్లో నలుగురు చెల్లింపునకు అంగీకరించడానికి పంపించే లింక్‌ను క్లిక్, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా డబ్బులను పోగొట్టుకున్నారు.

వినియోగదారులకు అవగాహన కల్పించాలి..

ఇక యూపీఐ, క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆ అధ్యయనం అభిప్రాయపడింది. ఆర్‌బీఐ, యూపీఐ.. క్రెడిట్ కార్డులు జారీచేసే బ్యాంకులు ఇలాంటి ఆర్థిక మోసాలను నిరోధించేందుకు మరిన్ని రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని తేల్చిచెప్పింది. సైబర్ క్రైం పోలీసుస్టేషన్లు, నిమిషాల వ్యవధిలో ఆన్‌లైన్ ఫిర్యాదును ఫైల్‌చేసే వ్యవస్థ అందుబాటులోకి రావాలని నిపుణులు సైతం సూచిస్తున్నారు.

అమ్మకానికి క్రెడిట్ కార్డు డేటా..

మరోవైపు.. దేశంలోని వినియోగదారుల క్రెడిట్ కార్డు డేటా సులభంగా అమ్మకానికి అందుబాటులో ఉందని ఈ అధ్యయనం చెబుతోంది. పాన్ కార్డు, ఆధార్, మొబైల్ నంబర్, ఈమెయిల్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారంతో పాటు మొబైల్ నంబర్, ఈమెయిల్, ఇతర చిరునామాతో క్రెడిట్ కార్డుల వివరాలు కూడా అందుబాటులో ఉండటం సమాజానికి శ్రేయస్కరం కాదని పేర్కొంది.

ఒక్క ఏడాదిలో రూ.13,930 కోట్ల దోపిడీ..

ఆర్బీఐ లెక్కల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 36వేల కంటే ఎక్కువ ఆర్థిక మోసాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇది గత ఆర్థిక ఏడాదితో పోలిస్తే 166 శాతం మేర గణనీయంగా పెరిగింది. బ్యాంకింగ్ రంగంలో ఈ మోసాల కేసులు 2022-23లో 13,564 నుంచి 2023-24లో 36,075కి చేరుకున్నాయి. అయితే, ఈ మోసాల విలువ 2023-24లో రూ.13,930 కోట్లకు చేరాయి. అయితే, ఇక్కడ ప్రతి పది మంది బాధితుల్లో ఆరుగురు ఎటువంటి ఫిర్యాదులు చేయడానికి ముందుకు రాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని నివేదిక పేర్కొంది.

బూతులు.. బెదిరింపులు

▶ మొదటి పేజీ తరువాయి

విషయాన్ని విస్మరించి తమ అధినేత ప్రశంసల కోసం తహతహలాడుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. టీడీపీ కార్యకర్తలంతా పసుపు బిళ్లలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటూ ఉపదేశించారు. వారికి కుర్చీలేసి కూర్చోబెట్టి టీ ఇచ్చి పనులు చేయాలని అధికార యంత్రాంగాన్ని బెదిరించారు. పోలీసుల్లో గత ప్రభుత్వ తొత్తులుగా వ్యవహరించిన వారు స్వయంగా తప్పుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరికలు జారీ చేశారు. నర్సీపట్నంలో నాసిరకంగా రోడ్లు నిర్మించారంటూ టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడు మునిసిపల్ అధికారులపై నడిరోడ్డులో పచ్చి బూతులతో రెచ్చిపోయారు. త్వరలో తాను స్పీకర్ అవుతున్నానని, ఇలాంటి రోడ్లు వేసినందుకు మిమ్మల్ని అసెంబ్లీలో గంటల కొద్దీ నిలబెడతానని హెచ్చరించారు. అయ్యన్న తిట్ల దండకానికి నిశ్చేష్టులైన అధికారులు చుట్టూ ప్రజలంతా చూస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.



లైన్‌లో పెడతా: మంత్రి అచ్చెన్న

'నేను మాటిస్తున్నా. అధికారులకు సమావేశం పెట్టి చెబుతా. రేపటి నుంచి ప్రతి కార్యకర్త ఎస్ఐ దగ్గరకు వెళ్లినా.. ఎమ్మార్వో, ఎండీఓ వద్దకు వెళ్లినా.. ఏ ఆఫీసుకు వెళ్లినా పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి. మీకు గౌరవంగా కుర్చీ వేసి టీ ఇచ్చి మీ పనేమిటి? అని అడిగి అందరికీ పనులు చేసే విధంగా అధికారులను లైన్‌లో పెడతా. ఎవరైనా నా మాట జవదాటితే ఏమవుతారో వాళ్లకు నేను చెప్పాల్సిన అవసరం లేదు' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం రాత్రి ఓ సభలో వ్యాఖ్యానించారు. మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలసి శ్రీకాకుళం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ అదే విషయాన్ని పునరుద్ఘాటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే కుర్చీ వేసి కూర్చోబెట్టి, టీ ఇచ్చి గౌరవించాలని ఆదేశించారు. గత ఐదేళ్ల పాలనలో టీడీపీ క్యాడర్ ఎన్నో అవమానాలకు గురైందన్నారు. ఏ పనిమీద వెళ్లినా అధికారులు, ఉద్యోగులు పట్టించుకోలేదని చెప్పారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలుగా తనతో పాటు బెందాళం అశోక్ బాబు ఉన్నా తమను పట్టించుకోకుండా అవమానించారన్నారు. ఇకపై అలా జరగకుండా ఇలాంటి ఆదేశాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అప్పట్లో అవమానించి పనులు చేయని వారి వద్దే గౌరవం పొందాలని, పనులు చేయించాలనే ఉద్దేశంతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ విషయంలో అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఐదేళ్లలో ఏ అధికారి, ఉద్యోగి ఎలా పని చేశారో తమ వద్ద అన్ని వివరాలు ఉన్నాయని చెప్పారు. కాగా, వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి, తమను కలవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. తమకు ఉద్యోగాలు తిరిగి ఇవ్వాలంటూ మంగళవారం తనను కలసిన కొందరు వలంటీర్లనుద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు.

నా కొ..ల్లారా.. కళ్లు మూసుకున్నారా?

నాణ్యత లేకుండా రోడ్డు ఎలా వేస్తారంటూ అయ్యన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తమాషాలు చేస్తున్నారా..? కళ్లు మూసుకుపోయి ఏడుస్తున్నారా.. నా కొడకల్లారా..' అంటూ బూతులతో విరుచుకుపడ్డారు. పని చేయడానికి ఇష్టం లేకపోతే.. పోండి అంటూ గద్దించారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు మున్సిపాలిటీ నిధులను వినియోగించటంపై అధికారులను ప్రశ్నించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లేదని.. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. తప్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయడం తథ్యమన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడితో ఎన్నికల కోసం ఈ రోడ్డు వేశారని మండిపడ్డారు.

తమాషాలు చేస్తున్నారా..

'తమాషాలు... (బూతు)? ఇష్టం లేకపోతే ... (బూతు)' అంటూ మున్సిపల్ అధికారులపై నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు నడిరోడ్డు మీద బూతులతో రెచ్చిపోయారు. 'నేను అసెంబ్లీ స్పీకర్‌ను అవుతున్నా.. మిమ్మల్ని గంటల కొద్దీ నిలబెడతా..' అంటూ పరుష పదజాలంతో దుర్భాషలాడారు. 'కళ్లు మూసుకుపోయి ఏడుస్తున్నారా నా కొడకల్లారా!' అంటూ నోరు పారేసుకున్నారు. 'నర్సీపట్నంలో దిక్కుమాలిన మున్సిపల్ కమిషనర్ ఒకడున్నాడు. వాడి సంగతి తేలుస్తా' అంటూ చిందులు తొక్కారు. మంగళవారం నర్సీపట్నం నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులను వెంటబెట్టుకొని అబిద్ సెంటర్‌లో ఇటీవల నిర్మించిన వంద అడుగుల మెయిన్ రోడ్డు, ఆరిలోవ అటవీ ప్రాంతం వద్ద నర్సీపట్నం–కేడీపేట రోడ్డును పరిశీలించిన క్రమంలో అయ్యన్న బూతు పురాణానికి అధికారులు నిశ్చేష్టులయ్యారు.

గత ప్రభుత్వ తొత్తులు తప్పుకోండి

కొందరు పోలీసులు వైఎస్సార్‌సీపీ తొత్తులుగా పని చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. మంత్రి పదవి చేపట్టాక తొలిసారిగా సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న అనంతరం సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఖాకీ చొక్కా వదిలిపెట్టి వైఎస్సార్‌సీపీ కండువా వేసుకునేందుకు కూడా కొంత మంది పోలీసులు సిద్ధమయ్యారన్నారు. అలాంటి పోలీసులకు తాను హెచ్చరికలు జారీ చేస్తున్నానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రక్తం ఇంకా మీలో ప్రవహిస్తోందన్న ఫీలింగ్ ఉంటే మీ అంతట మీరే తప్పుకోవాలని పోలీసులకు హెచ్చరికలు జారీ చేస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ప్రతి సంఘటనపై విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాలకు పేర్లు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆరు పథకాలకు టీడీపీ ప్రభుత్వం పేర్లు మార్చింది. ఈ మేరకు సాంఘిక సంకేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్‌గా 'నాడు–నేడు' డాష్ బోర్డు పేరు మార్పు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం 'మనబడి నాడు–నేడు' పేరుతో ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పనుల పురోగతితో పాటు అన్ని అంశాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకునేందుకు ఓ ప్రత్యేక కమిషనర్‌ను కూడా నియమించింది. అయితే, ఇప్పటి వరకు పాఠశాల విద్యాశాఖలో 'నాడు–నేడు' పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను 'స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్'గా పేరు మార్చారు. ఈ విభాగంలో రాష్ట్రంలోని సుమారు 45 వేల ప్రభుత్వ పాఠశాలల పునర్ నిర్మాణంతో పాటు 11 రకాల సదుపాయాలను కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ విభాగం చేపట్టింది.

2019-2024 మధ్య పథకం పేరు	ప్రస్తుతం మార్చిన పేరు
వైఎస్సార్ కళ్యాణమస్తు	చంద్రన్న పెళ్లి కానుక
వైఎస్సార్ విద్యోన్నతి	ఎన్టీఆర్ విద్యోన్నతి
జగనన్న విద్యా దీవెన	పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్(ఆర్టీఎఫ్)
జగనన్న వసతి దీవెన	పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్(ఎంటీఎఫ్)
జగనన్న విదేశీ విద్యా దీవెన(ఎస్సీలకు)	అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి(ఏఓవీఎన్)
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం(జేసీఎస్‌పీ)	ఇన్‌సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్

టోలు ఒలుస్తున్నారు!



సాక్షి, అమరావతి: వాహనంతో రోడ్డెక్కితే చాలు 'టోలు' ఒలిచేస్తున్నారు. దేశంలో టోల్ చార్జీల రాబడి రికార్డుస్థాయిలో పెరిగింది. దేశంలో 2023–24లో రూ.64,809 కోట్లు టోల్ చార్జీల రూపంలో వసూలు చేయడం విశేషం. ఇది 2022–23 కంటే 39శాతం అధికం. కేంద్ర ప్రభుత్వం 'బిల్డ్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్'(బీవోటీ) విధానంలో జాతీయ రహదారులను నిర్మిస్తుండటంతో కొత్త రహదారులు టోల్ చార్జీల పరిధిలోకి వస్తున్నాయి. దేశంలో 2022 డిసెంబర్ నాటికి 35,996 కి.మీ.మేర టోల్ చార్జీలు వసూలు చేసే జాతీయ రహదారులు ఉండేవి. కాగా, 2023 డిసెంబర్ నాటికి జాతీయ రహదారులు 45,428 కి.మీ.కు పెరిగాయి. దాంతోపాటు వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో టోల్ చార్జీల రూపంలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)కు ఆదాయం అమాంతంగా పెరుగుతోంది.

8 కోట్లకుపైగా ఫాస్టాగ్‌లు

వాహనదారుల నుంచి టోల్ చార్జీల వసూలు చేసేందుకు 2023, డిసెంబర్ నాటికి 8కోట్లకు పైగా ఫాస్టాగ్‌లను జారీచేశారు. దీంతో ప్రస్తుతం దేశంలో రోజుకు సగటున రూ.147.31కోట్లు టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్నారు. ఇక త్వరలోనే శాటిలైట్ ఆధారిత టోల్ ఫీజు విధానాన్ని ఎన్‌హెచ్‌ఏఐ ప్రవేశపెట్టనుంది. టోల్ చార్జీలను కూడా దశలవారీగా పెంచనుంది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్ చార్జీలు పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ ముందుగా నిర్ణయించింది. కానీ, సాధారణ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయం అమలును రెండు నెలలు వాయిదా వేసింది. ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత 5శాతం టోల్ చార్జీలను పెంచింది. శాటిలైట్ ఆధారిత టోల్ ఫీజు అమల్లోకి వచ్చినప్పుడు మళ్లీ పెంచే అవకాశం ఉంది. దీంతో వాహనదారులపై టోల్ చార్జీల భారం మరింత పెరగనుంది.

దేశంలో టోల్ చార్జీల ద్వారా ఎన్‌హెచ్‌ఏఐ ఆదాయం వివరాలు

ఏడాది	వసూలైన మొత్తం (రూ.కోట్లలో)
2018-19	25,154.76
2019-20	27,637.64
2020-21	27,923.80
2021-22	33,907.72
2022-23	48,028.22
2023-24	64,809

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జూలై 12న ఎన్నిక

షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల కమిషన్

సాక్షి, అమరావతి: శాసన మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జూలై 12న ఉప ఎన్నిక జరగనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. సి.రామచంద్రయ్య, ఎండీ ఇక్బాల్‌పై అనర్హత వేటు పడటంతో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎమ్మెల్యేల కోటాకి చెందిన ఈ 2 స్థానాలకు జూలై 12న ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 25న జారీ కానుంది.

ఏపీలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 12న ఉప ఎన్నిక

- దేశంలో మొత్తం ఐదు స్థానాలకు ఎన్నికలు
- ఈ నెల 25న నోటిఫికేషన్
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యే కోటాలో ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీతో పాటు కర్ణాటక, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని ఒక్కో స్థానానికి మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జూలై 12న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. వీటిలో మూడు స్థానాలకు ఎమ్మెల్సీల రాజీనామా కారణంగా, రెండు స్థానాలకు అనర్హత వేటు కారణంగా ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఏపీలో సి.రామచంద్రయ్యపై అనర్హత వేటు పడగా, షేక్ మహ్మద్ ఇక్బాల్ రాజీనామా చేశారు. దీంతో ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఇద్దరి పదవీకాలం 2027 మార్చి 29 వరకు ఉంది. ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జూన్ 25న నోటిఫికేషన్ విడుదల కానుంది. జూలై 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

బ్యాలెట్టే బెటర్

▶ మొదటి పేజీ తరువాయి

పోస్ట్ చేశారు. 'న్యాయం జరగడం ఒక్కటే ముఖ్యం కాదు. జరిగినట్లు కనిపించాలి కూడా. ప్రజాస్వామ్యం గెలవడంతోపాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి కూడా. ప్రపంచం మొత్తం మీద అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈవీఎంలు కాదు. దేశంలోనూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను పక్కన పెట్టాలి. ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు కదలాలి. అప్పుడే ప్రజాస్వామ్యం నిస్సందేహంగా మనగలదు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

క్లుప్తంగా...

సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ

డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి సచివాలయానికి..

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్‌కళ్యాణ్ మంగళవారం మధ్యాహ్నం తొలిసారిగా వెలగపూడిలోని సచివాలయానికి వచ్చారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి నేరుగా మొదటి బ్లాక్‌లోని సీఎం చాంబర్‌కు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. సుమారు గంటన్నర పాటు ఈ భేటీ కొనసాగింది. కాగా, పవన్ బుధవారం విజయవాడలోని తన అధికారిక క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల బాధ్యతలను స్వీకరించనున్నట్టు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. మంగళవారం ఉదయమే పవన్ విజయవాడలో తనకు కేటాయించిన క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కన్నబాబు ఆయనకు స్వాగతం పలికారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు సహించం


పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను సహించేది లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రెండు రోజుల కిందట తెనాలిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్లో (ఎంఎల్ఎస్) తనిఖీ చేసినప్పుడు కందిపప్పు, పంచదార, పామాయిల్ పరిమాణంలో వ్యత్యాసం కనిపించిందన్నారు. ఒక్కో ప్యాకెట్లో 50–80 గ్రాములు తక్కువ తూకంతో వినియోగదారుడు నష్టపోతున్నట్టు గుర్తించామని తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని 253 మండల స్థాయి స్టాక్ పాయింట్లలో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు 62 ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు పూర్తవగా 24 చోట్ల అక్రమాలు బయటపడ్డాయన్నారు. ప్రజలకు న్యాయంగా అందాల్సిన నిత్యావసరాల్లో దోపిడీకి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరుకులు సరఫరా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ధాన్యం రైతులకు కూడా బాసటగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సకాలంలో పూర్తి చేయాలి

గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో మంగళవారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో ఇళ్లను నిర్మించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయడానికి వీలుగా సిబ్బంది ఉండాలన్నారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను డెప్యూటేషన్‌పై తీసుకోవడంతో పాటు, రిటైర్ అయిన ఉద్యోగుల సేవలను వాడుకునే అంశంపై నివేదిక సమర్పించమని సూచించారు. ఆప్షన్–3 ఇళ్ల నిర్మించే కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి ఆ ఇళ్లను వేగంగా నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్, ఎండీ గిరీశ సమీక్షలో పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె రూరల్: రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించేలా ప్రజలు మెచ్చుకునే పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మంత్రి సత్యప్రసాద్ బాపట్ల జిల్లా రేపల్లెలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పేదల హక్కులను పరిరక్షించే విధంగా రాష్ట్రంలో సుపరిపాలన చేస్తామన్నారు. విజన్ కలిగిన చంద్రబాబునాయుడు, నిబద్ధత కలిగిన పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడడంతో పాటు అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాలు విజయవంతంగా పూర్తి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో నమ్మకంతో రెవెన్యూశాఖ మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించటం ఆనందంగా ఉందని తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, పంతాని మురళీధరరావు పాల్గొన్నారు.

‘పోలవరం’ పనుల్లో సంక్షోభం.. బాబు తప్పిదం వల్లే..

▶ మొదటి పేజీ తరువాయి


పూర్తి అవాస్తవాలు, పచ్చి అబద్ధాలన్నారు. పోలవరం పర్యటన సందర్భంగా ఆయన చేసిన తప్పులను గుర్తుచేసుకోకుండా.. వైఎస్ జగన్‌పై బురదజల్లేందుకు చంద్రబాబు ప్రయత్నించారని మండిపడ్డారు. ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తిచేయడానికి 2019–24 మధ్య వైఎస్ జగన్ చిత్తశుద్ధితో కృషిచేశారని.. స్పిల్ వే, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తిచేసి గోదావరి వరద ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించారని గుర్తుచేశారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను ఒప్పుకుని చిత్తశుద్ధితో ప్రాజెక్టును పూర్తి చేయడంపై దృష్టిపెట్టాలని అంబటి చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

వాస్తవాలు అవాస్తవాలు అవుతాయా..?

ప్రమాణ స్వీకారం చేసిన ఐదు రోజులకే సోమవారం చంద్రబాబు పోలవరాన్ని సందర్శించారు. అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఆయనచేసిన తప్పులన్నీ వైఎస్ జగన్‌పై నెట్టేందుకు యత్నించారు. కానీ, పోలవరం పూర్తిచేయాలంటే ఇంకా నాలుగేళ్లు పడుతుందని అధికారులు చెబుతున్నారంటూ బాబు వెల్లడించారు. పోలవరంలో విధ్వంసానికి వైఎస్ జగనే కారణమని ఆయన పదే పదే చెప్పే ప్రయత్నం చేశారు. నిజానికి.. 2019కి ముందు చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాలే పోలవరం విషయంలో సంక్షోభం వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాబు వ్యూహాత్మక, చారిత్రక తప్పిదాలే ఈ పరిస్థితికి దారితీశాయి. ముందుగా గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, తర్వాత ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాం పూర్తిచేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చంద్రబాబు చేపట్టడమే దీనికి ప్రధాన కారణం. డయాఫ్రం వాల్‌తో పాటు ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ పనులు సమాంతరంగా చేపట్టారు. జర్మనీకి చెందిన బావర్ సంస్థ డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిచేసి రూ.460 కోట్లు బిల్లులు తీసుకుంది. చివరకు కాఫర్ డ్యాంల మధ్య ఖాళీలు ఉంచేయడంతో వరదలకు డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది. ఇదీ వాస్తవం. దీన్ని దాచిపెట్టి, కాంట్రాక్టర్‌ను మార్చడంవల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందన్నట్లుగా చంద్రబాబు అవాస్తవాలు చెబుతున్నారు. అంతేకాక.. ఇటు స్పిల్ వే, కాఫర్ డ్యాం పూర్తిచేయకపోడం, గోదావరి నదిని డైవర్షన్ చేయకపోవడంవల్ల 54 గ్రామాలు ముంపు సమస్యను ఎదుర్కొన్నాయనే వాస్తవాన్ని దాచిపెడుతున్నారు. వీటికి సమాధానం చెప్పకుండా మీరు చేసిన తప్పులను వైఎస్ జగన్ పైకి నెట్టేసి పబ్బం గడుపుకుందామనుకుంటున్నారా చంద్రబాబూ? పోలవరంలో జరిగిన అంశాలు ఏమిటనే విషయాన్ని ప్రజలు, మేధావులు, ఇరిగేషన్ మీద అవగాహన ఉన్న వాళ్లు అర్థంచేసుకోవాలి.

ఐదేళ్లలో పూర్తిచేస్తామని చెప్పలేకపోతున్నారు..

నిజానికి.. చంద్రబాబువల్లే ఈ రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగింది. జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఆలస్యానికి చంద్రబాబే కారణం. చివరకు.. ఇప్పుడు ప్రజలు అధికారం ఇచ్చినా సరే ఐదేళ్లలో పూర్తిచేస్తామనే మాట చంద్రబాబు చెప్పలేకపోతున్నారు. 2019కి ముందు చంద్రబాబు అశాస్త్రీయంగా ఆలోచించడంవల్లే ఈ పరిస్థితి దాపురించింది.. అప్పట్లో సొంత తెలివితేటలు ఉపయోగించడంవల్ల ఆయన అనేక తప్పులు చేశారు. ఇవాళ వైఎస్ జగన్ మీద విరుచుకుపడడం అన్యాయం.



ప్రాజెక్టు నిర్మాణాన్ని వివరిస్తున్న అంబటి రాంబాబు

శరవేగంగా పనులు చేసింది వైఎస్ జగనే..

ఇక దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను ఏం చేయాలన్న దానిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇప్పటికీ నిర్దిష్టమైన నిర్ణయానికి రాలేదు. ప్రాజెక్టులో 72 శాతం పూర్తిచేశామని చంద్రబాబు చెబుతుండటం విడ్డూరం. ఎందుకంటే..

- ➤ మేం కట్టిన పోలవరం స్పిల్‌వే మీద చంద్రబాబు ప్రయాణించారని తెలుసుకోవాలి. మేమే రెండు కాఫర్ డ్యాంలు పూర్తిచేశాం.
- ➤ అలాగే, గోదావరి నదిని పూర్తిగా స్పిల్‌వే మీదుగా డైవర్షన్ చేశాం.
- ➤ స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్ కూడా పూర్తిచేశాం.
- ➤ ఇవికాక క్రిటికల్ నిర్మాణాలు పూర్తిచేసి, గేట్లన్నీ పెట్టి ప్రస్తుతం ఎంత వరద వచ్చినా ఆపరేట్ చేసే పరిస్థితికి ప్రాజెక్టును తీసుకెళ్లాం.
- ➤ కానీ, చంద్రబాబు మసిపూసి మారేడు కాయచేసే ప్రయత్నం చేస్తున్నాడు.

‘హోదా’ తీసుకురాకపోతే ద్రోహిగా మిగిలిపోతారు..

చంద్రబాబుకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. భగవంతుడు, ప్రజలు మీకు అవకాశం ఇచ్చారు. కూటమిని గెలిపించారు. టీడీపీకి 16 ఎంపీ సీట్లు ఇచ్చారు. కేంద్రంలో ప్రధాని మోదీ చంద్రబాబు మీద ఆధారపడే పరిస్థితి ఇప్పుడు నెలకొంది. చంద్రబాబు చాలా లక్కీ. ఆంధ్రప్రదేశ్‌కు కూడా లక్కీయే. ఇలాంటి పరిస్థితి రావాలని వైఎస్ జగన్ చాలాసార్లు కోరుకున్నారు. ఆయనకు రాని అవకాశం టీడీపీకి వచ్చింది. ఇప్పుడు ధర్మపోరాట దీక్షలు అవసరంలేదు. మీ చేతిలో పరిస్థితి ఉంది. ప్రత్యేక హోదాను తీసుకురావాలి. ఆంధ్ర రాష్ట్రానికి ప్రాణం పోయండని చంద్రబాబును రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీన్ని ఉపయోగించుకోలేకపోతే రాష్ట్రానికి చంద్రబాబులాంటి ద్రోహి ఎవరూ ఉండరని మనవి చేస్తున్నా. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం వంటివన్నీ వదిలేసి వైఎస్ జగన్‌ను రోజూ తిట్టుకుంటూ ఉంటే మిమ్మల్ని ఎవరు నమ్ముతారు బాబూ.

జగన్ ఏ తప్పూ చేయలేదు..

మరోవైపు.. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం వెళ్తానంటున్నారు. వైఎస్ జగన్‌ను దూషించడమే పనిగా పెట్టుకోబోతున్నారు. కాబట్టి దీన్ని కూలంకషంగా ప్రజలు అర్థం చేసుకోవాలి. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నా.. పోలవరం పనుల్లో జగన్ ఎలాంటి తప్పుచేయలేదు. శరవేగంగా ప్రాజెక్టును పూర్తిచేయడానికి చిత్తశుద్ధితో కృషిచేశారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్లే పోలవరానికి ఈ దుస్థితి పట్టింది. నాలుగేళ్లకు పూర్తవుతుందా? ఐదేళ్లకు పూర్తవుతుందా? అనే అంశాన్ని అపర మేధావినని, చక్రం తిప్పానని చెప్పుకుంటున్న చంద్రబాబు కూడా చెప్పలేని దుస్థితికి రావడానికి కారణం.. ఆయన ప్రభుత్వం చేసిన తప్పిదం తప్ప మరొకటి కాదు. బాబు హయాంలో జరిగిన విధ్వంసంవల్ల ప్రతి తెలుగువాడూ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి తప్పూ చేయలేదు. చంద్రబాబు తన తప్పులను ఒప్పుకోవాలి.

ఆ 32 వేలమంది మహిళల ఆచూకీ కనిపెట్టండి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు జడా శ్రావణ్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా అదృశ్యమయ్యారన్న 32 వేలమంది మహిళలను రక్షించేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను జైభీం రావు భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా మానవ అక్రమ రవాణాకు గురైన ప్రతి మహిళ ఆచూకీని కనిపెట్టి వారి కుటుంబాల దగ్గరకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ‘మహిళల అక్రమ రవాణాపై కేంద్ర హోంశాఖ మీకు రహస్య సమాచారం ఇచ్చింది. ఇప్పుడు కేంద్రంలో మీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. కేంద్ర హోం మంత్రి మీ వ్యక్తే. అందుకే అదృశ్యమైన మహిళలను రక్షించి వారి కుటుంబాల దగ్గరకు చేరిస్తే ఉప ముఖ్యమంత్రిగా మీ గౌరవం అత్యున్నతంగా పెరుగుతుంది’ అని పేర్కొన్నారు. నిత్యం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో మిస్సింగ్ కేసులను జల్లెడ పట్టాలన్నారు. మహిళల అదృశ్యానికి కారణమైన ప్రతి వలంటీర్‌పై కేసులు పెట్టాలని ఆయన సూచించారు.

మంత్రులకు చాంబర్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర మంత్రులకు సచివాలయంలో చాంబర్లను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు బ్లాక్–2 మొదటి అంతస్తులోని 211 నంబర్ చాంబర్‌ను, మానవవనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు బ్లాక్ 4– మొదటి అంతస్తులోని 208 నంబర్ చాంబర్‌ను కేటాయించింది. మొత్తం 25 మంది మంత్రులకు బ్లాక్ –2 నుంచి బ్లాక్–5 వరకు కార్యాలయాల కేటాయింపును పూర్తి చేసింది.

వైఎస్ జగన్‌కు చెడు జరగాలని కోరుకుంటున్నారా?

- వీలైనంత త్వరగా జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించాలి
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెక్యూరిటీని తెల్లారేసరికి తీసేయడం ఎంతవరకు కరెక్ట్ అని ఆ పార్టీ అధికార ప్రతినిధి కె.రవిచంద్రారెడ్డి ప్రశ్నించారు. ఆయనకు చెడు జరగాలని కోరుకుంటున్నారా? లేక మీ స్పాన్సర్డ్ మీడియాను పంపి హడావుడి చేయిస్తారా? అని నిలదీశారు. ఆయన మంగళవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వీఐపీలు ఉండే రోడ్లలో చెక్‌పోస్టులు ఉండటం, ఐడీ కార్డు అడగడం ప్రతిచోటా ఉంటుందని చెప్పారు. తమ పార్టీ తరపున కేంద్రానికి అప్పీల్ చేస్తున్నామని, వైఎస్ జగన్‌కి వీలైనంత త్వరగా జెడ్ ప్లస్ సెక్యూరిటీని కల్పించాలని కోరుతూ కేంద్రానికి రిప్రజెంటేషన్ కూడా ఇస్తామని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. ప్రభుత్వ ఉద్యోగులు చాలా విలువను పొందుతున్నామని అనుకుంటున్నారేమోగానీ ఉద్యోగులపై అప్పుడే చంద్రబాబు వివక్ష మొదలైంది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులను ఈనాడులో జలగన్నలంటూ రాశారు. అధికారులను అవమానిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ అధికారులను అదిరించి, బెదిరించి తన అజమాయిషీ చాటుకున్నారు. వారిని అనేక రకాలుగా అవమానించారు. మేం ఇంత త్వరగా రెస్పాండ్ కాకూడదని, ఈ ప్రభుత్వానికి 3 నెలలో, 6 నెలలో సమయం ఇవ్వాలని అనుకున్నాం. అప్పటివరకు ఆరోపణలు చేయకూడదనుకున్నాం. ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకపోతే నిలదీయాలనుకున్నాం. కానీ ప్రభుత్వ అధికారులను అవహేళన చేసేవిధంగా రాయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నిస్తున్నాం. 2014 నుంచి 2019 వరకు డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు రాజమౌళి ఐఏఎస్, కేవీవీ సత్యనారాయణ, వెంకయ్యచౌదరి, కల్నల్ అశోక్‌బాబు, సంధ్యారాణి (పోస్టల్ డిపార్ట్‌మెంట్), గురుమూర్తి (సెంట్రల్ సర్వీస్), శ్రీనివాస్ (సర్వశిక్షా అభియాన్), జాస్తి కృష్ణకిశోర్ (తాళాలన్నీ ఇతడికే ఇచ్చారు కదా), వెంకటేశం (సమాచార కమిషనర్), రమణారెడ్డి (రైల్వే శాఖ).. వీరందరికీ ఇలాంటి పేర్లు ఏం పెట్టాలి? వీరంతా అనకొండలా లేక కొండచిలువలా? మేం ప్రశ్నిస్తున్నది సదుద్దేశంతోనే. అంతేగానీ అవహేళన చేయడానికి కాదు. ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ దాడులు దేనికి నిదర్శనం? రాబోయే రోజుల్లో మీరే చింతించాలి. ప్రజలంతా గమనిస్తున్నారు.

అడ్వొకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్

- సీఎం చంద్రబాబు నిర్ణయం
- గవర్నర్ ఆమోదమే తరువాయి
- అదనపు ఏజీ పోస్టు ఉంటుందా? లేదా?
- ఉంటే ఒక పోస్టా? రెండా?
- ఒక పోస్టే అయితే జనసేనకు అవకాశం
- పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం ఆలస్యం
- శ్రీరామ్, పొన్నవోలు, నాగిరెడ్డి రాజీనామాలు ఆమోదం

సాక్షి, అమరావతి: అందరూ ఊహించిన విధంగానే రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కానున్నారు. ఆయన నియామకానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏజీగా దమ్మాలపాటిని నియమించాలన్నది చంద్రబాబు అభిలాష అని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కోరారు. దీంతో సీఎస్ ఏజీ నియామక ఫైల్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపారు. గవర్నర్ ఆమోద ముద్ర వేయగానే, దమ్మాలపాటి నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయి.

రెండోసారి ఏజీగా దమ్మాలపాటి

ఏజీగా దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కావడం ఇది రెండోసారి. 2016లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఆయన ఏజీగా సేవలందించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ అడ్వొకేట్ జనరల్ అయ్యారు. , దమ్మాలపాటి అదనపు ఏజీగా నియమితులయ్యారు. 2016లో వేణుగోపాల్ ఏజీ పదవికి రాజీనామా చేశారు. దీంతో 2016 మే 28న దమ్మాలపాటి శ్రీనివాస్ అడ్వొకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి 2019లో చంద్రబాబు అధికారం కోల్పోయేంత వరకు ఏజీగా కొనసాగారు.



దమ్మాలపాటికే పూర్తి స్వేచ్ఛ

ఏజీ నియామకం కొలిక్కి రావడంతో అదనపు ఏజీ (ఏఏజీ), ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదులు (ఎస్జీపీ), ప్రభుత్వ న్యాయవాదులు (జీపీ), సహాయ ప్రభుత్వ న్యాయవాదుల (ఏజీపీ) పోస్టులను త్వరలోనే భర్తీ చేసే అవకాశం ఉంది. అదనపు ఏజీ పోస్టు భర్తీ చేస్తారా లేక గతంలోలా ఆ పోస్టును భర్తీ చేయకుండా వదిలేస్తారా అన్న దానిపై న్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒకవేళ ఏఏజీ పోస్టును భర్తీ చేస్తే జనసేన లేదా బీజేపీల్లో ఒకరికి ఇచ్చే అవకాశం ఉంది. అదనపు ఏజీ పోస్టు ఒకటా లేక రెండు ఉంటాయా అన్నది కూడా తేలాల్సి ఉంది. ఒక అదనపు ఏజీ పోస్టు మాత్రమే భర్తీ చేస్తే జనసేనకే అవకాశం ఉంది. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) నియామకం కొంత సుదీర్ఘ ప్రక్రియ. హైకోర్టును సంప్రదించిన తరువాతే పీపీని నియమించాలి. అందువల్ల పీపీ నియామకం అలస్యమవుతుంది. టీడీపీ నుంచి ఎవరిని జీపీలు, ఏజీపీలు చేయాలన్న విషయంపై ఇప్పటికే ప్రాథమిక కసరత్తు పూర్తి చేసినట్లు తెలిసింది. జీపీలు, ఏజీపీలతో పాటు స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకాల్లో గతంలోలానే దమ్మాలపాటి శ్రీనివాస్‌కు చంద్రబాబు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు తెలిసింది.

శ్రీరామ్ తదితరుల రాజీనామాలకు ఆమోదం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అడ్వొకేట్ జనరల్‌గా పనిచేసిన శ్రీరామ్, అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

దమ్మాలపాటి వైపే చంద్రబాబు మొగ్గు

తాజాగా ఏజీ పోస్టుకి పలువురి పేర్లు వినిపించాయి. సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు సహా పలువురి పేర్లు చర్చకు వచ్చాయి. అయితే చంద్రబాబు చివరకు దమ్మాలపాటి వైపే మొగ్గు చూపారు. గతంలో ఏజీగా పనిచేసి ఉండటం, పలు విపత్కర పరిస్థితుల నుంచి చంద్రబాబుతో సహా పార్టీ ఇతర నేతలను బయటపడేయడం, పార్టీలో అందరికీ అందుబాటులో ఉండటం వంటివి దమ్మలపాటికి కలసి వచ్చాయి. న్యాయవ్యవస్థలో దమ్మాలపాటికి మంచిపట్టు ఉండటం కూడా ఆయనకు సానుకూల అంశంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం ఉన్నంతకాలం ఆయన ఏజీ పదవిలో కొనసాగుతారు.

ముంబై.. చాలా కాస్ట్లీ గురూ!

ప్రవాసులకు ఖరీదైన నగరంగా దేశంలోనే అగ్రస్థానం

- ఆ తర్వాత ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్
- దేశ ఆర్థిక రాజధానిలో భారీగా పెరిగిన జీవన వ్యయం
- మెర్సర్– ‘2024 కాస్ట్ ఆఫ్ లివింగ్’ సర్వేలో వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో హాంకాంగ్



సాక్షి, అమరావతి: ప్రముఖ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ సంస్థ మెర్సర్– ‘2024 కాస్ట్ ఆఫ్ లివింగ్’ సర్వే ప్రకారం దేశంలోనే అత్యంత ఖరీదైన నగరాల్లో ముంబై అగ్రస్థానంలో నిలిచింది.దేశ ఆర్థిక రాజధానిగా పిలిచే ముంబైలో జీవించే ప్రవాసుల జీవన వ్యయం గణనీయంగా పెరిగినట్టు ఈ సంస్థ వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 11 స్థానాలు ఎగబాకి 136వ స్థానానికి చేరుకుంది. ఢిల్లీ 164, చెన్నై ఐదు స్థానాలు దిగజారి 189వ స్థానానికి, అలాగే బెంగళూరు ఆరు స్థానాలు క్షీణించి 195వ స్థానానికి చేరుకున్నాయి. హైదరాబాద్ 202వ స్థానంలో స్థిరంగా కొనసాగుతోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వేరొక నగరం, దేశానికి వలస వెళ్లి జీవించడంలో జీవన వ్యయం కీలక పాత్ర పోషిస్తున్నది. స్థానిక ఆర్థిక పరిస్థితులు కొన్ని నగరాలను ప్రవాసులకు మరింత ఖరీదైనవిగా చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ వరుసలోనే పూణే ఎనిమిది స్థానాలు ఎగబాకి 205వ, కోల్‌కతా నాలుగు స్థానాలు ఎగబాకి 207వ స్థానానికి చేరుకున్నాయి.

ఇక్కడ ఈ ఖర్చులు ఎక్కువ

ఆసియాలో అత్యంత ఖరీదైన నగరంగా ముంబై 21వ స్థానం, ఢిల్లీ 30వ స్థానంలో ఉన్నాయి. ఢిల్లీలో ఈ ఏడాది గృహాల అద్దెలు 12–15 శాతం పెరిగాయి. ముంబైలో 6–8 శాతం, బెంగళూరు, పూణే, హైదరాబాద్, చెన్నైలలో 2–6 శాతం పెరుగుదల నమోదైనట్లు నివేదిక చెబుతున్నది. ఇక ముంబైలో రవాణా ఖర్చులు భారీగా ఉంటున్నాయి. ఆ తర్వాత బెంగళూరు ఉంది. పాల ఉత్పత్తులు, రొట్టెలు, పానీయాలు, నూనెలు, పండ్లు, కూరగాయలు వంటి రోజువారీ నిత్యావసరాల కోసం కోల్‌కతాలో పొదుపుగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కేవలం ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులు ఢిల్లీలో అత్యంత తక్కువ ధరలకు లభిస్తున్నాయి. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల ఖర్చుల్లో మాత్రం ముంబై అందనంత ఎత్తులో ఉంది. దీని వెనుకే చెన్నై ఉంది. ఎనర్జీ, యుటిలిటీ ఖర్చుల్లో ముంబై, పూణేలు భయపెడుతున్నట్లు నివేదిక పేర్కొంది.

హాంకాంగ్ మరోసారి

ప్రపంచవ్యాప్తంగా జీవన వ్యయాన్ని పరిశీలిస్తే మొదటి ఐదు నగరాలు ర్యాంకింగ్‌లో ఎటువంటి మార్పు కనిపించలేదు. హాంకాంగ్ (చైనా) అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, సింగపూర్, జ్యూరిచ్, జెనీవా, బాసెల్, బెర్న్ (స్విట్జర్లాండ్), న్యూయార్క్ సిటీ (యూఎస్), లండన్ (యూకే), నసావు (బహామాస్), లాస్ ఏంజిల్స్ (యూఎస్) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మెర్సర్ సర్వే ప్రపంచ వ్యాప్తంగా 227 నగరాల్లో జీవన వ్యయాన్ని అంచనా వేసింది. గృహనిర్మాణం, రవాణా, ఆహారం, దుస్తులు, గృహోపకరణాలు, వినోదం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. 2024లో అధిక జీవన వ్యయాన్ని ఖరీదైన గృహ వినియోగం, అధిక రవాణా ఖర్చులు, వస్తువులు, సేవల అధిక ధర, ద్రవ్యోల్బణం, మారకపు రేటు హెచ్చుతగ్గులు, యుటిలిటీలు, స్థానిక పన్నులు, విద్య తీవ్రంగా ప్రభావితం చేసినట్టు వివరించింది. అధిక జీవన వ్యయాలకు ప్రసిద్ధి చెందిన న్యూయార్క్ నగరం ఈ జాబితాలో ఏడో స్థానాన్ని పొందింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతాల్లోని నగరాలు టాప్–10లో ఎక్కువ సంఖ్యలో ఉండడం విశేషం. ఇందులో టోక్యో 5వ, బీజింగ్ 9వ స్థానంలో ఉన్నాయి.

దేశంలో అత్యంత ఖరీదైన నగరాల ర్యాంకులు

నగరం	2023	2024
ముంబై	147	136
ఢిల్లీ	169	165
చెన్నై	184	189
బెంగళూరు	189	195
హైదరాబాద్	202	202
పూణే	213	205
కలకత్తా	211	207

అంత్యక్రియల వ్యయం రూ.25 వేలకు పెంపు

ఏపీఎస్‌ఆర్టీసీ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందితే వారి అంత్యక్రియల కోసం మంజూరు చేసే మొత్తాన్ని రూ.15వేల నుంచి రూ.25వేలకు ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆర్టీసీ పాలకమండలి సమావేశంలో చేసిన తీర్మానాన్ని అనుసరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మృతిచెందితే అంత్యక్రియల వ్యయం కింద రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచడంతోపాటు ఆ నిర్ణయాన్ని 2022 జనవరి 1 నుంచి రెట్రాస్పెక్టివ్‌గా అమలు చేస్తామని కూడా ఆర్టీసీ పాలకమండలి ఫిబ్రవరి 21న నిర్ణయించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆర్టీసీ పాలకమండలి రాజీనామా చేయగా, ఆ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తూ ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. 2022 జనవరి 1 తరువాత మరణించిన ఆర్టీసీ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఇప్పటికే రూ.15వేలు చొప్పున అందించి ఉంటే మిగిలిన రూ.10వేలు కూడా త్వరలోనే వారి కుటుంబ సభ్యులకు అందజేస్తారు.

● తెలంగాణ

ఈవీఎంలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) వల్ల భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈవీఎం వ్యవస్థపై నెలకొన్న అనుమాన పరిస్థితుల్లో వాటి సామర్థ్యాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎలాన్ మస్క్ ఇండియాలో జరిగిన ఎన్నికలపై చేసిన కామెంట్స్ వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉన్నాయని చెప్పారు. 2018 ఎన్నికల్లో తన ఎన్నిక విషయంలో జరిగిన అవకతవకలన్నీ ఆయన లేవనెత్తిన అభ్యంతరాల్లో ఉన్నాయన్నారు. ఆరేళ్లు కావొస్తున్నా ఇంకా ఆ కేసు పెండింగ్‌లో ఉండటం కొంత అసహనానికి గురిచేస్తున్న పరిస్థితి అని దయాకర్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల సంఘం పనితీరుపై ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని గానీ లేదంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. ఈవీఎంలపై ఈ రకమైన అనుమానాలుండటం వల్ల మళ్లీ బ్యాలెట్ సిస్టంలో ఎన్నికలు జరపాలనే డిమాండ్స్ వస్తున్నాయన్నారు. వీటిపై కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్



కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్ జోన్‌లో ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ మంగళవారం కనిపించింది. నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని దోస్త్‌నగర్ అటవీ ప్రాంతంలో దీన్ని గుర్తించినట్లు డీఆర్వో ప్రకాశ్, ఎఫ్‌బీవో ప్రసాద్ తెలిపారు. ‘కలౌల పుల్ర్రా’ అని పిలువబడే ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ మైక్రో హాలిడే కుటుంబంలో భాగమైన ఒక చిన్న ప్రత్యేకమైన ఉభయచర జీవి అని డీఆర్వో ప్రకాశ్ చెప్పారు. గుండ్రని శరీరం విలక్షణమైన (గోధుమ, నారింజ, లేదా పసుపు) రంగు కలిగి ఉంటుందన్నారు. ఈ కప్పలు సాధారణంగా అడవుల నుంచి వ్యవసాయ భూములు, నీటి వనరుల ఉన్న చోట ఆవాసం ఏర్పచుకుంటాయని తెలిపారు. ఈ కప్పల ప్రధాన ఆహారం కీటకాలని, ఇవి రాత్రి పూట సంచరిస్తూ జిగట నాలుకతో కీటకాలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయని వివరించారు. పగలు వీటిని గుర్తించడం కష్టమన్నారు.



అన్ని రకాల దుఃఖం నుండి బయటపడి నిర్వాణాన్ని పొందాలంటే తృష్ణ సమూలంగా అంతరించక తప్పదు.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 19 జూన్ 2024

కలలు మాని... కళ్ళు తెరవాలి!

ఏడాది గడిచిందో లేదో... సరిగ్గా అదే రకమైన దుర్ఘటన. అవే రకమైన దృశ్యాలు. మళ్ళీ అవే అనునయ విచారాలు, నష్టపరిహారాలు, దర్యాప్తుకు ఆదేశాలు, భద్రతే తమకు ముఖ్యమంటూ సర్కారీ ప్రకటనలు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సీల్దా వెళుతూ ఆగివున్న కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి వచ్చిన ఓ గూడ్స్ రైలు గుద్దుకున్న సోమవారం నాటి ప్రమాద దృశ్యాలు, తదనంతర పరిణామాలు చూస్తే సరిగ్గా అలాగే అనిపిస్తుంది. నిరుడు జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, మరో రెండు రైళ్ళు ఢీ కొట్టుకోవడంతో 290 మందికి పైగా మరణించగా, వెయ్యి మందికి పైగా గాయపడ్డ దారుణ ఘటన ఇప్పటికీ మదిలో మెదులుతూనే ఉంది. ఇంతలోనే ఇప్పుడు ఈశాన్య సరిహద్దు రైల్వే జోన్‌లో జనం బక్రీద్ హడావిడిలో ఉండగా ఉదయం తొమ్మిది గంటల వేళ జరిగిన తాజా రైలు ప్రమాదం పాలకులు పాఠాలు నేర్చుకోలేదని తేల్చింది. గూడ్స్ పైలట్, కో–పైలట్ సహా పది మంది ప్రాణాలను బలి తీసుకొని, 40కి పైచిలుకు మందిని గాయాలపాలు చేసిన ఈ దుర్ఘటన మన రైల్వే వ్యవస్థలో లోటుపాట్లను మరోసారి బయటపెట్టింది.

ప్రమాదం జరగడానికి మూడు గంటల ముందు ఉదయం 5.50 గంటల నుంచే రెండు స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ చెడిపోయిందని వార్తలు వచ్చాయి. సిగ్నల్‌ను పట్టించుకోకుండా గూడ్స్ ట్రైన్ ముందుకు పోవడం వల్లే ప్రమాదం సంభవించిందని రైల్వే బోర్డ్ ఛైర్‌పర్సన్ జయా వర్మ సిన్హా ఉవాచ. కానీ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయనప్పుడు రెడ్ సిగ్నళ్ళను పట్టించుకోకుండా ముందుకు సాగాల్సిందిగా సర్వసాధారణంగా ఇచ్చే టీఏ 912 మెమోను స్టేషన్ మాస్టర్ ఇవ్వడం వల్లే రైళ్ళు రెండూ ఒకే లైనులో ముందుకు సాగాయట. విభిన్న కథనాలు, వాదనలు, తప్పొప్పులు ఏమైనా అమాయకుల ప్రాణాలు పోవడం విచారకరం. లెక్క తీస్తే 2018–19 నుంచి 2022–23 మధ్య అయిదేళ్ళలో తీవ్ర పర్యవసానాలున్న రైలు ప్రమాదాలు సగటున ఏటా 44 జరిగాయి. దాదాపు 470కి పైగా జరిగిన 2000–01 నాటితో పోలిస్తే ఈ సంఖ్య తగ్గినట్టే కానీ, పెరిగిన సాంకేతికత, పాలకుల ప్రగల్భాలతో పోలిస్తే ఇప్పటికీ ఎక్కువే. ముఖ్యంగా రైళ్ళు ఢీ కొంటున్న ఘటనలు ప్రతి 3.6 నెలలకు ఒకటి జరుగుతున్నాయట. దేశంలోని మొత్తం 18 రైల్వే జోన్లలో దక్షిణ రైల్వే లాంటి ఆరింటిలో మినహా, మిగతా అన్నిటా నిరుడు ఏదో ఒక ప్రమాదం సంభవించింది.

రైలు ప్రమాదాలను అరికట్టాలనీ, ప్రయాణాల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వాలనీ చాలాకాలంగా చర్చ జరుగుతోంది. రైళ్ళు ఢీకొనే ప్రమాదం లేకుండా చూసేందుకు ప్రయోగాలూ సాగాయి. ప్రమాదాలను నివారించేందుకు ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ 'కవచ్'ను మూడు భారతీయ సంస్థలు దేశీయంగా రూపొందించాయి. ఈ 'కవచ్' భద్రతా వ్యవస్థ రైళ్ళ వేగాన్ని నియంత్రించడమే కాక, ప్రమాద సూచికలు డ్రైవర్ల దృష్టిని దాటిపోకుండా తోడ్పడుతుంది. మసక మసక చీకటిలోనూ భద్రతను అందిస్తుంది. ఇన్ని ప్రత్యేకతలున్న 'కవచ్'ను ప్రవేశపెట్టామని పాలకులు చాలా కాలంగా గొప్పలు చెబుతున్నారు. కానీ, భారత రైల్వే వ్యవస్థ దాదాపు లక్ష కిలోమీటర్ల పైచిలుకు పొడవైనది కాగా, దశలవారీగా 1500 కి.మీల మేర మాత్రమే 'కవచ్' ఇప్పటికి అందుబాటులోకి వచ్చింది. ఈ నత్తనడక ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వ పట్టింపులేనితనానికి నిదర్శనం.

అసలు ఒకప్పటిలా రైల్వేలకూ, రైల్వే శాఖకూ ప్రాధాన్యం ఉందా అంటే అనుమానమే. రైలు సేవల్లో సామాన్యుల హితం కన్నా హంగులు, ఆర్భాటాలు, ఎగువ తరగతి సౌకర్యాలకే పెద్ద పీట వేస్తున్నారు. సౌకర్యాల పేరిట అధిక ఛార్జీలు, వందే భారత్ రైళ్ళు, సుందరీకరణ లాంటివాటి మీదే సర్కారు దృష్టి తప్ప, సాధారణ రైళ్ళ సంగతి పట్టించుకోవట్లేదు. సరిపడా కోచ్‌లు, బెర్తులు కరవన్న మాట అటుంచి, కనీసం కూర్చొనే జాగా కూడా లేక శౌచాలయాల వద్దే ఒకరిపై ఒకరుపడుతున్న జనంతో క్రిక్కిరిసిన రైళ్ళు మన దేశంలో నిత్య దృశ్యాలు. వీటన్నిటి మధ్య భద్రత మాట సరేసరి! గతంలో సాధారణ బడ్జెట్‌కు దీటుగా రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ ఉండేది. 1924 నుంచి ఉన్న ఆ రెండు వేర్వేరు బడ్జెట్ల విధానానికి 2017లో బీజేపీ సర్కార్ స్వస్తి పలికింది. ఫలితంగా ఆ తర్వాత రైల్వే శాఖకు వెలుగు తగ్గింది. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదికి, అందులోనూ బీజేపీ పాలిత రాష్ట్రాలకే రైల్వే సౌకర్యాల విస్తరణలో సింహభాగం వడ్డిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఒకప్పటి రైల్వే మంత్రి, బెంగాల్ ప్రస్తుత సీఎం మమతా బెనర్జీ మాటల్లో చెప్పాలంటే, రైల్వేస్ ఇప్పుడో అనాథ.

ఇక, నిరుటి పాలనలో లాగే... కొత్త మోదీ సర్కారులోనూ అశ్వినీ వైష్ణవ్‌కే రైల్వే శాఖ అప్పగించారు. పేరుకు ఆయన రైల్వే మంత్రే కానీ, కీలకమైన ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ, సమాచార ప్రసార శాఖ సైతం ఆయన వద్దే ఉన్నాయి. దేనికదే అత్యంత ముఖ్యమైన మూడు శాఖలను వైష్ణవ్ ఒక్కరే నిర్వహించడం భారమే. ఇవన్నీ కాక సోమవారం రైలు ప్రమాదం జరిగిన కొద్ది గంటలకే... ఆయనను రానున్న అసెంబ్లీ ఎన్నికలకై మహారాష్ట్రలో పార్టీ ఎన్నికల కో–ఇన్‌ఛార్జ్‌గా కూడా బీజేపీ నియమించడం మరీ విడ్డూరం. పాలనా ప్రాధాన్యాల పట్ల అలసత్వానికి ఇది మచ్చుతునక. దేశంలో మునుపెన్నడూ జరగనంత ప్రమాదమైన బాలాసోర్ విషాదం తర్వాతా మనం మారలేదు. సీబీఐ దర్యాప్తు చేసి, ఛార్జ్‌షీట్ దాఖలు చేసినా ఆ కేసు ఇంకా కోర్టులోనే మూలుగుతోంది. అందుకే, ఇకనైనా సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునికీకరణ, రైల్వే ప్రయాణ భద్రతను పెంచడం ప్రాధమ్యం కావాలి. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌ల గురించి రంగుల కలలు చూపిస్తున్న మన పాలకులు తాజా ఘటనతోనైనా క్షేత్రస్థాయి వాస్తవాలపై కళ్ళుతెరవాలి. ఉట్టికెగరలేకున్నా, స్వర్గానికి నిచ్చెన వేస్తామంటే హాస్యాస్పదం.

గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.5.35 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** విశాఖ సా.4.23 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.8.36 నుండి 10.17 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.28 వరకు
అమృతఘడియలు: ఉ.6.52 నుండి 8.43 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

భీమా కోరేగావ్... ఓ అన్యాయ గాథ

భీమా కోరేగావ్ (మహారాష్ట్ర) కేసు మొదలై ఆరేళ్లవుతోంది. అక్కడ జరిగిన అల్లర్లకు కారణం కావడంతోపాటు, నిషేధిత మావోయిస్టు సంస్థ సభ్యులుగా ఉండి, ప్రధాని నరేంద్ర మోదీని చంపేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ 16 మందిని పుణె పోలీసులు 'ఉపా' కింద అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో న్యాయవాదులు, విద్యావేత్తలు, రచయితలు, కవులు, గాయకులు ఉన్నారు. వీరిలో ఎవరూ దోషులుగా తేలకుండానే, కనీసం విచారణనైనా ఎదుర్కోకుండా చాలా సంవత్సరాలు జైల్లో గడిపారు. కొందరు అతి కష్టం మీద బెయిల్ పొందారు, కొందరు ఇంకా జైల్లోనే ఉన్నారు. అయినా ఇప్పటికీ వారి మీద తుది అభియోగాలు మోపలేదు. విచారణ ఎప్పుడు మొదలవుతుందో తెలీదు. ఇలా ఏ ప్రజాస్వామిక దేశంలో అయినా జరుగుతుందా?

విశ్లేషణ



జూలియో రెబీరో

గుజరాత్‌కు చెందిన అల్పా షా నైరోబీలో పెరిగింది. నా దివంగత భార్య మెల్బా కూడా అక్కడే జన్మించి, పదేళ్ల వరకు అక్కడ ఉంది. కెన్యాలోని మౌ మౌ ఉద్యమం కారణంగా భారతీయ సంతతికి చెందిన అనేక కుటుంబాలు ఆ దేశాన్ని విడిచి రావలసి వచ్చింది. అలా భారత్‌కు వచ్చినవారిలో గోవాకు చెందిన నా భార్య వాళ్ల మెనెజెస్ కుటుంబాలు కూడా ఉన్నాయి. వీళ్లు గోవాకు వస్తే, అల్పా ఇంగ్లండ్‌కు వలస వెళ్లింది.

అల్పా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్నారు. ప్రస్తుతం ఆంత్రోపాలజీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 'నైట్‌మార్చ్', 'ఇన్ ది షాడోస్ ఆఫ్ ద స్టేట్' పుస్తకాలు రాశారు. ఆమె ఇటీవలి పుస్తకం 'ది ఇన్‌కార్సెరాషెన్స్: భీమా కోరేగావ్ అండ్ ద సెర్చ్ ఫర్ డెమోక్రసీ ఇన్ ఇండియా' మానవ హక్కుల కోసం పరితపించే ఈ నిబద్ధ యోధురాలిని నాకు పరిచయం చేసింది. అల్పా రాసిన 'ఇన్‌కార్సెరాషెన్స్...' (నిర్బంధాలు) మార్చిలో ప్రచురితమైంది. నిషేధిత మావోయిస్టు సంస్థ సభ్యులుగా ఉండి, ప్రధాని మోదీని చంపేందుకు కుట్ర పన్నినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 16 మంది వ్యక్తిగత చరిత్రను అల్పా పరిశీలించారు. మోదీని చంపేందుకు కుట్ర పన్నారనే ఆరోపణను కేసు తీవ్రత కోసం జోడించినట్లు కనిపిస్తోంది. విచారణ సమయంలో ఈ ఆరోపణ పునరావృతం కాలేదు.

భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన వారిలో న్యాయవాదులు, విద్యావేత్తలు, రచయితలు, కవులు, గాయకులు కూడా ఉన్నారు. వీరిలో కబీర్ కళా మంచ్ కవి సుధీర్ ధావలే, గాయకులు రమేశ్ గాయిచోర్, సాగర్ గోరఖే, జ్యోతి జగ్‌తాప్ వంటివారు కేసులోని ఇతరులకు తెలియనే తెలియదు. వీరిలో ఎవరూ దోషులుగా తేలకుండానే, చాలా ఏళ్ళు జైల్లో గడిపారు. క్రూరమైన 'ఉపా' (చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నిరోధక చట్టం) కింద వారిని అరెస్టు చేసినందున, ఈ ప్రక్రియే శిక్షగా మారింది. ఉపా కేసుల్లో బెయిల్ పొందడం దాదాపు అసాధ్యం. భీమా కోరేగావ్ నిందితులపై తుది అభియోగాలు ఇంకా రూపొందించలేదు. 2018లో మొదటి అరెస్టులు జరిగాయి. కొందరు బెయిల్‌పై ఉన్నారు, కొందరు ఇంకా జైలులో ఉన్నారు. వారి మీద సమీప భవిష్యత్తులో విచారణ ప్రారంభమయ్యే అవకాశం లేదు.

'జైలు కాదు, బెయిల్' అనేది సుప్రీంకోర్టును అలంకరించిన అత్యంత గౌరవనీయమైన న్యాయనిపుణులలో ఒకరైన జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ నిర్దేశించిన సూత్రం. ఆయన అన్నయ్య వీఆర్ లక్ష్మీనారాయణన్ నా ఐపీఎస్ సహోద్యోగి. సీబీఐలో పనిచేశారు. దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని చెప్పే సందర్భాల కోసం తెచ్చిన ఉపాను వాస్తవ ఆచరణలో, అన్యాయానికి సాధనంగా మార్చేశారు.

ఉపా కింద నిర్బంధానికి గురైన 16 మంది కార్యకర్తలు వివిధ వర్గాలకు చెందినవారు. ఇందులో నలుగురు క్రైస్తవులు: ఫాదర్ స్టాన్ స్వామి (ఇప్పుడు మరణించారు), తమిళనాడులోని ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించిన జెసూట్ మతగురువు వెర్నాన్ గోంసాల్వేస్, ముంబైకి చెందిన అరుణ్ ఫెరీరా, కేరళకు చెందిన రోనా విల్సన్. ముస్లిం అయిన హనీ బాబు కూడా కేరళకు చెందినవారే. ఈ కేసులో ఏడుగురు దళిత హక్కుల కార్యకర్తలు ఉన్నారు: దళిత దిగ్గజం బీఆర్ అంబేడ్కర్ మనమరాలు రమను వివాహం చేసుకున్న ఆనంద్ తేల్‌తుంబ్డేతో పాటు జ్యోతి జగ్‌తాప్, సాగర్ గోరఖే, రమేశ్ గాయిచోర్, సుధీర్ ధావలే, సురేంద్ర గాడ్లింగ్, షోమా సేన్ ఈ కేసులో భాగం. మిగిలిన నలుగురు అగ్రకుల హిందువులు. ఇందులో సుధా భరద్వాజ్‌తో పాటు, మహేశ్ రావూత్ (గడ్చిరోలికి చెందిన అటవీ హక్కుల కార్యకర్త), మానవ హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖా (వీరి భాగస్వామి సభా హుస్సేన్ మహిళా హక్కుల కార్యకర్త), హైదరాబాద్‌కు చెందిన వామపక్ష కవి వరవరరావు ఉన్నారు. ఈయన తన కవితలు, కార్యకలాపాలకుగాను గతంలోనూ జైలులో ఉన్నారు.



ఆనంద్ తేల్‌తుంబ్డే, సుధా భరద్వాజ్, స్టాన్ స్వామి, షోమా సేన్, అరుణ్ ఫెరీరా, గౌతమ్ నవ్‌లఖా, రోనా విల్సన్, వరవరరావు.

సుధా భరద్వాజ్, ఫాదర్ స్టాన్ స్వామి గిరిజన హక్కుల కోసం పోరాడారు. సుధ అమెరికాలో విద్యావేత్తలైన భారతీయ తల్లిదండ్రులకు జన్మించారు. కాన్పూర్ ఐఐటీలో చదువుకున్నారు. ఆమెకు అమెరికా పాస్‌పోర్ట్ ఉంది. చట్ట పరిధిలో హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనులతో తన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్న తర్వాత తన పాస్‌పోర్టును అప్పగించారు. బాంబే హైకోర్టు విడుదల చేయడానికి ముందు ఆమె మూడేళ్ల జైలు జీవితం గడిపారు. ఛత్తీస్‌గఢ్‌లో తమ భూమిని కోల్పోయిన గిరిజనుల పక్షాన వాదించడమే ఆమె చేసిన ఏకైక 'నేరం'. ఫాదర్ స్వామి నాయకత్వంలో గిరిజనులు అమలులో ఉన్న చట్టాలకు అనుగుణంగా తమ హక్కులపై అవగాహన పెంచుకున్నారు. ఈ చట్టాలు గిరిజనుల భూముల్లో ఇనుప ఖనిజం, బొగ్గు తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వారిని పురికొల్పాయి. ఫాదర్ స్వామి ప్రేరేపణతో జార్ఖండ్‌లోని హో గిరిజనులు లేవనెత్తిన అభ్యంతరాల వల్ల చాలా కార్పొరేట్ గ్రూపులు దెబ్బతిన్నాయి. ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే మరణించారు (2021).

ఆనంద్ తేల్‌తుంబ్డే ఒక ఇంజినీర్. ప్రభుత్వ రంగంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి సంస్థ అయిన పెట్రోనెట్ ఇండియాకు సీఈఓగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులు కాకముందు భారత్ పెట్రోలియంలో రెండు దశాబ్దాలు పనిచేశారు. పదవీ విరమణ చేసే ముందు ముంబై విశ్వవిద్యాలయం నుండి మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డి పొందారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని వినోద్ గుప్తా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. తాను ఏ నేరం చేయలేదని చెప్పినప్పటికీ ఆయనను పుణె పోలీసులు గోవాలో పట్టుకున్నారు. పోలీసులు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) తేల్‌తుంబ్డేకు వ్యతిరేకంగా అందించిన ఏకైక సాక్ష్యం ఆయన కంప్యూటర్ నుండి సేకరించిన ఉత్తర ప్రత్యుత్తరాలు, మావోయిస్టులతో లింకులు ఉన్నట్లు అనుమానించిన మరికొందరి నుండి సేకరించిన ఉత్తరప్రత్యుత్తరాలు. వాటిని అందరూ తిరస్కరించారు. దళితులు, ఆదివాసీలు నయా ఉదారీకరణ, ప్రపంచీకరణ నుండి ప్రయోజనం పొందలేదని చూపించడానికి దేశవ్యాప్తంగా డేటాను విశ్లేషించడంపై తేల్‌తుంబ్డే ఆసక్తి చూపించారు. దళితులను, ఆదివాసీలను హిందూ మతంలోకి చేర్చడానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది విరుద్ధం. అయితే సుధ, ఫాదర్ స్వామి, తేల్‌తుంబ్డే, షోమా సేన్ వంటి ఉద్యమకారుల ప్రయత్నాలు కులానికి, తెగలకు సంబంధించిన వివక్ష సమకాలీన భారతదేశంలో నియమంగా ఉంటోందని నిరూపించాయి.

అల్పా రాసిన పుస్తకం సమకాలీన భారత రాజకీయాలపై అధ్యయనం చేస్తున్న విద్యార్థులందరూ తప్పక చదవవలసినది. బాధితుల కంప్యూటర్‌లలో సాక్ష్యాలను చొప్పించడానికి మాల్‌వేర్‌ను ఉపయోగించడంలో నిపుణులైనవారిని హ్యాకర్‌గా ఉపయోగించారని కంప్యూటర్‌ల హ్యాకింగ్‌పై అమెరికా కేంద్ర నిపుణుల అన్వేషణలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అమెరికాకు చెందిన రెండు డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ కంపెనీలైన ఆర్సెనల్ కన్సల్టింగ్, సెంటినెల్ ల్యాబ్స్ కనుగొన్న వాటిని అంగీకరించడానికి ఎన్‌ఐఏ, పుణె పోలీసులు నిరాకరించారు. విచారణ సమయంలో ఈ నిపుణుల ఫలితాలను సమర్పించడానికి డిఫెన్స్ లాయర్లు ప్రయత్నించవచ్చు.

విచారణ ఎప్పుడు మొదలవుతుంది? ఇప్పటికైతే అభియోగాలు కూడా మోపే సూచనలు కనిపించడం లేదు. ప్రత్యేకించి తమపై మోపిన నేరాలకు సంబంధించి తాము దోషులం కాదని వారు చెబుతున్నప్పుడు కూడా విచారణపై ఆశ లేకుండా ఏళ్ల తరబడి వారిని జైలులో ఉంచడం ఏ ప్రజాస్వామిక దేశంలో అయినా జరిగిందా?

వ్యాసకర్త మాజీ ఐపీఎస్ అధికారి; 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మరేం చేయగలరు?



రైల్వే మంత్రి రైలు ప్రమాదాలనూ, రైళ్లు క్రిక్కిరిసిపోవడాన్నీ ఆపలేరు. విద్యా మంత్రి ప్రశ్నాపత్రాల లీకులనూ, ఆఖరికి పరీక్షల స్కాములనూ ఆపలేరు. హోమ్ మంత్రి తీవ్రవాద దాడులనూ, మణిపూర్ హింసనూ ఆపలేరు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

అయ్యో అల్కా!



ఒక గాయని ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం దిగ్భ్రాంతిని కలిగించింది. ఆమె పూర్తిగా కోలుకోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. (వైరస్ దాడి వల్ల కొన్ని వారాల క్రితం ఉన్నట్టుండి వినికిడి శక్తిని కోల్పోయినట్టు గాయని అల్కా యాజ్ఞిక్ పోస్ట్ చేశారు.)

– చిన్మయి శ్రీపాద, గాయని

ఇండియన్ అయితే?



హారిస్ రవూఫ్‌తో ఫొటో దిగాలని అభిమాని అనుకున్నాడు. దానికి ఆయన నిరాకరించారు. గర్విష్ఠి, దురుసు అని అభిమాని నిందించాడు. ఇది ఆమోదయోగ్యం కాదు. అభిమానిని 'ఇండియన్' అంటూ హారిస్ దాడి చేయబోయారు. అభిమాని తాను పాకిస్తానీ అని చెప్పాడు. అభిమాని ఇండియన్ అయినా రవూఫ్ సహనం చూపాల్సింది! (టీ20 ప్రపంచ కప్ వేళ అమెరికాలో జరిగింది.)

– మెహ్‌విశ్ ఖమాస్ ఖాన్, పాక్ జర్నలిస్ట్

ఎండలా? మంటలా?



తీవ్ర ఎండాకాలాలు ఢిల్లీకి కొత్తేమీ కాదు; కానీ ఈసారి వేరే. ఎంత దారుణంగా ఉందంటే, కనీసం బయట ఒక పది నిమిషాలు నడవడం కూడా అసాధ్యంగా అనిపిస్తోంది. ఏసీలు నామ మాత్రంగా పని చేస్తున్నాయి. నల్లా నీళ్లు మసిలిపోతున్నాయి. అయినా వాన జాడ లేదు.

– రాహుల్ సభర్వాల్, జర్నలిస్ట్

పాతికేళ్ల క్రితం...



ఇది మీకు తెలుసా? ఇస్మాయిల్ దర్బార్‌ను సంగీత దర్శకుడిగా తీసుకోవడానికి దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని మెప్పించిన పాట 'తడప్ తడప్' (కేకే పాడారు). దర్బార్ దాని సంగీతం మీద నాలుగు నెలలు పనిచేశారు. ఒకరోజు భన్సాలీకి ఒక ట్యూన్ ఇచ్చారు. ఆయన దాన్ని 9 సార్లు విన్నారు. అదే ఈ పాట. దీంతో ఇంటర్వెల్ పాయింట్ కూడా తట్టిందని భన్సాలీ అన్నారు. ('హమ్ దిల్ దే చుకే సనమ్' పాతికేళ్ల క్రితం 1999 జూన్ 18న విడుదలైంది.)

– మీమాంస శేఖర్, జర్నలిస్ట్

నేర్చుకోవాల్సిన పాఠాలు



దేశంలోని 95 శాతం మంది డ్రైవర్లకు కనీసం మెయిన్ రోడ్డుకు కుడి వైపు ఎలా మలగాలో తెలియదు. అయినా మాకు డ్రైవింగ్ పాఠాలేమీ అక్కర్లేదని జనాలు వాదిస్తుంటారు. కాకపోతే బలవంతంగా అమలు చేయడం ఇలాంటి వాటిని ఎప్పటికీ పరిష్కరించలేదు. కేవలం శిక్షణతో మాత్రమే సాధ్యం.

– నరేశ్ రాఘవన్, డ్రైవింగ్ మాన్యువల్స్ రచయిత

దారుణ సేవలు



పేరుకు ధనిక దేశం. కానీ హజ్ యాత్రకు సంబంధించి, సౌదీ అరేబియాలో సేవలు దారుణంగా ఉన్నాయి. సరిపోయినన్ని అంబులెన్సులు లేవు. పోలీసులు లేరు. ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో దారులు నిండిపోయాయి. వీధుల్లో యాత్రికులు చనిపోతున్నారు. (ఎండలకు 19 మంది హజ్ యాత్రికులు చనిపోయారని వార్త.)

– మాహెర్ లూవె, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

జన్యులోపంపై పోరాటం

మానవ శరీరానికి జీవాన్నిచ్చే రక్తాన్ని తయారు చేసే ఎర్ర రక్త కణాలలో లోపభూయిష్టంగా ఏర్పడే కణాలను 'సికిల్ సెల్స్' అంటారు. వీటి వల్ల రక్త హీనత కలుగుతుంది. ఈ వ్యాధినే 'సికిల్ సెల్ ఎనీమియా' అంటారు. దీన్ని 2047 నాటికి సమూలంగా నిర్మూలించాలన్న కృత నిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం 2023 బడ్జెట్లో 'సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనా మిషన్' కార్యక్రమాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభావిత గిరిజన ప్రాంతాలలో 0–40 ఏళ్ళ మధ్య వయసున్న దాదాపు 7 కోట్ల మందికి ఈ వ్యాధిపై అవగాహన కలిగించటంతో పాటు సార్వత్రిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ వంటి వాటిని నిర్వహించాలని నిర్ణయించింది. ఏపీలో దాదాపు 4 వేల ఆరోగ్య కేంద్రాల్లో సికిల్ సెల్ ఎనీమియాపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాల్ని 'ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నివారణా దినం' సందర్భంగా జూన్ 19న చేపడుతున్నారు.

సికిల్ సెల్ ఎనీమియా మానవ శరీరాలకు వారసత్వంగా సంక్రమించే వ్యాధి. మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యు కణాలు లోపభూయిష్టంగా ఏర్పడటం ఈ వ్యాధికి కారణం.

రక్తకణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత), కళ్ళు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్ళునొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం (వైఫల్యం) వంటి లక్షణాలు సికిల్ సెల్ బాధితుల్లో కనపడతాయి.


చాలా మంది పిల్లలు, పెద్దలు ఈ రకమైన బాధను కలిగి ఉంటారు. వారిలో వీపు, కాళ్ళు, ఛాతీ, మొదలైన ప్రాంతాల్లో తీవ్రమైన నొప్పి ఉంటుంది. వాతావరణంలో మార్పు, విరేచనాలు, జ్వరం, నిర్జలీకరణం (డీహైడ్రేషన్), ఇన్ఫెక్షన్, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు ఈ నొప్పిని మరింత ఎక్కువ చేస్తాయి. ఈ లక్షణాలు లేకపోయినా సరే ఈ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించాలి.

– కిల్లి వేంకట రమణమూర్తి, ఏపీ వైద్య ఆరోగ్యశాఖ పీఆర్వో
(నేడు ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనా దినం)

డిస్‌లెక్సియాను అధిగమించి...

దశాబ్ద కాలంగా ఎల్జీబీటీ సమస్యల మీద సాహిత్యం గొప్పగా రావడం మొదలయ్యింది. దళితవాద సాహిత్యాన్ని దళితులూ, స్త్రీవాద సాహిత్యాన్ని స్త్రీలు రాసినట్లు... ఎల్జీబీటీ వ్యక్తులు వారి వాదాన్ని ప్రతిబింబిస్తూ బలంగా సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. ఇప్పటికీ సమాజానికి వీరి పట్ల సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. 'గే' అనే వ్యక్తి పురుషుడిగా ఉంటూనే పురుషుల పట్ల ఇష్టాన్ని కలిగి ఉంటాడు. పురుషుల పట్ల ఇష్టాన్ని కలిగి ఉండటం వల్ల 'గే'లను స్త్రీలుగా అనుకోకూడదు. అలాగే లెస్బియన్స్ ఆడవారి పట్ల ఇష్టాన్ని కలిగి ఉంటారు. అలాగని వారు భిన్నమైనవారనీ, స్త్రీలు కాదనీ వాదించడం మూర్ఖత్వమే అవుతుంది. లెస్బియన్స్ స్త్రీలే కానీ వారి ఇష్టం పురుషుల మీద ఉండదు. ఒకే జాతి వారి కలయికను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. ఎల్జీబీటీ వ్యక్తులు సమాజాన్నీ, విలువలనూ కలుషితం చేస్తున్నారన్నది వారి వాదన.

కె. వైశాలి తనను తాను లెస్బియన్‌గా ప్రకటించుకున్నారు. అలాగే తనకు చిన్నప్పటి నుండి 'డిస్‌లెక్సియా' అనే డిసార్డర్ ఉంది. దాని ఫలితంగా చదవడంలో, రాయడంలో, వ్యక్తులను గుర్తు పట్టడంలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని అధిగమిస్తూ 234 పుటలున్న, 'హోమ్‌లెస్' నవలను ఆంగ్ల సాహిత్య లోకానికి అందించారు.



తాను లెస్బియన్ అని తల్లికి చెప్పిన తర్వాత, తల్లి నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. గృహ హింసను అనుభవించారు. ఒంటరితనం, ఇంటికి దూరంగా ఉండాల్సి రావడం, ప్రేమ వైఫల్యం, ఒత్తిడి, ఆందోళన, చదువులో ఒడిదుడుకులు, కుటుంబ సమస్యలు, తనకున్న ఇతర శారీరక, మానసిక సమస్యలు, ఓటములను క్రోడీకరించి నవలగా మన ముందుకు తెచ్చారామె. వైశాలికి అభద్రత, భయం, ఆందోళన లాంటివి పది సంవత్సరాల వయసు నుండే ఉన్నాయి. ఇరవై సంవత్సరాల తర్వాత డిస్‌లెక్సియా ఉందని నిర్ధారణ అయ్యింది.

వైశాలి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన అంశాల్లో ముఖ్యమైనవి ఇంట్లో ఉన్న సమస్యలు. తల్లిదండ్రుల మధ్య గొడవలు– తాగి తల్లిని తండ్రి కొట్టడం, మరుసటి రోజు ఏమీ జరగలేదన్నట్టు తల్లి ప్రవర్తించడం లాంటివి వైశాలిని ఎక్కువగా ఆలోచించేలా చేశాయి. కుటుంబంలో ఉన్న అలజడి కారణంగా తల్లితండ్రులకు, కుటుంబానికి దూరంగా ఉండాలనే అభిప్రాయం చిన్న వయసు నుండి తనలో నాటుకుపోయింది. అందులో భాగంగానే హైదరాబాద్ యూనివర్సిటీలో పీజీ చేయడానికి యూనివర్సిటీ హాస్టల్‌లో చేరారు. యూనివర్సిటీలో ఎదురైన అనుభవాలతో పాటు, చిన్నప్పటి నుండి ఎదుర్కొన్న సమస్యలను ఆధారంగా చేసుకొని నవలను రచించారు.



ఈ నవలలో లెస్బియనిజం, డిస్‌లెక్సియా అనేవి ప్రధానమైన వస్తువులు. డిస్‌లెక్సియా గురించి మాత్రం విస్తృతంగా చర్చించారు. డిస్‌లెక్సియా సమస్య ఉన్నవారు పడే సమస్యలు, ఇబ్బందుల గురించి నవలలో అనేక అంశాలు ఉండటం హర్షణీయం. రాయడం, చదవడం ఇష్టమున్న తనను డిస్‌లెక్సియా ఉన్న కారణంగా చదవలేకపోవడం, రాయలేకపోవడం లాంటి సమస్యలు తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. ఆ సమస్య కారణంగా అక్షరాలు సరిగా కనపడవు, అయినా సాహిత్యం వైపే అడుగులు పడ్డాయి.

ఈ నవలలో ఒక లెస్బియన్‌గా తను ఎదుర్కున్న సమస్యల కంటే యూనివర్సిటీ విద్యార్థిగా, హాస్టల్‌లో ఉంటూ పడిన సమస్యలే ఎక్కువగా చోటు సంపాదించాయి. రుతుస్రావం అయిన సమయంలో గది నుండి బయటకు వెళ్లలేక, దేహం నుండి రక్తం కారుతుంటే, దాన్ని భరించలేక పడిన బాధ వర్ణనాతీతం. ఈ బాధ సౌకర్యాలు లేని ప్రతి హాస్టల్ విద్యార్థినీ అనుభవిస్తున్నదని భావించవచ్చు.

అనవసరమైన వర్ణనల కంటే రచయిత్రి భావాలను, తను నమ్మిన సిద్ధాంతాలను నొక్కి చెప్పడానికి ప్రాముఖ్యం ఇచ్చారు. నవలలో వాడిన బాధ, వాక్య నిర్మాణం, ప్రకటించిన భావాలు ఉన్నతంగా, సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేలా ఉన్నాయి.

– జాని తక్కెడశిల
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత | 72595 11956

పవిత్రతకు ఉద్దీపన

మనం మన ఇంటిలోని గోడలపై రక రకాల రంగురంగుల చిత్రపటాలను తగిలించుకుంటాం. ప్రకృతి రమణీయమైన చిత్రాలు అందులో ఉంటాయి. జలపాతాలు, దేవదారు వృక్షాలు, కొండలు, కోనలు, మేఘాలు, నెమళ్ళు, బారులు తీరిన కొంగలు – ఇలా ఎన్నెన్నో మనకు, మన ఇంటికి వచ్చే అతిథులకు కనువిందు చేస్తాయి. మానసిక ఆనందం కల్గుతుంది. అయితే ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడేవి ముఖ్యంగా దేవీ దేవతల, సాధు సత్పురుషుల చిత్రపటాలు.

ఒకసారి శ్రీరామ కృష్ణ పరమహంస... అశ్వినీ కుమార్ దత్తాకు తమ గదిలోని చిత్తరువులను చూపించి ఆ తర్వాత, 'బుద్ధుని చిత్తరువు దొరుకుతుందా? దొరికితే నా కొరకు ఒకటి పట్టుకు రండి దయచేసి' అన్నారు. దేవీ దేవతల, సాధు సత్తముల చిత్తరువులను చూస్తూ ఉంటే దివ్యభావన ఉద్దీపనమవుతుంది కాబట్టి రామకృష్ణ పరమహంస అలాంటి చిత్తరువులను ఇంటి గోడలపై తగిలించుకొమ్మని తన భక్తులకు చెప్పి ప్రోత్సహించేవారు. తానూ స్వయంగా అలా చేసేవారు. 'ఇలాంటి చిత్తరువులు నాలో ఆధ్యాత్మిక ఉద్దీపన కలిగిస్తాయి, బొమ్మ పండును చూస్తే నిజమైన పండు జ్ఞాపకం వచ్చినట్టు' (పుట 185– శ్రీరామకృష్ణ లీలామృతం) అని అంటారాయన. దీన్ని చదివినప్పుడు మనకు శిరిడీసాయి, గజానన్ మహారాజ్ గుర్తొస్తారు. వారిద్దరూ దత్తాత్రేయుని అవతారాలేనని అంటారు. బహుశ రామకృష్ణుడు వారిని గూర్చి విని ఉండరు. దివ్యదృష్టితో దర్శించి ఉంటారు. హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు భగవంతుని దర్శించగలరు అని పెద్దలు అంటారు. మనం మనలోని దుర్గుణాలను గమనించి వాటిని వదిలించుకొంటూ మరొకవైపు ధ్యాన, ప్రార్థనల్లో గడుపుతుంటే సత్పురుషుల, ఋషుల దర్శనం లభిస్తుంది. క్రమక్రమంగా చివరకు సత్యసాక్షాత్కారమే కల్గుతుంది.



'కామం, క్రోధం, లోభం, మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం' – అని చెబుతుంది భజగోవింద శ్లోకం. కామ, క్రోధాదులను వదిలించుకొంటే సోహం భావం కలిగి 'శివోహం శివోహం' అని అనగలం. కాబట్టి మనల్ని మనం నిత్యం పరిశీలించుకొంటూ అహంకారాది దుర్గుణాలను వదిలించుకొంటే మన హృదయమే దైవం కొలువై ఉండే పవిత్ర ఆలయం అవుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 75,872 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.64 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.


వయోవృద్ధుల దర్శనాలపై వదంతులను నమ్మొద్దు

భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల: తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మొద్దని టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ''ప్రతిరోజూ 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ ప్రతి నెలా 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి దర్శనం కేటాయిస్తోంది. దీనికి మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఆన్‌లైన్ టికెట్ల కోట ఆగస్టు 2024 వరకు బుక్కయ్యింది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50 లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పీహెచ్‌సీ లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు'' అంటూ సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఇలాంటి తప్పుడు వార్తలు, వదంతులను నమ్మొద్దని టీటీడీ భక్తులను కోరింది. సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumaa.orf, httpr://ttdevartanamr.ap.in ను మాత్రమే సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది.

30 క్రేట్ల టమాటాలు చోరీ

రైతుకు రూ.60వేలు నష్టం


టమాటా పొలం

బి.కొత్తకోట: ఇంట్లో నగలు, డబ్బు దొంగల బారిన పడకుండా బీరువాల్లో భద్రంగా ఉంచుకుంటాం. ప్రస్తుతం వాటితో పోటీపడుతూ టమాటా ధరలు పెరగడంతో వాటిని భద్రంగా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొలంలో దొంగలుపడి పంటను ఎత్తుకెళ్లగా, రైతు లబోదిబోమంటున్నారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం గుట్టపాళ్యంకు చెందిన రైతు రమణారెడ్డి పొలంలో సోమవారం రాత్రి దొంగలుపడి టమాటా పంటను ఎత్తుకెళ్లారు. బాధితుడి కథనం మేరకు.. గుట్టపాళ్యం సమీపంలో బి.కొత్తకోట–మదనపల్లె రహదారికి ఆనుకుని ఉన్న పొలంలో రమణారెడ్డి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం రెండెకరాల్లో టమాటా పంట సాగు చేయగా దిగుబడులు విక్రయానికి వస్తున్నాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు రమణారెడ్డి పొలం పనులు చేసుకుని చీకటిపడ్డాక ఇంటికి వెళ్లారు. రాత్రి 10.45 గంటలకు వర్షం కురిసింది. అంతకుమునుపే గుర్తు తెలియని వ్యక్తులు రమణారెడ్డి పొలంలో చొరబడి కోతకు వచ్చిన టమాటాలను తరలించుకుపోయారు. పంట తీసే సమయంలో ఎవరికి అనుమానం రాకుండా, కనిపించకుండా జాగ్రత్తపడినట్టు తెలుస్తోంది. సుమారు 30 క్రేట్ల టమాటాను దొంగలించారు. ఒక్కో క్రేట్‌లో 30 కిలోల టమాటా తరలించవచ్చు. దీని విలువ మార్కెట్‌లో రూ.60వేలకు పైబడి పలుకుతోంది. మంగళవారం ఉదయం పొలంలోకి వచ్చిన రైతు రమణారెడ్డికి కోతకు వచ్చిన టమాటా కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్టు నిర్ధారించుకున్నారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించిన టీడీపీ నేతలు



నరసరావుపేట రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకులు ఆక్రమించుకున్న ఘటన ఇది.. ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం వేసిన హద్దురాళ్లతో పాటు రోడ్డును కూడా టీడీపీ నాయకులు తొలగించారు. ట్రాక్టర్‌తో భూమిని చదును చేసి పంట పొలంగా మార్చారు. బాధితులు తెలిపిన వివరాలు..2021లో అప్పటి సీఎం వైఎస్ జగన్ పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకానిలో 284 మంది పేదలను అర్హులుగా గుర్తించారు. ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే దారిలో అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో గ్రామంలోని టీడీపీ నాయకుల కన్ను పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై పడింది. రెండు రోజుల క్రితం జేసీబీతో హద్దురాళ్లను, రోడ్డును తొలగించినట్టు తెలుస్తుంది. ట్రాక్టర్‌తో భూమిని చదును చేసి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన ఎకరం భూమిని పంటపొలంగా మార్చి సుబాబుల్ సాగుకు టీడీపీ నాయకులు సిద్ధమైనట్టు తెలిసింది. అసైన్డ్ భూమిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను టీడీపీ నాయకులు ఆక్రమించి చదును చేస్తున్నా రెవిన్యూ అధికారులు అటు వైపు చూడటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని పేదలు కోరుతున్నారు.

మిర్చి ధర పతనం

గత ఏడాది ఇదే సమయానికి క్వింటాల్ ధర రూ.26,500

ఈ ఏడాది రూ.20,700

ఇంకా ప్రారంభం కాని ఎగుమతులు

మిర్చి రైతుల్లో ఆందోళన

కోల్డ్ స్టోరేజీలలో 75 లక్షల బస్తాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మిర్చి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది మే చివరి నాటికి క్వింటాల్ మిర్చి కనిష ధర రూ.9 వేలు, గరిష్ఠ ధర రూ.26,500 ఉండగా.. ఈ ఏడాది కనిష ధర రూ.8 వేలు, గరిష్ఠ ధర 20,700 పలుకుతోంది. ప్రస్తుతం తేజ మంచి రకానికి రూ.19,500 మాత్రమే అత్యధిక ధర లభిస్తోంది. మిగిలిన అన్నిరకాల మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. మరోవైపు ఎగుమతులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో కోల్డ్ స్టోరేజీలలో 75 లక్షల మిర్చి బస్తాలు నిల్వ ఉండిపోయాయి. ధరలు తగ్గడంతో మిర్చి రైతుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు వర్షాలు ప్రారంభం కావడంతో మిరప నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

ఎగుమతుల్లో ఏపీదే మొదటి స్థానం

2022–23 సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.10,440 కోట్ల విలువైన మిర్చి విదేశాలకు ఎగుమతులయ్యాయి. మిర్చి ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. దీంతో రెండేళ్లుగా రైతులు మిర్చి పంట వేయడంపైనే దృష్టి పెడుతున్నారు. మరోవైపు కర్ణాటకలోనూ మిర్చి దిగుబడి ఎక్కువగా రావడంతో అక్కడ కోల్డ్ స్టోరేజీలు సరిపోక ఏపీకి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 100 వరకూ కోల్డ్‌స్టోరేజీలు ఉండగా.. 3.21 లక్షల టన్నులకు పైగా మిర్చిని నిల్వ చేశారు. ఇందులో 2.71 లక్షల మెట్రిక్ టన్నుల సరుకు రైతులది కాగా.. 52 వేల మెట్రిక్ టన్నుల సరుకు వ్యాపారులది. ఇవికాకుండా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీలలో మొత్తం 75 లక్షల బస్తాల (బస్తా 40 కిలోలు) సరుకు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉత్పత్తి గణనీయంగా రావడం వల్ల ధర రోజురోజుకీ తగ్గుతుండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

20 దేశాలకు ఎగుమతి

మన దేశం నుంచి సుమారు 20 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతోంది. ముఖ్యంగా చైనా, శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ్, స్పెయిన్, అమెరికా, ఇంగ్లాండ్, నేపాల్, నెదర్లాండ్స్, నైజీరియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఆయా దేశాలకు కారం, విత్తనాలను సైతం ఎగుమతి చేస్తున్నారు.



మే నెలలో మిర్చి ధరలు

సంవత్సరం	వచ్చిన సరుకు (క్వింటాళ్లలో)	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర (రూపాయల్లో)
2021–22	2,67,162	7,000	15,000
2022–23	3,53,904	7,000	23,000
2023–24	5,29,275	9,000	26,500
2024–25	2,63,109	8,000	20,700



సముద్రంలో తిరగబడిన బోటు

- నీటిలోనే జాగారం చేసిన నలుగురు మత్స్యకారులు
- కాపాడిన తోటి జాలర్లు


సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులు

వేటపాలెం: బాపట్ల జిల్లా, వేటపాలెం మండలం, పొట్టిసుబ్బయ్యపాలెం మత్స్యకారులకు సంబంధించిన బోటు సముద్రంలో సోమవారం రాత్రి బోల్తాకొట్టింది. అందులో వేటకు వెళ్లిన నలుగురు మత్స్యకారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆరు గంటల పాటు సముద్రంలోనే ఉండిపోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామానికి చెందిన కొండూరు రాములు, పెద్ద కుమారుడు కొండూరు గోవిందు, చిన్నకుమారుడు చిట్టిబాబు, కఠారివారిపాలేనికి చెందిన కఠారి శ్రీను నలుగురు కలిసి సోమవారం సాయంకాలం బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే రాత్రి 8 గంటల సమయంలో వేట సాగించేటప్పుడు అలల తాకిడికి బోటులోకి సముద్రం నీరు పెద్ద మొత్తంలో చేరుకొని తిరగబడింది. అందులో ఉన్న నలుగురు సముద్రం నీటిలో పడిపోయారు. వీరి పై వేట సాగించే వల పడింది. నలుగురు సముద్రం నీటిలోపలకు వెళ్లి వలను తప్పించుకొని ఈతకొట్టుకొంటూ తిరగబడిన బోటు పై భాగానికి ఎక్కి కూర్చున్నారు. వీరి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు నీటిలో పడిపోవడంతో సమాచారం ఇవ్వడానికి వీలు పడలేదు. ఆరు గంటల పాటు తిరగబడిన బోటు పైనే కూర్చున్నారు. చిన్నగంజాం మండలం, చిన్నంగారివారిపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు మంగళవారం తెల్లవారుజామున వేట ముగించుకొని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదానికి గురైన బోటు పై భాగంలో కూర్చొని ఉన్న నలుగురిని గమనించారు. వెంటనే వారిని తమ బోటులో ఎక్కించుకొని తెల్లవారుజామున 5 గంటలకు పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామానికి తీసుకొచ్చారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆరు గంటల పాటు సముద్రం నీటిలోనే ఉండిపోయామని మత్స్యకారులు తెలిపారు. వల, బోటు, ఇంజన్‌లు ఎందుకూ పనికిరాకుండా పోవడంతో రూ.6.50 లక్షలు నష్ట పోయామని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సముద్రంలో బోటుకు అగ్ని ప్రమాదం

- రూ.30 లక్షల మేర నష్టం
- వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితం


సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సముద్రంలో వేటకు వెళ్లిన బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. విశాఖ దక్షిణం వైపు 28 నాటికల్ మైళ్ల దూరం పూడిమడక సముద్ర తీరంలో ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. గనగళ్ల అప్పయ్యమ్మ బోటు ఈనెల 15న వేటకు వెళ్లింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పూడిమడక ప్రాంతంలో బోటు నంబర్ ఐఎన్‌డి–ఏపీ–వి5–ఎంఎం–17తో చేపలు, రొయ్యల వేట సాగుతోంది. తొలుత బోటు ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. సిబ్బంది వెళ్లి ఇంజన్‌ను పరిశీలించగా, ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో బోటు సిబ్బంది వెంటనే సముద్రంలో దూకారు. వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. చూస్తుండగానే బోటు కాలిపోయింది. వేటాడిన మత్స్య సంపద, ఇతర సామగ్రి కూడా అగ్నికి ఆహుతయ్యాయి. మత్స్యకారులు మంగళవారం ఉదయానికి స్థానిక ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నారు. ప్రమాదం నుంచి బయట పడిన వారిలో వాసుపల్లి రాజు (36), వాసుపల్లి అప్పన్న (58), వాసుపల్లి దానీలు (41), వాసుపల్లి అప్పారావు (41), గనగళ్ల ఎరికొండు (40), మైలపల్లి ఎర్రయ్య (50), గనగళ్ల పోలిరాజు (20) ఉన్నారు. బోటు దగ్ధం కావడంతో యజమానికి రూ.30 లక్షలు మేర నష్టం కలిగిందని ఫిషింగ్ హార్బర్ మెకనైజ్డ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ మీడియాకు తెలిపారు. సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులకు ఆశ్రయం కల్పించామన్నారు. ఘటనలో నష్టపోయిన బోటు యజమానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని కోరారు. ప్రమాదం విషయాన్ని మంత్రిఅచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తానని సంఘం మాజీ అధ్యక్షుడు పి.సి.అప్పారావు తెలిపారు.

సిరిమాను రథం కూలి ఇద్దరు గ్రామస్తులు మృతి



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామంలో మంగళవారం అసిరి తల్లి ఉత్సవాల్లో ప్రమాదం జరిగింది. గ్రామంలో 14 ఏళ్ల తర్వాత అసిరితల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజు మంగళవారం సిరిమానోత్సవం చేశారు. సిరిమానుపై పూజారి నాయని చిన్నారెడ్డి ఆశీనులు కాగా బుడగుట్లపాలేం గ్రామానికి చెందిన వందమంది రథం లాగారు. ఉత్సవం మధ్యలో చిన్నారెడ్డి కూర్చున్న సిరిమాను పీఠం శీల విరిగిపోయింది. దీంతో రథం పీఠం ఒక్కసారిగా కూలి కిందనున్న కారి పల్లేటి (60), సూరాడ అప్పన్న (42)లపై పడిపోయింది. దీంతో వీరిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. పూజారి చిన్నారెడ్డి అంత ఎత్తునుంచి కింద పడిపోగా.. పళ్ల మధ్య నాలుక కరుచుకోవడంతో నాలుక తెగిపడింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు వచ్చి మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. చిన్న శీల విరిగి ఇంత పెద్ద ప్రమాదం జరగడాన్ని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు. అనంతరం పోలీసుల భద్రత నడుమ సిరిమానోత్సవం పూర్తిచేశారు.

'రెవిట్ ఆర్కిటెక్చర్'పై శిక్షణ తరగతులు ప్రారంభం

- వీవీఐటీలో వారం రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న పాలిటెక్నిక్ అధ్యాపకులు


శిక్షణ కార్యక్రమంలో సాంకేతిక విద్యా, శిక్షణమండలి సెక్రటరీ రమణబాబు

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా శిక్షణ మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీలో రెవిట్ ఆర్కిటెక్చర్‌పై పాలిటెక్నిక్ అధ్యాపకులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వారం రోజులు నిర్వహించనున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా శిక్షణ మండలి కార్యదర్శి కేవీ రమణబాబు మంగళవారం ప్రారంభించారు. శిక్షణ మండలి జాయింట్ సెక్రటరీ జీవీవీ సత్యన్నారాయణమూర్తి, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీ రమణబాబు మాట్లాడుతూ అధ్యాపకులు నిత్యం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు బోధించాలన్నారు. అధ్యాపకుల శిక్షణ కోసం వీవీఐటీ కళాశాలలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నందు పూర్తిస్థాయి సాంకేతిక వనరులు అందుబాటులో ఉండటం వల్ల ఈ కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఎస్పీఎం బదిలీ

సాక్షి, అమరావతి: నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ (ఎస్పీఎం) డాక్టర్ వెంకట రవి కిరణ్‌ను బదిలీ చేస్తూ వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆ పోస్టులో తాత్కాలిక ఏర్పాటు చేసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం ఎండీని ఆదేశించారు. వైద్య కళాశాలల్లో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల కొరత నేపథ్యంలో ఆ విభాగం ఏపీ రవికిరణ్ డిప్యూటేషన్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

బిడ్డ కోసం తండ్రి పాట్లు

- కేజీహెచ్ గైనిక్ వార్డు నుంచి ఆక్సిజన్ సిలిండర్ మోసుకెళ్లిన తండ్రి
- పట్టించుకోని కేజీహెచ్ సిబ్బంది


పసికందును తీసుకెళ్తున్న ఆయా.. సిలిండర్ మోసుకొని వెళ్తున్న తండ్రి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పసిబిడ్డ కోసం తండ్రి నానా కష్టాలు పడ్డాడు. ప్రసవం అయిన తర్వాత చికిత్స కోసం పిల్లల వార్డుకు తీసుకొని వెళ్లడానికి సిబ్బంది నిరాకరించారు. దీంతో తండ్రి ఆక్సిజన్ సిలిండర్ మోసుకొని వార్డుకు తీసుకొని వెళ్లాడు. పసిబిడ్డను ఆయా తీసుకొని వెళ్లగా తండ్రి సిలిండర్ మోసుకొని వెళ్లాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆరా తీశారు. కాకినాడ జిల్లా కోటనందూరుకి చెందిన అల్లు శిరీష, విష్ణుమూర్తి దంపతులు. శిరీష ఈ నెల 9న కేజీహెచ్ గైనిక్ వార్డులో చేరారు. మంగళవారం ఉదయం 8.30 శిరీష పసికందుకు జన్మనిచ్చింది. పసికందు అనారోగ్యానికి గురవడంతో పిల్లల వార్డులో ఉన్న ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు సూచించారు. పసికందును గైనిక్ వార్డుకు తరలించడానికి కేజీహెచ్ సిబ్బంది ఎవరు ముందుకు రాలేదు. దీంతో తండ్రి విష్ణుమూర్తి అక్కడ ఉన్న ఆయాతో మాట్లాడి తాను సిలిండర్ మోస్తానని ముందుకు వచ్చాడు. దీంతో ఆయా పసిపాపను, తండ్రి సిలిండర్ మోసుకొని వెళ్లారు. గైనిక్ వార్డు నుంచి పిల్లల వార్డు వరకు నడిచి తీసుకొని వెళ్తున్న ఈ దృశ్యాన్ని కొంత మంది వీడియో తీశారు. దీనిని వైరల్ చేయడంతో ఈ విషయం బయట పడింది.

గైనిక్ వార్డు వద్ద బ్యాటరీ కారు

ఈ ఘటన వైరల్ కావడంతో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆరా తీశారు. గైనిక్, పిల్లల వార్డు సిబ్బందిని పిలిచి విచారించారు. ఆ సమయంలో ఎవరు డ్యూటీలో ఉన్నారు.. ఈ ఘటనకు ఎవరు బాధ్యులు అన్నదానిపై చర్చించారు. ఈ సమస్య లేకుండా గైనిక్, పిల్లల వార్డు వద్ద ఒక బ్యాటరీ కారు సిద్ధం చేస్తున్నట్లు శివానంద్ తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రుల ర్యాలీలో అపశ్రుతి

నరసన్నపేటలో బాణసంచాతో ఉన్న లగేజీ ఆటో దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న ఆటో

నరసన్నపేట: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు మొదటిసారిగా సోమవారం శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన సందర్భంగా టీడీపీ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో బాణసంచా ఉన్న ఆటో కాలిపోయింది. ర్యాలీ సోమవారం రాత్రి 10.45 సమయంలో నరసన్నపేట చేరుకుంది. ఇంతలో వైఎస్సార్ కూడలి వద్ద ఒక్కసారిగా లగేజి ఆటోలో మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న బాణసంచాకు నిప్పంటుకుని భారీ శబ్దాలతో పేలాయి. దీంతో అక్కడున్న వారంతా భయభ్రాంతులకు గురయ్యారు. ర్యాలీ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యకర్తలు అత్యుత్సాహంతో ఆటోపై నుంచే ఆ సామగ్రిని కాల్చడంతో మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి స్పందించి సీఎంఆర్ షోరూమ్‌లో ఉన్న మంటలు అదుపు చేసే సామగ్రి తీసుకొచ్చి ప్రయోగించడంతో కొంతవరకు ప్రమాదం తప్పింది. కాసేపటి తర్వాత అదే మార్గంలో రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ముందుకు వెళ్లారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో టీడీపీ నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే కేజీహెచ్‌లో అగ్నిప్రమాదం

- సీఎస్సార్ బ్లాక్‌లో వ్యాపించిన దట్టమైన పొగ
- అంకాలజీ యూనిట్‌కు రోగుల తరలింపు
- ఎలాంటి నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైద్యులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని విచారణ కమిటీ తేల్చింది. సోమవారం అర్ధరాత్రి కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్ మూడో అంతస్తు ఐఆర్‌సీయూ బ్లాక్‌లో వెంటిలేటర్ బ్యాటరీ పేలిన ఘటన తెలిసిందే. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వెంటిలేటర్ నుంచి పొగ వ్యాపించింది. ఆ సమయంలో వార్డులో 8 మంది రోగులు చికిత్స పొందుతుండగా.. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వార్డులో 12 పడకలు ఉన్నాయి.

చార్జింగ్ సమయంలో పేలుడు..

వెంటిలేటర్‌కు చార్జింగ్ అవుతున్న సమయంలో పేలుడు సంభవించింది. కోవిడ్ సమయంలో కేంద్రం నుంచి 248 వెంటిలేటర్లు కేజీహెచ్‌కు చేరుకున్నాయి. ఇందులో ఒకటి పేలిపోగా.. ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగ అలుముకుంది. దీంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ఆ తర్వాత అగ్ని మాపక అధికారులు రంగంలో దిగే సరికి మంటలు అదుపులోకి వచ్చాయి.

ముగ్గురు వైద్యులతో విచారణ

అగ్ని ప్రమాదంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ముగ్గురితో విచారణ కమిటీ వేశారు. అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవి, ఏఆర్‌ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, బయోమెడికల్ ఇంజినీర్ రాజేష్ విచారణ పూర్తి చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పించారు.

రోగుల తరలింపు

పేలుడు సమయంలో వార్డులోని రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగరావడంతోపాటు శబ్దం వినిపించింది. అదృష్టవశాత్తు రోగులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో రాత్రికి 8 మంది రోగులను కింద అంతస్తులోని మెడికల్ అంకాలజీ వార్డుకు తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడే వైద్య సేవలు అందుతున్నాయి.

రైల్లో బాల కార్మికుల తరలింపు

రక్షించిన ఆర్పీఎఫ్ అధికారులు



నెల్లూరు(క్రైమ్): బాలురను భవన నిర్మాణ పనులకు రైల్లో అక్రమంగా తరలిస్తుండగా బాలల సంరక్షణ, ఆర్పీఎఫ్ అధికారుల ప్రత్యేక బృందం మంగళవారం సంరక్షించారు. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సంజార్‌బీరా, షీబూప్రసాద్ బీరా, సుభిఆసుకూర్‌దాస్, ముఖేష్ హోస్దా, షీల్ హస్సద్‌ను తమిళనాడులోని కాట్పాడిలో భవన నిర్మాణ పనులకు దళారులు సుఫ్దాద్ సింఘా, పెరుమాళ్లు రైల్లో తరలించసాగారు. దీనిపై చైల్డ్ లైన్ ద్వారా జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్‌కు సమాచారం అందింది. నెల్లూరు ఆర్పీఎఫ్ అధికారులకు విషయాన్ని తెలియజేసి ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. పశ్చిమ బెంగాల్ నుంచి కాట్పాడి వెళ్తున్న రైలు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే, ప్రత్యేక బృందం బాలకార్మికులను సంరక్షించారు. దళారులను అదుపులోకి తీసుకున్నారు.బాలురను విచారించగా, రూ.300 రోజువారీ కూలీకి భవన నిర్మాణ పనులు చేసేందుకు తీసుకెళ్తున్నారని, అక్కడ సెంట్రింగ్ పనులు చేస్తామని వెల్లడించారు. బాలురను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చి అనంతరం చైల్డ్ అండ్ పోలీసు హోమ్ (క్యాప్)లో చేర్పించారు. ఘటనపై ఆర్పీఎఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలురను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తామని సురేష్ తెలిపారు.

విద్యుత్ కార్మికుడి ఆత్మహత్యాయత్నంపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్

సాక్షి, అమరావతి: నాగార్జున సాగర్ విద్యుత్ టెయిల్ పాండ్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు ఇస్లావత్ సేవా నాయక్ ఆత్మహత్యాయత్నంపై ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ స్పందించింది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం గ్రామానికి చెందిన సేవా నాయక్ నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో ఏడేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కిడ్నీలో రాళ్ల సమస్యకు ఆపరేషన్ చేయించుకున్న ఆయన... తనను సివిల్ డిపార్ట్‌మెంట్ నుంచి మెకానికల్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నాడు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సేవా నాయక్ గురువారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు.

కాంట్రాక్టర్ మోసం చేసినందుకే తునికాకును దగ్ధం చేశాం

- మావోయిస్టు నేత ఆజాద్ లేఖ


మావోయిస్టు ఆజాద్ పేరుతో వెలువడిన ప్రకటన

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): కాంట్రాక్టర్ సంపత్‌రెడ్డి ప్రజలను మోసం చేసినందుకే తునికాకు బస్తాలను దగ్ధం చేశామని మావోయిస్టు నేత ఆజాద్ తెలిపారు. మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు(బీకే, ఏఎస్సార్) కమిటీ పేరుతో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఓ గోదాంలో నిల్వ ఉంచిన తునికాకు బస్తాలు సోమవారం దగ్ధమయ్యాయి. కాంట్రాక్టర్ తునికాకు మోళ్లు కొట్టిన కూలీలకు, ఒప్పందం ప్రకారం తునికాకు సేకరించిన కూలీలకూ సొమ్ములు చెల్లించకుండా ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆజాద్ పేర్కొన్నారు. కూలీల దగ్గర తక్కువ ధరకు తునికాకు సేకరించే ప్రయత్నం చేశారని, కల్లేదారుల కమీషన్‌తో పాటు ఇతర పనులు చేసిన కూలీలకు కూడా సొమ్ములు చెల్లించే విషయంలోనూ ఒప్పందాలను ఉల్లంఘించారని ఆరోపించారు. ప్రజల అభీష్టం మేరకు కాంట్రాక్టర్ సేకరించిన తునికాకును దగ్ధం చేయాల్సి వచ్చిందని, భవిష్యత్తులో ఇలాంటి కాంట్రాక్టర్లు ఏజెన్సీలో తునికాకు సేకరణకు వస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు.

0.001 శాతం నిర్లక్ష్యమున్నా పరిష్కరించాల్సిందే

'నీట్' పరీక్ష విధానంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన నీట్–యూజీ 2024 పరీక్ష విధానం, నిర్వహణలో 0.001 శాతం లోపం తలెత్తినా సరే సకాలంలో పరిష్కరించాలని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వ్యాఖ్యానించింది. మే ఐదో తేదీన నిర్వహించిన నీట్‌యూజీలో కొందరు విద్యార్థులకు సమయాభావం, ఇతరత్రా కారణాలతో గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల సెలవుకాల ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) చేపట్టిన విషయం విదితమే. '' అత్యంత కఠినమైన ఇలాంటి ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతగా శ్రమిస్తారో మనందరికీ తెలుసు. వైద్యుడే సమాజంలో అవినీతికి పాల్పడితే సమాజానికి ఎంతటి నష్టం చేకూరుతుందో ఊహించండి. ప్రవేశపరీక్షలు నిర్వహించే ఒక బాధ్యతాయుత సంస్థగా ఒకే మాట మీద నిలబడాలి. మీ వైపు ఏదైనా తప్పు జరిగితే నిజాయతీగా ఒప్పుకోవాలి. సరిదిద్దేందుకు చేపట్టిన చర్యలనూ వివరించాలి. కనీసం ఆ దిశగా చర్యలకు సమాయత్తం అయ్యామని అయినా నిరూపించుకోవాలి. అప్పుడే మీ పనితీరుపై విశ్వాసం పెరుగుతుంది'' అని ఎన్‌టీఏ తరఫున వాదించిన లాయర్లకు కోర్టు చీవాట్లు పెట్టింది.

రెండు వారాల్లో స్పందన తెలపండి

కేసుల తదుపరి విచారణ జరిగే జూలై 8వ తేదీలోపు ఏమేం చర్యలు చేపట్టారో నివేదించాలని కోర్టు సూచించింది. మళ్లీ పరీక్షను నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్లపై రెండు వారాల్లోపు మీ స్పందన తెలపాలంటూ ఎన్‌టీఏ, కేంద్ర ప్రభుత్వాలను కోర్టు ఆదేశించింది. పరీక్షలో అడిగిన ఒక ప్రశ్నను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ప్రస్తావించగా ''దానికి ఎన్‌టీఏ, కేంద్రం సమాధానం చెప్తాయి. మీరెందుకు పిటిషన్లు వేశారో మమ్మల్ని అర్థం చేసుకోనివ్వండి. మీ వాదనలను సావధానంగా వినేందుకు సాయంత్రందాకా కూర్చుంటాం' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌నూ కోర్టు విచారించింది. గ్రేస్ మార్కులు పొందిన 1,563 మంది అభ్యర్థులకు ఆ మార్కులను తీసేశామని కేంద్రం, ఎన్‌టీఏ జూన్ 13వ తేదీన కోర్టుకు నివేదించిన విషయం విదితమే. ఆ మార్కులు పోను మిగిలిన మార్కులతో ఆ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చు లేదంటే మరో సారి పరీక్ష రాసుకోవచ్చు అని ఎన్‌టీఏ తెలిపింది.

4,750 కేంద్రాల్లో 24 లక్షల మంది అభ్యర్థులు

మే ఐదున 4,750 కేంద్రాల్లో దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు నీట్‌యూజీ–2024 రాశారు. హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంలో రాసిన వారిలో ఆరుగురికి సహా దేశవ్యాప్తంగా 67 మందికి 720కిగాను 720 మార్కులు పొంది టాప్‌ర్యాంక్ సాధించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎక్కువ మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడమే ఈ అనూహ్య టాప్‌ర్యాంకుల పర్వానికి అసలు కారణమని వెల్లడైంది. వ్యవహారం కోర్టుకు చేరడంతో వారందరికీ గ్రేస్ మార్కులు తొలగిస్తున్నామని ఎన్‌టీఏ ప్రకటించినప్పటికీ అసలు ఈ విధానాన్ని ఎందుకు అనుసరిస్తున్నారని, గోప్యత ఎందుకు పాటించారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. సమయం వృథా అయితే ఆ మేరకు అదనపు సమయం పరీక్ష రాయించాలిగానీ విద్యార్థికి ఏ ప్రామాణిక ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇస్తారని విద్యావేత్తలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నీట్‌యూజీ కౌన్సెలింగ్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

బెంగాల్‌లో రైలు ప్రమాదం..

10కి చేరిన మృతులు

న్యూఢిల్లీ/కోల్‌కతా/ సిలిగురి: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం సంభవించిన రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరేళ్ల బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో, మృతుల సంఖ్య 9 నుంచి 10కి చేరుకుందన్నారు. సీల్దాకు వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం ఉదయం రంగపాణి రైల్వే స్టేషన్‌లో నిలిచి ఉన్న కాంచనజంగ రైలును వెనుక నుంచి ఢీకొట్టిన విషయం తెల్సిందే. ఘటనలో మృతి చెందిన, గాయాలపాలైన వారిని వదిలేసి ప్రమాదానికి గురవని బోగీలతో 850 మంది ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం బయలుదేరిన కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ మంగళవారం వేకువజామున సీల్దాకు చేరుకున్నట్లు ఈస్టర్న్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. సీల్దా నుంచి ప్రయాణికులను వారిని గమ్య స్థానాలకు చేర్చేందుకు 16 బస్సులు, 60 కార్లను ఏర్పాటు చేశామన్నారు.


కుమార్తె బర్త్‌డే కోసం వస్తూ...

సోమవారం జరిగిన రైలు ప్రమాదం కోల్‌కతాకు చెందిన సృష్టి అనే 11 ఏళ్ల చిన్నారికి తీరని వేదన మిగిల్చింది. ఈమె తండ్రి శుభొజిత్ మాలి(31) ఆఫీసు పని మీద శుక్రవారం సిలిగురి వెళ్లారు. మరికొద్ది రోజులపాటు ఆయన అక్కడే ఉండిపోవాల్సి ఉంది. కానీ, సృష్టి బర్త్‌డే వేడుకలో పాల్గొనేందుకు ముందుగానే సోమవారం బయలుదేరారు. కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే ముందు సృష్టికి వీడియో కాల్ చేసి మాట్లాడారు. ఎలాగోలా సమయానికి వచ్చేస్తా. బర్త్‌డే ఘనంగా చేసుకుందామని, కేకు తీసుకొస్తానని కూతురికి మాట ఇచ్చారు. కానీ, విధి మరోలా ఉంది. రైలు ప్రమాదంలో మరణించిన వారిలో శుభొజిత్ కూడా ఉన్నారు. అదే రైలులో ప్రయాణించిన ఆయన స్నేహితుడు ఈ విషాద వార్తను కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో, శుభొజిత్ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగింది. ఎప్పుడూ బస్సులోనే ప్రయాణించే శుభొజిత్.. ఈసారి మాత్రం కుమార్తె పుట్టిన రోజు వేడుక జరపాలనే తొందరలో రైలు ప్రయాణాన్ని ఎంచుకున్నారని, ఇదే ఆయన ప్రాణాలు తీసిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలి: ఖర్గే

దేశంలో రైల్వే వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని మండిపడ్డారు. మోటారు సైకిల్‌పై కూర్చుని ప్రమాద స్థలికి మంత్రి చేరుకోవడంపై స్పందిస్తూ. అశ్వినీ వైష్ణవ్ రైల్వే మంత్రినా లేక రీల్ మంత్రినా అంటూ ఎద్దేవా చేశారు.

గంగమ్మ దత్తత తీసుకుంది



వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్‌లో మంగళవారం సాయంత్రం గంగా హారతి సమయంలో పూజలు చేస్తున్న మోదీ

- వారణాసి పర్యటనలో ప్రధాని మోదీ
- కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ. 20 వేల కోట్లు విడుదల

వారణాసి: గంగా మాత తనను దత్తత తీసుకున్నట్లే కనపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యాక మోదీ తొలిసారిగా మంగళవారం వారణాసిలో పర్యటించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 17వ విడత రూ.20,000 కోట్లను 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమచేశారు. మెహందీగంజ్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో మాట్లాడుతూ 'వారణాసి ప్రజలు మూడోసారి నన్ను ఎంపీగానే కాదు ప్రధానిగానూ ఎన్నుకున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇదివరకెప్పుడూ చూడని తీర్పునిచ్చారు. చరిత్ర సృష్టించారు' అని మోదీ పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వ తొలి నిర్ణయం రైతులకు, పేదలకు సంబంధించినదని అన్నారు. వికసిత్ భారత్‌కు.. రైతులు, మహిళలు, యువత, పేదలు గట్టి మూలస్తంభాలుగా తాను పరిగణిస్తానన్నారు. 'విశ్వనాథుడు, గంగా మాత ఆశీస్సులు, కాశీ ప్రజల అపార ప్రేమతో మూడోసారి దేశానికి ప్రధాన సేవకుడిని అయ్యే భాగ్యం నాకు దక్కింది. వరుసగా మూడోసారి నన్ను తమ ప్రతినిధిగా ఎన్నుకొని కాశీ ప్రజలు నన్ను ఆశీర్వదించారు. ఇప్పుడు గంగా మాత కూడా నన్ను దత్తత తీసుకున్నట్లే కనపడుతోంది. నేనిక్కడి వాడిని అయిపోయాను' అని మోదీ అన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వాలు వరుసగా మూడోసారి ఎన్నికకావడం అరుదని, భారత్ ప్రజలు దీన్ని చేసి చూపించారని ప్రధాని అన్నారు. భారత్‌లో 60 ఏళ్ల తర్వాత తమ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించిందన్నారు. 'యువత ఆకాంక్షలు, ప్రజల కలలు ఎక్కువగా ఉన్న భారత్ లాంటి దేశంలో 10 ఏళ్ల పాలన తర్వాత కూడా మరో అవకాశం రావడం ఘన విజయం. ప్రజల విశ్వాసానికి ప్రతీక' అని మోదీ అన్నారు.

ప్రతి డైనింగ్ టేబుల్‌పై మన ఆహార ఉత్పత్తులు ఉండాలి

ప్రపంచవ్యాప్తంగా ప్రతి డైనింగ్ టేబుల్‌పై మన ఆహార ఉత్పత్తులు ఉండాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ రైతులనుద్దేశించి అన్నారు. 'ప్రపంచ మార్కెట్ గురించి ఆలోచించాలి. పప్పులు, నూనె గింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిలో అగ్రగామిగా ఎదగాలి. బనారస్ లంగ్డా మామిడి, జౌన్‌పూర్ రాడిష్ రకం, గాజీపూర్ లేడీ ఫింగర్ రకం.. తదితరాలు నేడు విదేశీ మార్కెట్‌లకు చేరుతున్నాయి. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి చొరవతో, జిల్లా స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల హబ్‌ల ఏర్పాటుతో ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రపంచ ప్యాకేజ్డ్ ఫుడ్ మార్కెట్‌లో భారత్‌ను మనమిప్పుడు కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలి' అని మోదీ పేర్కొన్నారు.

ఆంక్షలపై సమష్టి సమరం

- ఉత్తరకొరియా, రష్యా బంధం బలోపేతం
- ఉ.కొరియా పర్యటనకు ముందు పుతిన్ వ్యాఖ్య




సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉత్తరకొరియాలో రెండు రోజుల పర్యటనకుగాను బుధవారం ఉదయం ఆ దేశ రాజధాని ప్యాంగ్యాంగ్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అమెరికా సారథ్యంలో రష్యా, ఉ.కొరియాలపై కొనసాగుతున్న ఆంక్షలను ఇరుదేశాలు సమష్టిగా ఎదుర్కొంటాయని పుతిన్ ప్రకటించారు. ఉ.కొరియా పర్యట నకు కొద్ది గంటల ముందు ఆయన ఆ దేశ అధికారిక వార్తా సంస్థకు రాసిన వ్యాసంలో పలు అంశాలను ప్రస్తావించారు. '' ఉక్రెయిన్ విషయంలో మా సైనిక చర్యలను సమర్థిస్తూ, సాయం చేస్తున్న ఉ.కొరియాకు కృతజ్ఞతలు. బహుళ ధ్రువ ప్రపంచం సాకారం కాకుండా అవరోధాలు సృష్టిస్తున్న పశ్చిమదేశాలను అడ్డుకుంటాం. పశ్చిమదేశాల చెప్పుచేతల్లో ఉండకుండా సొంత వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలను రష్యా, ఉ.కొరియాలు అభివృద్ధి చేయనున్నాయి. పర్యాటకం, సాంస్కృతికం, విద్యారంగాలకూ ఈ అభివృద్ధిని విస్తరిస్తాం'' అని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ జ్వాలలను మరింత రగిల్చేందుకు కావాల్సిన ఆయుధ సంపత్తిని ఉ.కొరియా సమకూర్చుతుండగా, ఆ దేశానికి అణ్వస్త్ర సామర్థ్యం, క్షిపణుల తయారీ, సాంకేతికతలను రష్యా అందిస్తోందని అమెరికాసహా పశ్చిమ దేశాలు ఆరోపిస్తుండటం తెల్సిందే. ఈ ఆరోపణలను రష్యా, ఉ.కొరియా కొట్టిపారేశాయి. పుతిన్ పర్యటన వేళ ఈ ఆయుధ సాయం, టెక్నాలజీ సాయం మరింత పెచ్చరిల్లే ప్రమాదముందని అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది.

ఉక్రెయిన్‌తో ఆగదు: అమెరికా

'ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణులే ఉక్రెయిన్‌ను ధ్వంసం చేస్తున్నాయి. రష్యా, ఉ.కొరియా బంధం దుష్ప్రభావం ఉక్రెయిన్‌కు మాత్రమే పరిమితం కాబోదు కొరియా ద్వీపకల్పంపై పడు తుంది' అని అమెరికా ప్రతినిధి జాన్ కిర్బీ ఆందోళన వ్యక్తంచేశారు. 'మండలి తీర్మానాలు, శాంతి, సుస్థిరతలకు విఘాతం కల్గించే రీతిలో రష్యా, ఉ.కొరియా సహకారం పెరగొద్దు' అని దక్షిణకొరియా హెచ్చరించింది. చెత్త నింపిన బెలూన్లను ద.కొరియా పైకి ఉ.కొరియా వదలడం విదితమే.

వలసదారులకు భారీ ఆఫర్

- అమెరికా పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలకు పౌరసత్వం ఇవ్వనున్న బైడెన్ సర్కార్
- కనీసం పదేళ్లుగా అమెరికాలో నివసిస్తున్న వాళ్లకు అవకాశం
- 5 లక్షల మందికి లబ్ధి చేకూరే చాన్స్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అమెరికా పౌరులను ఆకట్టుకునేందుకు బైడెన్ సర్కార్ అక్కడి చట్టబద్ధతలేని వలసదారులకు భారీ ఉపశమనం కల్పించనుంది. అమెరికా పౌరులను పెళ్లాడిన వారికి దేశ పౌరసత్వం ఇవ్వాలని నిర్ణయించినట్లు బైడెన్ మంగళవారం ప్రకటించారు. అయితే ఈ వలసదారు ఇప్పటికే అమెరికాలోనే కనీసం పదేళ్లుగా నివసిస్తూ ఉండాలనే షరతు విధించారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో నివసిస్తున్న దాదాపు ఐదు లక్షల మంది వలసదారులకు ఈ నిర్ణయంతో లబ్ధిచేకూరనుంది. అమెరికా పౌరుల భాగస్వాములు చట్టబద్ధత కోసం త్వరలో దరఖాస్తుచేసుకోవచ్చని తర్వాతి దశలో వాళ్లకు పౌరసత్వం ఇస్తామని బైడెన్ పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 17నాటికి అమెరికాలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని పదేళ్లు పూర్తయితే లీగల్ స్టేటస్(చట్టబద్ధత) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారి దరఖాస్తు ఆమోదం పొందితే మూడేళ్ల తర్వాత గ్రీన్‌కార్డ్ కోసం విడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారికి తాత్కాలిక వర్క్ పర్మిట్ ఇస్తారు. ఈ వర్క్ పర్మిట్ సాధిస్తే వారు దేశ బహిష్కరణ వేటు నుంచి తప్పించుకుని అమెరికాలోనే ఉద్యోగాలు/పనులు చేసుకోవచ్చు. '' పౌరసత్వంలేని భాగస్వామి, చిన్నారులతో కలసి అమెరికా పౌరులు కుటుంబసమేతంగా సంతోషంగా గడిపేందుకు అవకాశం కల్పిస్తున్నాం. కుటుంబాల ఐక్యత దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది' అని ఈ సందర్భంగా బైడెన్ వ్యాఖ్యానించారు.

పిల్లలూ దరఖాస్తు చేసుకోవచ్చు

అమెరికా పౌరులను పెళ్లాడిన అక్రమ వలసదారుల పిల్లలూ చట్టబద్ధత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలాంటి పిల్లలు దేశవ్యాప్తంగా 50,000 మంది ఉంటారని అమెరికా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. జీవితభాగస్వామి చట్టబద్ధత కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే అమెరికా పౌరులను పెళ్లాడి పదేళ్లు పూర్తికావాల్సిన పనిలేదు. అంటే పెళ్లికి ముందే అమెరికాలో పదేళ్లుగా ఉంటూ జూన్ 17వ తేదీలోపు పెళ్లాడినా సరే వాళ్లు దరఖాస్తుచేసుకునేందుకు అర్హులే. 17వ తేదీ(సోమవారం) తర్వాత పదేళ్లు పూర్తయితే వారిని అనర్హులుగా పరిగణిస్తారు. అమెరికాలో సమ్మర్ సీజన్ దాకా ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు ఫీజు వివరాలను ఇంకా నిర్ణయించలేదు. అమెరికా పౌరులను పెళ్లాడిన దాదాపు 11 లక్షల మంది వలసదారుల్లో చాలా మంది ఈ తాజా నిర్ణయంతో లబ్ధిపొందనున్నారు.

డ్రీమర్లకూ తాయిలాలు!

అమెరికాలో నివసిస్తున్న చట్టబద్ధ వలసదారుల పిల్లల(డ్రీమర్లు)కు బైడెన్ సర్కార్ అదనపు సౌకర్యాలు కల్పించనుంది. '' అమెరికా ఉన్నత విద్యా సంస్థలో డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ఆఫర్ పొందిన డ్రీమర్లు నిరభ్యంతరంగా ఉద్యోగాలు చేసుకోవచ్చు' అని బైడెన్ అన్నారు. అమెరికాలో హెచ్–1బీ, ఇతర దీర్ఘకాలిక నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాదారుల పిల్లలను 'డ్రీమర్'లుగా పిలుస్తారు. ఈ చట్టబద్ధ వలసదారుల పిల్లల వయసు 21 ఏళ్లు నిండితే వారు అమెరికాలో ఉండటానికి అనర్హులు. అప్పుడు వారివారి స్వదేశాలకు అమెరికా సాగనంపుతుంది. ఈ ప్రమాదం నుంచి వీరందరినీ బయటపడేసేందుకు గతంలో ఒబామా సర్కార్ 'డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ ప్రోగ్రామ్' పేరిట రక్షణ కల్పించిన విషయం తెల్సిందే.

భట్టీ భాయ్.. ఈద్ ముబారక్..!

పాక్ గ్యాంగ్‌స్టర్‌కు జైలు నుంచే లారెన్స్ బిష్ణోయ్ ఫోన్

అహ్మదాబాద్/చండీగఢ్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ సెంట్రల్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పాకిస్తాన్‌లోని గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టికి వీడియో కాల్ చేసి, పండుగ శుభాకాంక్షలు తెలపడం సంచలనంగా మారింది. 19 సెకన్ల నిడివి కలిగిన ఆ వీడియోలో బిష్ణోయ్ ఈ నెల 17న పాక్‌లో ఉన్న భట్టికి ఫోన్ చేసి ఈద్–ఉల్–అజా శుభాకాంక్షలు చెబుతున్నట్లుగా ఉంది. అయితే, తమ దేశంలో మరుసటి రోజు పండుగ జరుపుకుంటామని భట్టి తెలపగా, మళ్లీ ఫోన్ చేస్తానని బిష్ణోయ్ అంటున్నట్లుగా ఉంది. ఈ వీడియో ప్రామాణికత నిర్ధారణ కానప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై గుజరాత్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

బీజేపీ కీలక నేతల భేటీ

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో సీనియర్ మంత్రులు సమావేశమయ్యారు. భేటీలో మనోహర్ లాల్ ఖట్టర్, భూపేందర్ యాదవ్, వీరేంద్ర కుమార్, పీయూష్ గోయల్, అన్నపూర్ణా దేవి, ఎస్. జై శంకర్‌తోపాటు, జేడీయూ నేత లలన్ సింగ్, లోక్ జనశక్తి పార్టీ(రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ హాజరయ్యారు. ఈ నెల 24వ తేదీ నుంచి లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఉభయ సభల సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసే ప్రసంగంలో ప్రస్తావించాల్సిన అంశాలపై నేతల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను రాజ్‌నాథ్ అడిగి తెలుసుకున్నారు. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు అభ్యర్థుల ఎంపికపైనా సమావేశం చర్చించినట్లు సమాచారం. స్పీకర్ పదవికి బీజేపీ బలపరిచే అభ్యర్థికే తాము మద్దతిస్తామని ఇప్పటికే ఎన్డీఏలోని జేడీయూ స్పష్టం చేయగా ఏకాభిప్రాయం ఆధారంగానే అభ్యర్థిని నిర్ణయించాలని టీడీపీ కోరుతోంది. అదే సమయంలో, డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వాలని ఇండియా కూటమి కోరుతుండగా, బీజేపీ మాత్రం తమ భాగస్వామ్య పక్షాలకే ఈ పోస్టు ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్పీకర్ పదవికి బీజేపీ నేతలు రాధా మోహన్ సింగ్, డి.పురందేశ్వరి, భర్తృహరి మహ్తాబ్ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రొటెం స్పీకర్ పదవికి కాంగ్రెస్ సీనియర్, ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన అత్యంత సీనియర్ సభ్యుడు కె.సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

క్రిటికల్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత్, అమెరికా ముందుండాలి

జాతీయ భద్రత సలహాదారు ధోవల్

న్యూఢిల్లీ: వ్యూహాత్మక ప్రయోజనాల రీత్యా క్రిటికల్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత్, అమెరికాలు ముందంజలోనే కొనసాగాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్‌తో కలిసి మంగళవారం ఐసెట్ (ఇండియా–యూఎస్ ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ) ఇండస్ట్రీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీ విషయంలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ఐసెట్‌తో రక్షణరంగ ఆవిష్కరణలు, సెమీ కండక్టర్ పరిశ్రమల రంగాల్లో ఊహించిన దానికి మించి పురోగతి సాధించామన్నారు. సాంకేతిక భాగస్వామ్యంలో ఆవిష్కరణలు, అమలు, ఉత్పత్తి ప్రధానమైనవని సలివాన్ చెప్పారు. ప్రైవేట్ రంగంలో ఆవిష్కరణలకు ప్రభుత్వపరంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు, క్రిటికల్ మినరల్స్, అధునాతన టెలికమ్యూనికేషన్, రక్షణ, అంతరిక్ష రంగాల్లో భారత్–అమెరికా సహకారాన్ని మరింత పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సోమవారం రెండు దేశాలు ప్రకటించాయి. వాణిజ్యం, టెక్నాలజీ, పారిశ్రామిక సహకారానికి సంబంధించి రెండు దేశాల మధ్య సహకారంలో అడ్డంకులను పరిష్కరించుకోవాలని కూడా నిర్ణయించాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు దేశాల కీలక పరిశ్రమల రంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే భద్రతా విభాగంలో లక్షన్నర పోస్టులు ఖాళీ

ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే శాఖ సమాధానం

న్యూఢిల్లీ: రైల్వే భద్రతా విభాగంలో మంజూరైన 10 లక్షల పోస్టులకుగాను 1.5 లక్షలకు పైగా పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు ఆ శాఖ తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తుకు రైల్వే శాఖ ఈ మేరకు బదులిచ్చింది. అదేవిధంగా, అన్ని రకాలైన లోకో పైలట్ల పోస్టులు కలిపి 70,093 మంజూరు కాగా ప్రస్తుతం 14,429 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మొత్తం 57,551 అసిస్టెంట్ డ్రైవర్ల పోస్టులకు గాను 4,337 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని కూడా రైల్వే శాఖ వివరించింది. అయితే, రైల్వే భద్రతా ప్రాజెక్టుల కోసం 2004–14 సంవత్సరాల్లో రూ.70 వేల కోట్లు ఖర్చు చేయగా, 2014–24 సంవత్సరాల్లో 2.5 రెట్లు అధికంగా రూ.1.78 లక్షల కోట్లు వెచ్చించినట్లు ఓ అధికారి చెప్పారు.

మోదీ మౌనమేల?

- నీట్ పరీక్షపై ప్రధాని స్పందించరా?
- పేపర్‌లీకేజీ రహిత విధానాల కోసం పోరాడతాం: రాహుల్



న్యూఢిల్లీ: లోపభూయిష్ట విధానాలతో నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. నీట్ పరీక్షపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ప్రధాని మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. పేపర్‌లీకేజీలు జరక్కుండా పటిష్ట విధానాల రూపకల్పన కోసం వీధుల నుంచి పార్లమెంట్ దాకా యువత గళాన్ని వినిపించేదుకు కాంగ్రెస్ కృషిచేస్తుందని రాహుల్ ప్రకటించారు. మంగళవారం ఆయన 'ఎక్స్'లో హిందీలో పలు ట్వీట్లు చేశారు. '' 24 లక్షలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు నిర్ణయించే నీట్ పరీక్షలో లోపలున్నాయని స్పష్టమైనా మోదీ ఎప్పటిలాగే మౌనం దాల్చారు. బిహార్, గుజరాత్, హరియాణాలో అరెస్టుల పర్వాన్ని పరికిస్తే ఇదంతా వ్యవస్థీకృత నేరమని స్పష్టంగా తెలుస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలే పేపర్ లీకేజీలకు కేంద్ర స్థానాలుగా భాసిల్లుతున్నాయి. బాధ్యతగల ప్రతిపక్షంగా కాంగ్రెస్ దేశ యువత గళాన్ని వీధులు మొదలుకుని పార్లమెంట్‌దాకా వినిపించేలా చేస్తుంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. నీట్‌యూజీ–2024 పరీక్ష విధానం, నిర్వహణలో ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా సరే దానినీ సకాలంలో పరిష్కరించాలని మంగళవారం నీట్ అంశంపై కేసు విచారణసందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు.

వయనాడ్‌కు రాజీనామా

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా కొనసాగనున్నారు. రాహుల్ రాజీనామాను స్పీకర్ 18వ తేదీన ఆమోదించినట్లు లోక్‌సభ సచివాలయం మంగళవారం ఒక బులెటిన్‌లో తెలిపింది. 18వ లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ వయనాడ్, రాయ్‌బరేలీల నుంచి పోటీచేసి రెండుచోట్ల విజయం సాధించిన విషయం తెలిసిందే.

24 నుంచి కాంగ్రెస్ వరుస భేటీలు

పార్టీ బలోపేతం, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహం ఖరారు

న్యూఢిల్లీ: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించిన కాంగ్రెస్ పార్టీ అదే ఉత్సాహంతో మరికొద్ది నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే శ్రేణులను సిద్ధం చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేయడంతోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా రాష్ట్రాలతోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీలకు త్వరలో జరగనున్న ఎన్నికలకుగాను వ్యూహాలు సిద్ధం చేసేందుకు వచ్చే వారంలో వరుసగా సమావేశాలు జరిపేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలు మొదటగా జార్ఖండ్ నేతలతో సమావేశమై వ్యూహం ఖరారు చేయనున్నారు. అదేవిధంగా, 25న మహారాష్ట్ర, 26న హరియాణా, 27న జమ్మూకశ్మీర్ నేతలతో భేటీ కానున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అదేవిధంగా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించడం తెల్సిందే.

ఈవీఎంల వల్లే కర్నాటకలో బీజేపీ కూటమికి ఎక్కువ సీట్లు

తిరిగి బ్యాలెట్ పేపర్లు రావాలి: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



బెంగళూరు: రాష్ట్రంలో బీజేపీ– జేడీఎస్ కూటమి అధిక లోక్‌సభ స్థానాలు సాధించడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలే (ఈవీఎంలు) కారణమని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. ఈవీఎంల పనితీరుపై దర్యాప్తు జరగాలన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలను పక్కనబెట్టి బ్యాలెట్ పేపర్లను వాడాలని ఆయన డిమాండ్ చేశారు. 'కర్నాటకలో బీజేపీ– జేడీఎస్ కూటమి అనుకున్న దానికంటే ఎక్కువ సీట్లు గెలవడంలో ఈవీఎంల పాత్ర ఉంది. ఈవీఎంలు పోవాల్సిందే. మళ్లీ బ్యాలెట్ పేపర్లను తీసుకురావాలి. ఎన్నికల ఫలితాలపై దర్యాప్తు చేపట్టాలి' అని శివకుమార్ మంగళవారం విలేకరులతో అన్నారు. బ్యాలెట్ పేపర్లు వాడినపుడు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చేదని, ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందని (ఈవీఎంల మూలంగా) పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో 29 స్థానాలకు 29ని బీజేపీయే క్లీన్ స్వీప్ చేసింది. కర్నాటకలో 28 స్థానాలుండగా... బీజేపీ 17, జేడీఎస్ 2, కాంగ్రెస్ 11 చోట్ల గెలిచాయి.

41 ఎయిర్ పోర్టులకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 41 విమానాశ్రయాలకు మంగళవారం బాంబు బెదిరింపు మెయిళ్లు అందాయి. 'హలో, ఎయిర్‌పోర్టులో పేలుడు పదార్థాలు అమర్చాం. అవి త్వరలోనే పేలుతాయి. మీరంతా చనిపోవడం ఖాయం'అని అందులో ఉంది. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా విభాగాలు పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టాయి. ఎటువంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అవన్నీ వట్టి బెదిరింపులేనని తేల్చాయి. మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో విమానాశ్రయాలన్నిటికీ exhumedyou888 @gmail. com ఐడీ నుంచే బెదిరింపులు అందినట్లు అధికారులు తెలిపారు. కేఎన్ఆర్ అనే అనుమానాస్పద ఆన్‌లైన్ గ్రూప్ నుంచే ఈ మెయిళ్లు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే గ్రూపు గతంలో ఢిల్లీలోని స్కూళ్లలో మే ఒకటో తేదీన బాంబులు పెట్టినట్లు బెదిరింపు మెయిళ్లు పంపించిందని అంటున్నారు.

థాయ్ మాజీ ప్రధాని థక్సిన్‌కు ఎదురుదెబ్బ

రాజకుటుంబం పరువునష్టం కేసులో దోషిగా ప్రకటించిన కోర్టు



బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్ రాజరికాన్ని దూషించిన కేసులో దేశ మాజీ ప్రధానమంత్రి థక్సిన్ షినవత్ర(74)ను కోర్టు దోషిగా ప్రకటించింది. థాయ్ రాజకీయాల్లో కీలకంగా ఉన్న థక్సిన్ 18 ఏళ్ల క్రితం, 2006లో ప్రధాని పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గతేడాదే ఆయన స్వదేశానికి చేరుకున్నారు. సంప్రదాయవాదులకు, రాజరికానికి అనుకూలంగా ఉండే రాజ్యాంగ న్యాయస్థానం థక్సిన్‌పై విచారణ చేపట్టింది. థక్సిన్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో ఉండటంతో కోర్టు మంగళవారం ఉదయం వర్చువల్‌గా విచారణ జరిపి, దోషిగా తేల్చింది. ఆ వెంటనే, దేశం విడిచి వెళ్లరాదనే షరతుతో ఆయనకు రూ.11 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. అయితే, థక్సిన్‌పై పలు అవినీతి ఆరోపణల కేసులు కూడా ఉన్నాయి. థక్సిన్ షినవత్ర సారథ్యంలోని ఫ్యూ థాయ్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. ఆ పార్టీకి చెందిన శ్రేత్థ థవిసిన్ ప్రధానిగా ఉన్నారు. ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలపై రాజ్యాంగ కోర్టు విచారణ చేపట్టింది. రుజువైతే ఆయన కూడా పదవి కోల్పోయే ప్రమాదముంది. కాగా, థాయ్‌ల్యాండ్‌లో రాజకుటుంబాన్ని విమర్శించడం అత్యంత తీవ్రమైన నేరం. ఇందుకు గాను, 3 నుంచి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది.

30 నుంచి మోదీ 'మన్ కీ బాత్'

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసే రేడియో ప్రసంగం 'మన్ కీ బాత్' మళ్లీ ప్రారంభం కానుంది. 110వ ఎపిసోడ్ ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన మోదీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో కార్యక్రమానికి తాత్కాలికంగా విరామమిచ్చారు. ఇటీవల మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 111వ ఎపిసోడ్‌ను ఈనెల 30న ప్రారంభిస్తున్నట్లు మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు.

నేటి నుంచి కొలొరెక్టల్ మెగా ఉచిత వైద్య శిబిరం

సాక్షి, చెన్నై: గ్యాస్ట్రో ఎంటరాలజీ, లాపరో స్కోపిక్, రోబోటిక్ సర్జరీ విభాగం నేతృత్వంలో బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు కొలొరెక్టల్ మెగా ఉచిత వైద్య అవగాహన శిబిరం నిర్వహించనున్నామని జెమ్ ఆస్పత్రి చైర్మన్ సి. పళణి వేలు, డైరెక్టర్ డాక్టర్ పి. సెంథిల్‌నాథన్ తెలిపారు. పెరుంగుడిలోని ఆస్పత్రిలో కొలొరెక్టల్ క్యాన్సర్ లక్షణాలను వివరిస్తూ, అవగాహన శిబిరం గురించి ప్రకటించారు. నిపుణుల నుంచి ఉచిత సంప్రదింపులకు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించామని, అవసరమైన రోగులకు ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కాన్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మలబద్ధకం, మలంలో రక్తం, మలవిసర్జన సమయంలో నొప్పి, పాయువులో వాపు, తదితర సమస్యలతోపాటు ఇతర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఎవరికీ మద్దతు లేదు
• విజయ్

సాక్షి, చెన్నై: విక్రవాండి ఉప ఎన్నికలలో తాము ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని, తమ పార్టీ తరపునో, అభిమానుల తరపునో ఎవ్వరూ పోటీ చేయడం లేదని తమిళగ వెట్రి కళగం నేత విజయ్ స్పష్టం చేశారు. వివరాలు.. విక్రవాండిలో ఉప ఎన్నికల సందడి నెలకొన్న విషయం తెలిసిందే. డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివ బుధవారం నామినేషన్ దాఖలుకు సిద్ధమయ్యారు. లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో శివా గెలుపే లక్ష్యంగా డీఎంకే వర్గాలు ఉరకలు తీస్తున్నాయి. ఈ గెలుపులో తాము సైతం భాగమయ్యే విధంగా ఎన్నికల కమిటీని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ కమిటీతో మంగళవారం తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై సమావేశమయ్యారు. డీఎంకే అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఆదేశించారు. అదే సమయంలో ఈ ఎన్నికలలో విజయ్ అభిమానుల మద్దతుకు ప్రయత్నాలు స్థానికంగా జరగడంతో ఎవరికీ మద్దతు లేదన్న ప్రకటన మంగళవారం వెలువడింది. విజయ్ తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి భుషి ఆనంద్ ఈ ప్రకటనను విడుదల చేశారు. పార్టీ ఆవిర్భావ సమయంలోనే తాము స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చామన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ముందుగా ఎలాంటి న్నికలు జరిగినా తాము పోటీ చేయమని, ఎవరికీ మద్దతు ఇవ్వమని విజయ్ స్పష్టం చేశారని తెలిపారు. పార్టీ ఆవిర్భావ మహానాడుకు కసరత్తు జరుగుతోందని, త్వరలో 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా విజయ్ రాజకీయ ప్రయాణం షెడ్యూల్ వెలువడుతుందని పేర్కొన్నారు.

ముఖ్య నేతల జయంతి రోజున స్వీట్ పొంగలి
• పాఠశాలల్లో పంపిణీకి నిధులు

సాక్షి, చెన్నై: దివంగతులైన ముఖ్య నేతలు, స్వాతంత్ర్య సమర యోధుల జయంతి రోజున బడులలో స్వీట్ పొంగలిని తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సామాజిక సంక్షేమ శాఖ మంగళవారం జారీ చేసింది. ఈ స్వీట్‌పొంగళి తయారీకి రూ. 4.27 కోట్లను కేటాయించారు. జాతీయ స్థాయిలో ముఖ్య నేతలుగా పేరు గడించిన వారు, స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్రను పోషించిన ముఖ్య పెద్దల జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇకపై ఈ నేతల జయంతి రోజులలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం వేళ స్వీట్ పొంగళి తయారు చేసి మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా అందజేయడం జరుగుతుందని ప్రకటించారు. 42 లక్షల మంది విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం అమలు చేస్తున్నామని, ఇందు కోసం రూ. 4.27 కోట్లను కేటాయిస్తున్నామని ప్రకటించారు.

ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన కారు
• యువకుడి మృతి

సాక్షి, చెన్నై: మద్యం మత్తులో ఫుట్‌పాత్‌పై నిద్రించిన యువకుడిని ఓ కారు రూపంలో మృత్యువు కబళించింది. కారును వేగంగా ఫుట్‌పాత్ మీదుగా నడిపి యువకుడి మృతికి కారకురాలైన యువతిని చెన్నై అడయార్ పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నైలోని బీసెంట్ నగర్ ఒడైకుప్పం ప్రాంతానికి చెందిన సూర్య (22) పెయింటర్. ఇతడు ఇంట్లో గొడవ పడి మద్యం మత్తులో సోమవారం రాత్రి బీసెంట్ నగర్ కళాక్షేత్ర కాలనీ వరదరాజ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌పై నిద్రించాడు. రాత్రి సమయంలో అటువైపుగా వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి సూర్యపై దూసుకొచ్చి ఆగకుండా వెళ్లి పోయింది. గాయాల పాలైన సూర్యను స్థానికులు ఆస్పత్రికి తరలించగా మరణించాడు. అడయార్ పోలీసులు కేసు నమోదు చేసి ఆ పరిసరాలలోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా విచారణ చేపట్టారు.

మంత్రి సెంజి మస్తాన్‌కు మళ్లీ పార్టీ పదవి



సాక్షి, చెన్నై : మంత్రి సెంజి మస్తాన్‌కు మళ్లీ డీఎంకేలో పదవి దక్కింది. విల్లుపురం ఉత్తర జిల్లా పార్టీ ప్రిసీడియం చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం డీఎంకే ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ ప్రకటించారు. వివరాలు.. విల్లుపురం జిల్లాను పార్టీ పరంగా డీఎంకేలో రెండుగా చీల్చిన విషయం తెలిసిందే. విల్లుపురం దక్షిణం జిల్లా కార్యదర్శిగా, ఎమెల్యేగా ఉన్న పుగలేంది మరణించడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. దీంతో దక్షిణ జిల్లా కార్యదర్శి పదవిని మంత్రి పొన్ముడి తనయుడు గౌతం శిఖామణికి అప్పగించారు. అలాగే ఉత్తరం జిల్లా కార్యదర్శిగా ఉన్న మైనారిటీ శాఖ మంత్రి సెంజిమస్తాన్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో శేఖర్‌ను నియమించారు. పార్టీ పదవి దూరం కావడంతో మంత్రి పదవి సైతం సెంజిమస్తాన్‌కు దూరమైనట్టేనా? అన్న చర్చ జోరందుకుంది. ఈ పరిస్థితులలో ఆయనకు పార్టీ పరంగా పదవిని కేటాయించారు. సంస్థాగతంగా జరిగిన ఎన్నిక మేరకు పార్టీ విల్లుపురం ఉత్తరం జిల్లా ప్రిసీడియం చైర్మన్‌గా ఆయన ఎంపికయ్యారు. ఈ నియామకాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ ఆమోదించారు.

చరిత్రకు సాక్ష్యాలు.. పురావస్తు ఆధారాలు

రాష్ట్రంలో పురావస్తు తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఎనిమిది చోట్ల చేపట్టిన ఈ పనులను చెన్నై నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఎంకే స్టాలిన్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పురావస్తు ఆధారాలు, చరిత్రను చాటే విధంగా రూపొందించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు.

- రాష్ట్రంలో పురావస్తు తవ్వకాలకు శ్రీకారం
- 8 చోట్ల ముమ్మరంగా పనులు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన సీఎం స్టాలిన్





పురావస్తు తవ్వకాలను లాంఛనంగా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం పురావస్తు తవ్వకాలకు అధిక ప్రాధాన్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ తవ్వకాల ద్వారా ఇప్పటికే తమిళనాడు చరిత్రకు సంబంధించిన కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవలి కాలంలో చేపట్టిన పురావస్తు తవ్వకాల ద్వారా చరిత్రలో ప్రాచీనత, సంస్కృతి, సాంకేతికత, ప్రాచీన తమిళ సమాజం విలువలు ఎన్నో ఆధారాలతో సహా బయట పడ్డాయని చెప్పవచ్చు. గత ఏడాది ఎనిమిది చోట్ల తరహాలోనే ఈ ఏడాది కూడా మరో ఎనిమిది చోట్ల పురావస్తు తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులకు సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టారు. ఇందులో శివగంగై జిల్లా కీలడి సమీపంలోని కుందవై గ్రామం, విరుదునగర్ జిల్లా వెంబకోట్టై, తిరువణ్ణామలై జిల్లా కిల్నామండి, పుదుకోట్టై జిల్లా పోల్పనై కోట్టై, తెన్‌కాశి జిల్లా తిరుమలపురం, కృష్ణగిరి జిల్లా చెన్ననూర్, తిరుపూర్ జిల్లా కొంగల్‌నగర్, కడలూరు జిల్లాలోని మరుంగూర్ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ తవ్వకాలలో బయట పడే వస్తువులను భద్రత పరచాలని సీఎం ఆదేశించారు. శివగంగై జిల్లా, తిరుబువనం సర్కిల్‌లోని 110 ఎకరాల విస్తీర్ణంలో జరిపిన పురావస్తు పరిశోధనలలో బంగారు ఆభరణాలు, దంతపు పాచికలు, అందమైన శిల్పాలు, మట్టితో చేసిన జంతువుల బొమ్మలు, మట్టితో చేసిన ఇటుకలు, గుండ్రని రాళ్లు, 804 రాగి నాణేలు, రాగి సూదులు, ఇనుప మేకులు వంటివి బయపడ్డాయని సీఎం వివరించారు. అందుకే పురావస్తు పరిశోధనలను ఆయా ప్రాంతాలలో విస్తృతం చేశామని ప్రకటించారు. అలాగే తమిళనాడు ప్రభుత్వ ఆర్కియాలజీ విభాగం తరపున 2022–2023 సంవత్సరంలో ధర్మపురి జిల్లా, పురుంబలైలోని ప్రదేశంలో జరిపిన తవ్వకాలు, చెంగల్పట్టు జిల్లాలో బయటపడ్డ 138 శాసనాల నివేదికలలోని వివరాలను పుస్తక రూపంలో సిద్ధం చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, కేఆర్ పెరియకరుప్పన్, సీఎస్ శివదాస్‌మీనా, అదనపు ముఖ్య కార్యదర్శి డా. మణివాసన్, సీనియర్ అధికారి ఉదయ చంద్రన్, ఎంపీలు మాణిక్యం ఠాకూర్, కార్తీ చిదంబరం తదితరులు పాల్గొన్నారు.



పురావస్తు అంశాలతో కూడిన పుసకావిష్కరణ

రామానుజర్ జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ



దివంగత మాజీ సీఎం, డీఎంకే అధినేత కలైంజ్ఞర్ కరుణానిధి రచించిన రామానుజర్ జీవిత చరిత్రకు సంబంధించిన ధారావాహికను ×రామానుజర్ – మతంలో గొప్ప విప్లవకారుడు×పేరిట పుస్తకం రూపంలో తీసుకొచ్చారు. హిందూ మత దేవదాయ శాఖ ప్రచురణల విభాగం ఈ పుస్తకాన్ని సిద్ధం చేసింది. దీనిని సీఎం స్టాలిన్ సచివాలయంలో ఆవిష్కరించారు. రామానుజర్ చరిత్రను టెలివిజన్ సీరిస్‌గా గతంలో తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిని కలైంజర్ కరుణానిధి రచించారు. ఈ ధారావాహికను పుస్తకం రూపంలో తీసుకొస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు, ఆళ్వార్ తిరునగరి ఎంపెరుమానార్ జియ్యర్ మఠం శ్రీమత్ పరమహంసేత్యతి రంగ రామానుజ జియ్యర్, శ్రీపెరంబదూరు శ్రీఎంబార్ జియ్యర్ మఠం శ్రీశ్రీశ్రీ అప్పన్ ఉలగారియ రామనుజ ఎంబర్ జియ్యర్ స్వామి, శ్రీ విళ్లిపుత్తూరు శ్రీ మనవాల మా ము ని జియ్యర్‌మఠం శఠగోప రామనుజ జియ్యర్ స్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా, పర్యాటక, సాంస్కృతిక, హిందూ ధార్మిక శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, హిందూ మత ధర్మాదాయ శాఖ ప్రత్యేక మిషనర్ కుమర గురుబరన్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ఆమ్నీలపై నిషేధం

- బస్సులలో టికెట్లు బుక్ చేసుకోవద్దు
- ప్రయాణికులకు అధికారుల విజ్ఞప్తి



ఆమ్నీ బస్టాండ్

సాక్షి, చెన్నై: ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నంబర్లతో తమిళనాడులో నడుస్తున్న ప్రైవేటు ఆమ్నీ బస్సులపై నిషేధం విధించారు. ఈ బస్సులు రోడ్డెక్కిన పక్షంలో సీజ్ చేయడానికి చర్యలు చేపట్టారు. వివరాలు.. రాష్ట్రంలో సుమారు 3 వేలకు పైగా ఆమ్నీ ప్రైవేటు బస్సులు ఉన్నాయి. ఇందులో 1500లకు పైగా బస్సులు తమిళనాడు రిజిస్ట్రేషన్లతో నడుస్తున్నాయి. 800లకు పైగా బస్సులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ముంబై, యూపీ తదితర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లతో నడుస్తున్నాయి. ఆల్ ఇండియా టూరిస్టు పర్మిట్ పేరిట ఈ బస్సులు నడుస్తుండడం, ఈ బస్సుల రూపంలో తమిళనాడు ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఎలాంటి ఆదాయం లేక పోవడాన్ని అధికారులు పరిగణించారు. దీంతో తమిళనాడులోని వివిధ నగరాలు, జిల్లాల కేంద్రాలకు చెన్నై వంటి నగరాల నుంచి నడిపే ఆమ్నీ ప్రైవేటు బస్సులు తప్పని సరిగా తమిళనాడు రిజిస్ట్రేషన్‌ను కలిగి ఉండాల్సిందేనని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఈ వాహనాలు తమిళనాట నడిపేందుకు గతంలో విధించిన మార్గదర్శకాలను అనుసరించాల్సిందేనని ప్రకటించారు. అయితే వీటిని సక్రమంగా ఆ యాజమాన్యాలు పాటించకుండా వచ్చాయి. తమిళనాడుకు రావాల్సిన రోడ్ ట్యాక్స్ వ్యవహారంలో నష్టం తప్పలేదు. దీంతో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లతో తమిళనాడులో నడిపే వాహనాలకు నిషేధం విధించనున్నామని కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. దీంతో ఆ బస్సుల యాజమాన్యాలు, ఆమ్నీ బస్సుల యాజమాన్య సంఘాలు తమకు కొంత సమయం గడువుగా ఇవ్వాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం అంగీకరించింది. అయినా ఇతర రాష్ట్రాల వాహన రిజిస్ట్రేషన్లతోనే బస్సులు రోడ్డెక్కుతుండడం, ఇచ్చిన గడువు సోమవారం రాత్రితో ముగియడంతో మంగళవారం నుంచి ఈ బస్సులకు నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో వివిధ రూట్లలో తిరుగుతున్న ఇతర రాష్ట్ర రిజిస్ట్రేషన్లు కలిగిన వాహన నెంబర్లను సైతం అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ బస్సులలో ప్రయాణానికి సంబంధించి టికెట్లను బుక్‌చేసుకోవద్దని ప్రయాణికులకు సూచించారు. ఈ బస్సులు రోడ్డెక్కిన పక్షంలో సీజ్ చేస్తామని ప్రకటించారు.

మూడు చట్టాలను సమీక్షించండి

- అమిత్ షాకు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై : భారతీయ శిక్షా స్మృతులకు బదులుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు కొత్త చట్టాలపై సమీక్షించాలని, అంత వరకు అమలును నిలుపుదల చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను సీఎం స్టాలిన్ కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ – 1860, క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్ –1973 రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త నేరాలను అమలులోకి తెచ్చినట్లు ఆ లేఖలో వివరించారు. ఈ చట్టాల అమలులో రాష్ట్రాలకు అభ్యంతారాలు ఉన్నాయని, ఇందుకు ఎదురయ్యే సమస్యలను ఈ లేఖ ద్వారా వివరించినట్లు పేర్కొన్నారు. కొత్త చట్టాలు అమలు కోసం విద్యా సంస్థలతో చర్చలు, న్యాయ కళాశాలల విద్యార్థుల కోసం సిలబస్‌ను సవరించేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఇతర సాంకేతిక అవసరాలు, న్యాయవ్యవస్థ, పోలీసు, జైళ్లు, ప్రాసిక్యూషన్ విచారణ, ఫోరెన్సిక్స్ కోసం వనరుల కల్పనకు సమయం పడుతుందని తెలిపారు. సాధ్యమైన చోట సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరుపుతూ వస్తున్నామని, అయితే, సమస్యలు తప్పడం లేదని, అందుకే ఈ కొత్త చట్టాల అమలును నిలుపుదల చేసి , మరింతగా సమీక్షించాలని ఆ లేఖలో కోరారు.

మత విద్వేషాల కట్టడికి మార్గదర్శకాలు



సీఎం స్టాలిన్‌కు నివేదిక సమర్పిస్తున్న జస్టిస్ చంద్రు కమిటీ

సాక్షి, చెన్నై: సచివాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మధ్య కుల, మత విద్వేషాల చోటు చేసుకోకుండా, ఎక్కడైనా వెలుగు చూసి పక్షంలో కట్టడి దిశగా చేపట్టాల్సిన అంశాలతో కొత్త మార్గదర్శకాలను రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రు నేతృత్వంలోని కమిటీ నివేదిక రూపంలో సిద్ధం చేసింది. తన విచారణను, పరిశీలనను ముగించిన ఈ కమిటీ నివేదికను ఈమేరకు మంగళవారం సీఎం స్టాలిన్‌కు సమర్పించింది.

నలుగురు మత్స్యకారుల అరెస్టు
• అదుపులోకి తీసుకున్న శ్రీలంక నేవీ

కొరుక్కుపేట: తమిళనాడుకు చెందిన నలుగురు మత్స్యకారులను శ్రీలంక నేవీ అరెస్ట్ చేసింది. వివరాలు.. పుదుకోట్టై జిల్లా కొత్తపట్నం నుంచి సముద్రంలో చేపలు పట్టేందుకు మత్స్యకారులు 241 పవర్ బోట్లలో వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన పార్థిబన్ (32), మురళి(42), భారతి(28), రామదాస్ (52), కొత్తపట్నంకు చెందిన సిబిరాజ్‌కు చెందిన పవర్ బోటులో చేపల వేటకు వెళ్లారు. సోమవారం ఉదయం జాలర్లు వలలు వేసి చేపలు పట్టుకుంటున్నారు. ఆ సమయంలో శ్రీలంక నావికాదళం నౌకపై గస్తీ తిరుగుతోంది. కొద్దిసేపటికే మత్స్యకారులు చేపల వేటకు పాల్పడుతున్న ఓడను చుట్టుముట్టి పార్థిబన్, మురళి, భారతి, రామదాసును అదుపులోకి తీసుకున్నారు. వారి పడవను కూడా స్వాధీనం చేసుకున్నారు. కాగా శ్రీలంక నేవీ వరుస ఘటనలను అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని తమిళ జాలర్లు డిమాండ్ చేశారు.

మళ్లీ మినీ బస్సు సేవలు

- 25 కి.మీ దూరం సేవల పొడిగింపు



మినీ బస్సు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో మళ్లీ మినీ బస్సు సేవలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 25 కి.మీ దూరం వరకు ఈ బస్సులను నడుపుకునేందుకు అవకాశం కల్పిస్తూ అధికారులు గెజిట్‌లో వివరాలను ప్రకటించారు. వివరాలు..గ్రామాలకు బస్సు సౌకర్యం కలిగించే విధంగా 1997లో తమిళనాడులో మినీ బస్సుల సేవలకు శ్రీకారం చుట్టారు. ప్రైవేటు మినీ బస్సులే అధికంగా సేవలను అందిస్తూ వచ్చాయి. తొలుత 16 కి.మీ దూరం వరకు ఈ బస్సులు నడుపుకునేందుకు అవకాశం కల్పించారు. 1999లో ఈ సేవలను విస్తరిస్తూ 20 కి.మీ దూరం వరకు నడుపుకునే విధంగా విస్తరించారు. ప్రభుత్వ, ప్రైవేటు మినీ బస్సుల ద్వారా కుగ్రామాలకు సైతం సేవలను అందిస్తూ వచ్చారు. చెన్నై వంటి నగరాలలో చిన్నచిన్న వీధుల గుండా అనేక ప్రాంతాలను కలిపే విధంగా స్మాల్ బస్సులను పరిచయం చేశారు. కరోనా కాలంలో ఈ బస్సుల సేవలకు తీవ్ర ఆటంకం తప్పలేదు. ఆ తదుపరి పరిణామాలతో ఈ బస్సులు సేవలు పూర్తిగా ఆగాయి. తాజాగా మినీ బస్సుల సేవలను మళ్లీ పునరుద్ధరించే విధంగా గెజిట్‌లో వివరాలను మంగళవారం ప్రకటించారు. మినీ బస్సుల సేవలు 25 కి.మీ దూరం వరకు సాగే రీతిలో చర్యలు తీసుకున్నారు. ఇందులో 17 కి.మీ దూరం ఎలాంటి బస్సులు లేని మార్గాలలో, మరో 8 కి.మీ దూరం ఇతర బస్సుల సేవలు ఉన్న మార్గాలలోనూ మినీ బస్సులను నడుపుకునేందుకు అవకాశం కల్పించారు. చెన్నై నగరంలో తండయార్‌పేట, రాయపురం, తిరువీకానగర్, అన్నానగర్, తేనాంపేట, అడయార్ తదితర ఏడు మండలాలలో ఇప్పటికే మినీ బస్సులు ఉన్నాయి. మిగిలిన మండలాలలో మినీ బస్సుల సేవలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే చెన్నై కార్పొరేషన్‌లో కొత్తగా చేరిన తిరువొత్తియూరు, మనలి, మాధవరం, అంబత్తూరు, వలసరవ్కాం, ఆలందూరు, పెరుంగుండి, షోలింగనల్లూరు పరిసరాలలోనూ మినీ బస్సు సేవలు విస్తరించే విధంగా బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఆస్పత్రులు జనం అత్యధికంగా ప్రయాణించే మార్గాలతో రూట్ మ్యాప్ సిద్ధం చేసి మినీ బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టారు.

అజ్ఞాతంలోకి మాజీ మంత్రి?

- సీబీసీఐడీ విచారణ ముమ్మరం

సాక్షి, చెన్నై: కరూర్‌లో రూ. 100 కోట్ల స్థలాన్ని అపహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ రవాణాశాఖ మంత్రి ఎంఆర్ విజయ భాస్కర్ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలిసింది. ఆయన కశ్మీర్ పర్యటన పేరిట విచారణ నుంచి తప్పించుకునే పనిలో పడ్డట్టుగా వెలువడ్డ సంకేతాలతో సీబీసీఐడీ అధికారులు తీవ్ర విచారణ జరుపుతున్నారు. కరూర్ జిల్లా వాంగల్ కుప్పిచ్చి పాళయానికి చెందిన ప్రకాష్ అనే పారిశ్రామిక వేత్త ఇచ్చిన ఫిర్యాదుతో రూ. 100 కోట్ల స్థల కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తన స్థలాన్ని బలవంతంగా ఆక్రమించిన మాజీ మంత్రి ఎంఆర్ విజయ భాస్కర్ గురించిన అన్ని వివరాలను పారిశ్రామికవేత్త పోలీసులకు అందజేశాడు. దీంతో కేసును సీబీసీఐడీకి డీజీపీ శంకర్‌జివ్వాల్ అందజేశారు. ఈ కేసు విచారణ నిమిత్తం సీబీసీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. ఎక్కడ విచారణ పేరిట వేధిస్తారో? అరెస్టు చేస్తారో? అనే ఆందోళన మాజీ మంత్రికి తప్పలేదు. ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్ విచారణ వాయిదాపడిన నేపథ్యంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సంకేతాలు వెలువడ్డాయి. కశ్మీర్ పర్యటన పేరిట ఆయన బయటకు వెళ్లినట్టుగా మద్దతు దారులు పేర్కొనడంతో సీబీసీఐడీ అధికారులు తమ విచారణను మరింత వేగవంతం చేస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు.

దుబాయ్ విమానానికి బూచీ

- చెన్నైలో కలకలం
- 15 గంటలు ఆలస్యంగా టేకాఫ్
- గాలీవాన కారణంగా పలు విమాన సేవల్లో జాప్యం



ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సాక్షి,చెన్నై: చెన్నై నుంచి దుబాయ్‌కు మంగళవారం ఉదయం బయలుదేరిన విమానాన్ని రన్ వే మీద ఆపేశారు. టర్కీ రాజధాని ఇస్తాంబుల్ నుంచి వచ్చిన బెదిరింపుతో ఈ విమానంలో ఉన్న ప్రయాణికులను ఆగమేఘాలపై దించేశారు. విమానాన్ని, ప్రయాణికుల బ్యాగ్‌లు, షూట్‌కేసులను క్షుణ్ణంగా పరిశీలించారు. 15 గంటల అనంతరం ఈ విమానం టేకాఫ్ తీసుకుంది. వివరాలు.. చెన్నై విమానాశ్రయానికి ఇటీవల కాలంలో బాంబు బెదిరింపులు తరచూ వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 5 సార్లు వచ్చిన బెదిరింపు కాల్స్, మెయిల్స్‌తో అధికారులు కలవరం చెందాల్సి వచ్చింది. భద్రతను కట్టుదిట్టం చేసి అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అయినా బెదిరింపులు ఆగడం లేదు. చెన్నై నుంచి మంగళవారం ఉదయం దుబాయ్‌కు అరబ్ ఎమిరైట్స్ విమానం 286 మంది ప్రయాణికులతో ఉదయం టేకాఫ్ తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ సమయంలో వచ్చిన బెదిరింపు మెయిల్‌తో అధికారులు అలర్ట్ అయ్యారు. ఈసారి బెదిరింపులు టర్కీలోని ఇస్తాంబుల్ నుంచి రావడంతో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. రన్ వే మీదున్న ఆవిమానం టేకాఫ్‌ను నిలుపుదల చేశారు. తక్షణం ప్రయాణికుల బ్యాగ్‌లు, సూట్ కేసులన్నింటినీ రన్ వే మీదకు తీసుకొచ్చారు. అనంతరం ప్రయాణికులను విమానం నుంచి దించేసి కాసేపు విమానాశ్రయంలో ఉంచారు. అనంతరం సమీపంలోని హోటళ్లకు వీరిని తరలించారు. తొలుత అధికారులు తమకు సమాచారం సరిగ్గా ఇవ్వక పోవడంతో పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో గొడవకు దిగారు. చివరకు బాంబు బెదిరింపు సమాచారంతో ఆ ప్రయాణికులు హోటళ్లకు కదిలారు. విమానాన్ని, ప్రయాణికుల బ్యాగ్‌లు, సూట్ కేసులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ తర్వాత 15 గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు చెన్నై నుంచి ఈ విమానం దుబాయ్‌కు టేకాఫ్ తీసుకుంది. ఈ బెదిరింపు కాల్స్, మెయిల్స్ శిరోభారంగా మారినా, అధికారులు మరింత జాగ్రత్తగా ముందుకెళ్తున్నారు. విమానాశ్రయం పరిసరాలలో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలలో నిమగ్నమయ్యాయి. విమానాశ్రయానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తున్నారు.

గాలీవానతో జాప్యం

మంగళవారం వేకువ జామున చెన్నైలో అనేక చోట్ల ఈదురు గాలులతో వర్షం కురిసింది. విమానాశ్రయ పరిసరాలలో గాలుల ధాటికి పలు విమానాల సేవలలో మార్పులు చేయక తప్పలేదు. 31 విమానాలకు ఆటంకం కలిగింది. ఈ జాప్యంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. కొన్ని విమానాలు గంట నుంచి రెండు గంటల మేరకు ఆలస్యంగా నడిచాయి.

పోలీసులకు రెస్క్యూ పరికరాల పంపిణీ



కిట్‌లను అందజేస్తున్న కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్

కొరుక్కుపేట: పోలీసులకు రెస్క్యూ పరికరాలతో పాటు ఎన్‌జీఓలకు క్రికెట్ కిట్‌లు, టీషర్టులు (జెర్సీలు) అందజేశారు. వీటిని నగర పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు తరపున నిర్వహిస్తున్న కావల్ కరంగల్ వలంటర్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో నగర పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ఎన్‌జీఓల సేవలను కొనియాడారు. అనంతరం రెస్క్యూ పరికరాలు, అలాగే క్రీడాసామగ్రి, టీషర్టులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మానవుని గౌరవించడం, మానవాళికి సేవ చేయడం లక్ష్యంగా ఏర్పడిన కావల్ కరంగల్ అనేక విధాలుగా ప్రజలను రక్షిస్తుందన్నారు. కావల్ కరంగల్ ద్వారా 6,826 మందిని రక్షించారని చెప్పారు. అలాగే 4,788 మందిని షెల్టర్ హోమ్‌లకు పంపించామని, 1,059 మందిని వారి కుటుంబాలకు అప్పగించినట్టు తెలిపారు. అలాగే 737మందిని వైద్య చికిత్సల కోసం మానసిక ఆరోగ్య ఆస్పత్రికి పంపామని ఆయన గుర్తు చేశారు.

క్లుప్తంగా

కొలనులో మునిగి విద్యార్థి మృతి

అన్నానగర్: కొలనులో మునిగి విద్యార్థి మృతి చెందాడు. చెన్నై సమీపంలోని ఎన్నూర్ కాట్టుకు ప్పానికి చెందిన దీపక్ (18) వేలాచ్చేరి ప్రైవేట్ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం వేలాచ్చేరికి చెందిన తన స్నేహితులు ఆకాష్, సైదాపేటకు చెందిన ప్రవీణ్, బాలాజీతో కలిసి పల్లికరణై కొలను వద్దకు వచ్చాడు. ఆ తర్వాత నలుగురు స్నేహితులు కొలనులోకి దిగి స్నానం చేశారు. ఈ క్రమంలో దీపక్ సరస్సులోని లోతైన ప్రాంతానికి వెళ్లి నీటిలో మునిగిపోయాడు. అతని స్నేహితులు ఇచ్చిన సమాచారంతో పల్లికరణై పోలీసులు, వేళచ్చేరి అగ్నిమాపక శాఖ అధికారులు రంగంలోకి దిగి పడవలో దీపక్ స్నానం చేసే ప్రాంతానికి వెళ్లి వెతికారు. కానీ అతని మృతదేహం లభ్యం కాలేదు. చివరికి మెరీనా స్కూపింగ్ డైవింగ్ యూనిట్ కొలను వద్దకు చేరుకుని సరస్సులో గల్లంతైన దీపక్ మృతదేహాన్ని వెలికితీసి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు దీపక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోమ్‌పేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



వాహన చోదకులను ఆపి, అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

తిరుత్తణి: రోడ్డు భద్రతపై వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ శ్రీనివాస పెరుమాళ్ ఆదేశాల మేరకు తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ నేతృత్వంలో తిరుత్తణి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానతి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతకు సంబంధించి వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చెన్నై బైపాస్ రోడ్డులో హెల్మెట్ వినియోగించకుండా రోడ్డు భద్రత నిబంధనలు అధిగమించి, వాహనాలు నడిపిన వారికి, ఆటోల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించిన వారికి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించడంతో పెను ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు వినియోగించాలని సూచించారు. అలాగే రోడ్డు నిబంధనల ప్రకారం వాహనాలు నడిపి ప్రమాదాలు నివారణకు తమవంతు కృషి చేయాలని అవగాహన కల్పించారు.

నాణ్యమైన వైద్యసేవలందించడమే ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న బంగారుగుడి పీఠాధిపతి శక్తిఅమ్మ

వేలూరు: అత్యవసర సమయంలో సరైన వైద్యం అందక మరణిస్తున్న వారి ప్రాణాలు కాపాడేందుకే జిల్లా వ్యాప్తంగా శక్తిఅమ్మ ఆస్పత్రులు ప్రారంభిస్తున్నట్లు వేలూరు శ్రీపురం బంగారుగుడి పీఠాధిపతి శక్తిఅమ్మ తెలిపారు. వేలూరు తోటపాళ్యంలో నూతనంగా నిర్మించిన శ్రీశక్తిఅమ్మ ఆస్పత్రిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శక్తిఅమ్మ మాట్లాడుతూ నిరుపేదలకు తక్కువ ఫీజులతో కూడిన వైద్యసేవలు అందజేసేందుకే శ్రీపురంలో నారాయణి ఆస్పత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం తోటపాళ్యంలో ఆస్పత్రిని నిర్మించి, వేలూరు పట్టణ ప్రజలతోపాటు గ్రామీణ ప్రాంత రోగులు కూడా ఉపయోగించుకునేలా ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే బంగారుగుడి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ప్రస్తుతం వైద్య సేవలను ప్రారంభించామని చెప్పారు. అత్యవసర సమయంలో రోగులకు ఇక్కడ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మేరకు నారాయణి ఆస్పత్రికి తమ అంబులెన్స్‌లోనే ఉచితంగా తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వీటిని నిరుపేద రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఆస్పత్రి డైరెక్టర్ బాలాజీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శక్తివేల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



బ్రిడ్జి నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి, పూర్తి చేయాలని కలెక్టర్ సుబ్బలక్ష్మి అధికారులను ఆదేశించారు. వేలూరు జిల్లా అనకట్టు నియోజక వర్గం గురవరాజు పాళ్యంలోని ఉత్తరమీర నదిపై రూ.4.13 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కానున్నందున జాగ్రత్తగా పనులు నిర్వహించాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. ప్రస్తుతం ఎంత వరకు పనులు జరిగాయి, ఎప్పటిలోపు పనులను పూర్తి చేస్తారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అనకట్టు నియోజక వర్గంలోని అటవీ శివారు గ్రామాల్లో పాఠశాల నిర్మాణ పనులు, మరుగుదొడ్లు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను తనిఖీ చేసి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమెతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు అధికారి ఆర్తి, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసన్, తహసీల్దార్ వేండ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు విభాగం కార్మికుల ధర్నా



రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వేలూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు విభాగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ తమిళనాడు ట్రాన్స్‌పోర్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు వేలూరు రంగాపురంలోని రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి తమిల్‌సెల్వన్ మాట్లాడుతూ కార్మికుల పెన్షన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని, 2003 సంవత్సరం అనంతరం విధుల్లో చేరిన వారందరికీ 1998 వేతన చట్ట ప్రకారం పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులకు ఉన్నతాధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని, డ్రైవర్, కండెక్టర్‌ల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు వెంటనే పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఉద్యోగ విరమణ పొందిన వెంటనే వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లను ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం వేలూరు రీజినల్ రిటైర్డ్ సంఘం ప్రధాన కార్యదర్శి మణి, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి దండపాణి, రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణన్, మహేంద్రన్ పాల్గొన్నారు.

ఘనంగా టైమ్‌లెస్ లెగసీ పుస్తకావిష్కరణ



టైమ్ లెస్ లెగసీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరుణ్‌రామ్, ఎస్ రవి

కొరుక్కుపేట: టైమ్ లెస్ లెగసీ పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. దేశంలోనే మూడో పురాతన క్లబ్ అయిన రోటరీ క్లబ్ ఏర్పడి 95 సంవత్సరాలు అయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఆధ్వర్యంలో నాలుగో ఎడిషన్ రోటరీ హిస్టరీ బుక్ అయిన ది టైమ్‌లెస్ లెగసీ పేరుతో రూపొందించిన పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం, దాతలు, సంఘ సేవకులను సత్కరించుకునే కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం నగరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ప్రెసిడెంట్ ఎస్ రవి అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా టైమ్స్ ఆఫ్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ అరుణ్ రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి టైమ్‌లెస్ లెగస్సీ పుస్తకాన్ని ఆవిష్కరించగా, తొలిప్రతిని కళాపోషకులు నల్లి కుప్పుస్వామి శెట్టి అందుకున్నారు. అరుణ్ రామ్ మాట్లాడుతూ 9 దశాబ్దల రోటరీ సేవలను తెలిపే ఒక గొప్ప పుస్తకం అని వ్యాఖ్యానించారు. ఈ పుస్తకం సమాజానికి సేవ చేయాలనే వారికి దిక్సూచిలా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ సుప్రసిద్ధ క్లబ్ సభ్యులు, పూర్వ అధ్యక్షులు అందించిన అద్భుతమైన సహకారంతో ఈ పుస్తకం చాలా క్లుప్తంగా తీసుకుని వచ్చారన్నారు. క్లబ్ చరిత్రకారుడిగా ఈ విశిష్ట కృషికి పుస్తక రచయిత ఎస్‌కే గోపీనాథ్‌ను ఆయన అభినందించారు. క్లబ్ మరెన్నో సంవత్సరాలు సమర్థవంతంగా, సమాజానికి ఉపయోగపడే సేవలందించాలని ఆకాంక్షించారు. ముందుగా అధ్యక్షుడు రవి సుందరేశన్ స్వాగత ప్రసంగం చేస్తూ ప్రస్తుత సభ్యుల నిబద్ధతకు టైమ్ లెస్ లెగసీ నిదర్శనమని, సమాజంలోని పేద వర్గాలకు ముఖ్యంగా మహిళలు, పిల్లలకు సహాయం చేసే వివిధ పథకాలలో సుమారు రూ.16.80 కోట్లు ఖర్చు చేసినట్లు రవి గర్వంగా ప్రకటించారు. అంతర్జాతీయ గ్రాంట్లు, స్పాన్సర్‌షిప్‌ల ద్వారా అనేక కార్పొరేట్‌ల నుంచి నిధులు సేకరించి, సమాజ సేవ చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు దాతలను ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్యఅతిథిని సత్యంభట్ పరిచయం చేయగా, శేషసాయి , వందన సమర్పణ చేశారు. క్లబ్ సర్వీసు డైరెక్టర్ విక్రమ్, ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్ సంధ్యా శ్రీధర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాలరి అనుమానాస్పద మృతి

అన్నానగర్: జాలరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. చెన్నైలోని అయోధ్యకుప్పం ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు కాత్తావరాయన్(55). ఇతను సోమవారం రాత్రి మెరీనా బీచ్‌లోని అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు ఎదురుగా ఇసుక బీచ్‌లోని చిన్న గడ్డి షెడ్‌లో నిద్రపోయాడు. అక్కడ అతను మంగళవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ ప్రాంతానికి చెందిన మణిమారన్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మెరీనా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇళయరాజా, పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని రాయ పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాటేసిన నాగు పామును ప్రభుత్వాస్పత్రికి తెచ్చిన రైతు

వేలూరు: కాటేసిన నాగు పాముతో ఓ రైతు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన సంఘటన కలకలం రేపింది. తిరుపత్తూరు జిల్లా వాదనవాడి గ్రామానికి చెంది న వేలాయుధం రైతు. ఇతడి వ్యవసాయ బావి లో పూడికతీత పనులు సాగుతున్నాయి. ఆ స మయంలో రైతు వేలాయుధం కాలుపై పాము కరిచినట్లు కనిపించింది. దీంతో అక్కడ కనిపించిన నాగు పామును కొట్టి చంపి దాన్ని ప్లాస్టిక్ కవర్‌లో వేసుకొని వెంటనే తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రికి తెచ్చాడు. దాన్ని చూ సిన అత్యవసర విభాగంలోని వైద్యులు అవాక్కయ్యారు. కాగా వేలాయుధం తనను ఈ పాము కరిచిందని వెంటనే వైద్యం అందజేయాలని తెలిపి స్పృహ తప్పి పడి పోయాడు. దీంతో వైద్య సిబ్బంది వెంటనే రైతుకు వైద్యం చేశారు.

జాతకం సరిగ్గా లేదని..

– కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: తిరుపత్తూరు జిల్లా వాణియంపాడి సమీపంలోని ఉన్న చిన్నమోటూరుకు చెందిన స్నేహ(23) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో స్నేహ తల్లిదండ్రులు బంధువుల పెళ్లికి వెళ్లి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. అప్పుడు తలుపు లోపలి నుంచి లాక్ చేసి ఉంది. చాలాసేపు తట్టినా తలుపు తీయకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. తల్లిదండ్రులు, బంధువులు ఆమెను వాణియంబాడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు స్నేహ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అంబలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్నేహ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విచారణలో ఆమెకు ఇటీవల పెళ్లి చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. అయితే ఆమె జాతకం బాగోలేదంటూ వరుడి కుటుంబం వెనక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటూ వచ్చిన స్నేహ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది. ఈమేరకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్



నటి పూజా హెగ్డే

ప్లాప్స్ వస్తే పారితోషికం పెంచకూడదా.. ఏంటి?

తమిళ సినిమా: సాధారణంగా సినిమా రంగంలో ఒక సక్సెస్ వస్తే చాలు వెంటనే పారితోషం పెంచేస్తారు. అంతే కాకుండా హీరో హీరోయిన్లు అయితే వారి ప్రవర్తనే మారిపోతుంది. పనివాళ్లు, అనుచరులు, సహచరులు అంటూ బంధం పెరిగిపోతుంది. అదే హీరో హీరోయిన్లు వరుసగా అపజయాలను ఎదుర్కొంటే, అవకాశాలు ముఖం చాటేస్తాయి. ఫలితంగా పారితోషికం తగ్గించుకోవడం తప్పనిసరి అవుతుంది. ఇది సాధారణంగా జరిగేదే. అయినా పూజా హెగ్డే విషయంలో మాత్రం పూర్తి విరుద్ధంగా మారడం విశేషం. ఈ ఉత్తరాది భామ ముగమూడి చిత్రం ద్వారా కోలీవుడ్‌కు కథానాయకిగా ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం ప్లాప్ కావడంతో ఇక్కడ ఆమెను ఎవరు పట్టించుకోలేదు. లక్కీగా టాలీవుడ్‌లో పాతుకుపోయారు. అక్కడ కూడా మొదట్లో నటించిన ఒకటి రెండు చిత్రాలు యావరేజ్‌గా ఆడినా, ఆ తర్వాత అల్లు అర్జున్ సరసన నటించిన డీజే జగన్నాథం, అల వైకుంఠపురంలో, మహేష్ బాబు సరసన నటించిన మహర్షి వంటి చిత్రాలు సూపర్ హిట్ కావడంతో అక్కడ ఒకసారిగా స్టార్ ఇమేజీను సొంతం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత నటించిన రాధే శ్యామ్, ఆచార్య, అదే సమయంలో విజయ్‌తో జతకట్టిన బీస్ట్, హిందీలో సల్మాన్ ఖాన్ సరసన నటించిన కిసీ కా భాయ్ కలిసి కీ జాన్ చిత్రాలు వరుసగా ప్లాప్‌లను మూటకట్టుకున్నాయి. దీంతో పూజా హెగ్డే పనైపోయింది అనే ప్రచారం జోరు అందుతుకుంది. దాన్ని నిజం చేసేలా కొన్ని అవకాశాలు చేజారిపోయాయి. అలా ప్లాపులతో కొట్టుమిట్టాడుతున్న పూజా హెగ్డేను నటుడు సూర్య ఆదుకున్నారని చెప్పాలి. ఈయన కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న తన 44వ చిత్రంలో హీరోయిన్ ఛాన్స్‌ను పూజా హెగ్డేకు ఇచ్చారు. దీంతో ఆమె పారితోషికం తగ్గించి ఉంటుందని అనుకుంటున్నారు కదూ. అలా అనుకుంటే పొరపాటే అవుతుంది. ఈ అమ్మడు ఏకంగా రూ.4 కోట్లు పారితోషికం తీసుకుంటున్నట్లు తాజా సమాచారం. ఇంతకుముందు వరకు రూ.3 కోట్లు తీసుకున్న పూజా హెగ్డే వరుసగా నాలుగైదు ప్లాప్‌లు వచ్చిన తర్వాత కూడా ప్లాప్‌లు వస్తే పారితోషికం తగ్గించుకోవాలా? ఏంటి అన్నట్టుగా అదనంగా మరో రూ.కోటి పెంచేయడం విశేషం. అయితే ఇందులో నిజం ఎంతో గానీ, ప్రస్తుతం ఈ న్యూస్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

లియో 2 కథ రెడీ.. విజయ్ ఓకే అంటే..



విజయ్, దర్శకుడు లోకేష్ కనకరాజ్

తమిళ సినిమా: నటుడు విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీని ఏర్పాటు చేశారు. దీంతో ఆయన రాజకీయాలపై సీరియస్‌గా దృష్టి పెట్టబోతున్నారు. ప్రస్తుతం విజయ్ గోట్ చిత్రాన్ని పూర్తి చేసి మరో చిత్రాన్ని చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇది ఆయన నటించే 169వ చిత్రమే కాకుండా చివరి చిత్రం అవుతుందనే ప్రచారం జరుగుతోంది. దీనికి హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తారని ప్రచారంలో ఉంది. అయితే అసలు ఈ చిత్రాన్ని విజయ్ చేస్తారా? లేదా అన్న చర్చ కూడా మరో పక్క జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దర్శకుడు లోకేష్ కనకరాజ్ లియో 2 చిత్ర కథ రెడీ అని, విజయ్ ఓకే అంటే ప్రారంభించడమే తరువాయి అని పేర్కొనడం విశేషం. మహానగరం చిత్రంతో దర్శకుడుగా తెరంగేట్రం చేసిన లోకేష్ కనకరాజ్ ఆ తర్వాత ఖైదీ, మాస్టర్, విక్రమ్ వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలను చేశారు. కాగా ఇటీవల ఈయన విజయ్ కథానాయకుడిగా తెరకెక్కించిన లియో చిత్రం కూడా రూ. 600 కోట్లు వసూలు చేసిందని సమాచారం. అయితే చిత్రం మాత్రం పలు విమర్శలను ఎదుర్కొంది. ముఖ్యంగా విజయ్ అభిమానులను పూర్తిగా నిరాశపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ లియో టు చిత్రం కథ రెడీ అని, విజయ్ ఓకే అంటే వెంటనే ప్రారంభమవుతుందని పేర్కొనడం చర్చినీయాంశంగా మారింది. విజయ్ 169 చిత్రమే పెద్ద డౌట్‌లో పడితే ఇంకా లియో టు చిత్రం రూపొందే అవకాశం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. కాగా ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ నటుడు రజనీకాంత్ కథానాయకుడిగా కూలీ చిత్రాన్ని తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నారు. వాస్తవానికి ఈ చిత్రం ఇప్పటికే ప్రారంభం కావాల్సింది స్క్రీన్ ప్లే ఆలస్యం కావడంతో జూలై నెలలో సెట్ పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అమలాపాల్.. అమ్మతనం



కన్నబిడ్డతో అమలాపాల్

తమిళ సినిమా: నటి అమలాపాల్ ఈ పేరే ఓ సంచలనం. వివాదాలకు కేరాఫ్. బహుభాషా నటి. వీరశేఖరన్ అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన మాలీవుడ్ భామ ఈమె. ఆ చిత్రం పెద్దగా ఆడకపోయినా సింధు సమవేళి చిత్రంతో సంచలనం గట్టిగా ముద్ర వేసుకున్నారు. ఇక ఆ తర్వాత ప్రభుసాల్మన్ దర్శకత్వంలో నటించిన మైనా చిత్రం అమలాపాల్‌కు పెద్ద అడ్రస్ నే ఇచ్చింది. అలా ఒక్కో స్టెప్పు ఎక్కుతూ స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగారు. ఏఎల్ విజయ్ దర్శకత్వంలో విజయ్ హీరోగా నటించిన తలైవా విక్రమ్ కథానాయకుడిగా నటించిన దైవ తిరుమగళ్ చిత్రాల్లో నటించిన సమయంలో ఆ దర్శకుడితో ప్రేమలో పడ్డారు. అనంతరం వీరు కుటుంబాల అనుమతితో 2013లో ఏఎల్ విజయ్ నటి అమలాపాల్ పెళ్లి చేసుకున్నారు. అయితే వారి వివాహ జీవితం ఎక్కువ కాలం సాగలేదు. నాలుగేళ్లకే మనస్పర్థలు కారణంగా విడిపోయి విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత నటనపై దృష్టి పెట్టిన అమలాపాల్ తన చిరకాల మిత్రుడు జగత్ దేశాయ్‌ని గత ఏడాది నవంబర్ మూడవ తేదీన రెండో పెళ్లి చేసుకున్నారు. అయితే పెళ్లయిన రెండు నెలలకే తాను గర్భం దాల్చినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించిన అమలాపాల్ ఆ తర్వాత నిండు గర్భిణిగా ఉన్న ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. కాగా ఈనెల 11వ తేదీన అమలాపాల్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఆమె ఆస్పత్రి నుంచి బిడ్డను ఎత్తుకుని చిరునవ్వుతో నడుచుకుంటూ వస్తున్న ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తన బిడ్డకు ఆమె ఎలై అనే పేరు పెట్టుకున్నారు. ఎలై అంటే ఆకు అని అర్థం. అమలాపాల్‌కు అడవులు, కొండల్లో తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదించడం చాలా ఇష్టం. అందుకే తన బిడ్డకు ఈ పేరును పెట్టినట్లు అమలాపాల్ ఉప్పొంగే అమ్మతనంతో పేర్కొన్నారు. దీంతో ఈమెకు పలువురి నుంచి అభినందనల వర్షం కురుస్తోంది.

తమకు తామే సూపర్ స్టార్ పట్టం



తమిళ సినిమా: మలయాళం, తమిళం, తెలుగు పలు భాషల్లో కథానాయకిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి మమతా మోహన్ దాస్. నటిగా మంచి ప్రతిభ కలిగిన ఈమె అనూహ్యంగా క్యాన్సర్ వ్యాధి బారినపడి దాంతో చాలాకాలం పోరాడి గెలిచారు. ప్రస్తుతం మళ్లీ సినిమాల్లో నటించటానికి సిద్ధమయ్యారు. అలా చాలా గ్యాప్ తర్వాత తమిళంలో విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించినా మహారాజా చిత్రంతో రీఎంట్రి ఇచ్చారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో మమతా మోహన్ దాస్ బిజీగా ఉన్నారు. పలు టీవీ, యూట్యూబ్ చానళ్ల భేటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఒక భేటీలో మమతా మోహన్ దాస్ నటి నయతారను ఏకీపారేశారు. కాగా ఈమె ఇదివరకే రజనీకాంత్ కథానాయకుడుగా నటించిన కుచేలన్ చిత్రంలో నటించినప్పుడు అందులో మరో పాత్రలో నటించిన నయనతారతో ఏర్పడిన సమస్య గురించి బహిరంగంగానే వెల్లడించారు. తాజాగా పేర్కొంటూ ఇప్పుడున్న సామాజిక మాధ్యమాలు అప్పుడు ఉంటే కనుక నటి నయనతారను తాను అప్పుడే తీవ్రంగా విమర్శించేదానినని, అప్పుడు సామాజిక మాధ్యమాలు లేకపోవడంతో తాను సైలెంట్‌గా ఉండిపోయారని పేర్కొన్నారు. నిర్మాతలు చేసే ఖర్చు విలువ తనకు తెలుసని, కొందరు మాత్రం తమను పెద్ద స్టార్‌గా చూపించుకోవడానికి ఏడెనిమిది మంది అసిస్టెంట్లను పెట్టుకుంటున్నారని విమర్శించారు. అంత మంది అవసరం లేదని, తనకు ఇద్దరు అసిస్టెంట్లు మాత్రమే ఉంటారని చెప్పారు. కొందరు తమను తానే ప్రమోట్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా పీఆర్‌టీమ్‌తో చెప్పి పది పేపర్లలో సూపర్ స్టార్ అని రాయించుకుంటున్నారన్నారు. నిజానికి సూపర్ స్టార్ పట్టం ప్రజలు ఇవ్వాలని అన్నారు. అయితే ఆ పట్టాన్ని తమకు తామే పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఇదంతా నయనతార గురించే మమతా మోహన్ దాస్ మాట్లాడినట్టు సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చక్కర్లు కొడుతున్నాయి.

సుధా కొంగర దర్శకత్వంలో ధ్రువ్ విక్రమ్



నటుడు ధ్రువ్ విక్రమ్, దర్శకులు సుధా కొంగర

తమిళ సినిమా: సూర్య కథానాయకుడిగా సూరరై పోట్రు వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకురాలు సుధా కొంగర. ఇదే చిత్రాన్ని ఆమె హిందీలో అక్షయ్ కుమార్ హీరోగా సర్ఫిరా పేరుతో తెరకెక్కించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్య నిర్మించిన ఈ చిత్రం వచ్చే నెల రెండో వారంలో తెరపైకి రానుంది. కాగా సూర్యతో దర్శకురాలు సుధా కొంగర మరోసారి కలిసి పనిచేయడానికి సిద్ధమయ్యారు. దీనికి పురనానూరు అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. అయితే కొన్ని కారణాలతో ఈ చిత్రం నిర్మాణాన్ని వాయిదా వేస్తున్నట్టు సూర్య, దర్శకురాలు సుధా కొంగర సంయుక్తంగా మీడియాకు విడుదల చేసిన కార్యక్రమంలో పేర్కొన్నారు. ఆ తర్వాత సూర్య తన 44వ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్నారు. అలాగే దర్శకురాలు సుధా కొంగర కూడా తన తదుపరి చిత్రానికి సిద్ధమయ్యారు. ఆమె నటుడు విక్రమ్ వారసుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా చిత్రం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తాజా సమాచారం. ఈ చిత్రాన్ని ఇంతకుముందు శివ కార్తికేయన్ కథానాయకుడిగా మావీరన్ చిత్రాన్ని చేసిన నిర్మాణ సంస్థ నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కాగా నటుడు ధ్రువ్ విక్రమ్ ప్రస్తుతం మారి సెల్వరాజ్ దర్శకత్వంలో బైసన్ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం పూర్తయిన తర్వాత నవంబర్ నెలలో సుధా కొంగర దర్శకత్వంలో ప్రారంభం కానున్న చిత్రంలో నటించటానికి ధ్రువ్ విక్రమ్ సిద్ధమవుతారని సమాచారం.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

తిరువొత్తియూరు: ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వేలచేరిలో తమిళనాడు హౌసింగ్ బోర్డు సమీపంలోని మరుదుపాండి రోడ్డు కూడలి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్థానికంగా 50కి పైగా నివాసాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి హఠాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌లో పేలుడు శబ్దం వినిపించింది. కొద్ది సమయానికి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ బయటికి రావడంతో పూర్తిగా మండుకుంది. ఇది చూసిన స్థానికులు దిగ్భ్రాంతి చెంది అక్కడ నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న విద్యుత్ బోర్డు అధికారులు, అగ్నిమాపక సిబ్బంది విద్యుత్ సరఫరా ఆపివేసి మంటలను అదుపుచేశారు.

8 మందికి అస్వస్థత

తిరువొత్తియూరు: ఎలుక చనిపోయిన నూనెను వంట చేయడానికి ఉపయోగించడంతో ఒకే కుటుంబానికి చెందిన వృద్ధుడిసహా 8 మందికి వాంతులు అయ్యి, అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై, మైలాపూరు గణేశపురం ప్రాంతానికి చెందిన చిన్న కొలందై (88) తన కుమారుడు మనమరాళ్లతో కలిపి మొత్తం 8 మంది నివాసం ఉంటున్నారు. 15 రోజుల క్రితం బంధువులు ఒకరు మృతి చెందడంతో ఇంటికి తాళం వేసుకుని కుటుంబంతో సహా అక్కడికి వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి వంట చేసుకుని కుటుంబసభ్యులందరూ భోజనం చేశారు. తర్వాత వంట నూనె క్యాన్‌ను చూడగా అందులో ఎలుక ఒకటి చనిపోయి కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. దీంతో వారు దిగ్భ్రాంతి చెందారు. అదే సమయంలో ఆహారం తిన్న హేమంత్, హేమంత్ సాయి, మణికంఠన్, ప్రియా, విమల, చరణ్, విమల్ రాజుకు వాంతులు కావడంతో స్పృహ తప్పిపడిపోయారు. వీరిని రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వారికి డాక్టర్లు చికిత్స చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

• ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: ఇరువర్గాలు ఘర్షణ పడిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. పుళల్ బాలాజీ నగర్ వెజిటేరియన్ కాలనీలో మైదానం ఉంది. ఇక్కడ మాధవరం ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ (25), జస్టిన్ థామస్ (26), కార్తికేయన్ (26), తదితరులతో కూడిన ఒక బృందం క్రికెట్ ఆడుకుంటోంది. ఆ సమయంలో పుళల్ కదిర్వేడు ప్రాంతానికి చెందిన కామేశ్వరన్ (24), రాహుల్, ఇన్బరసు, అక్కడికి క్రికెట్ ఆడుకోవడానికి వచ్చారు. ఆ సమయంలో అది తమ ప్రాంతమని అక్కడ ఆడుకుంటున్నవారిని వెళ్లిపొమ్మని తెలిపారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై పుళల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజాసింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో సతీష్ కుమార్, జస్టిన్ థామస్, కార్తికేయన్ అనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైల్లో పెట్టారు. ఈ కేసుకు సంబంధించి మరో ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

తిరువళ్లూరు: ఇంటి నుంచి సమీపంలోని దుకాణానికి వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించే లోపు మృతి చెందిన ఘటన ఆరంబాక్కం వద్ద జరిగింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలుకా ఆరంబాక్కం గ్రామానికి చెందిన షన్ముగం కుమారుడు మురుగన్(58). ఇతను సోమవారం రాత్రి ఆరంబాక్కం భారతీ నగర్ నుంచి సమీపంలోని దుకాణానికి బయలుదేరి రోడ్డును దాటడానికి యత్నించాడు. ఈ సమయంలో మురుగన్‌ను ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని వైద్యశాలకు తరలించగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుమార్తె నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరంబాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బస్సు, లారీ ఢీ



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కోడిగుడ్లు

అన్నానగర్ : పల్లడం సమీపంలో ప్రభుత్వ బస్సు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో లారీలోని 25 వేల కోడిగుడ్లు పగిలిపోయాయి. వాటిని ప్రజలు పోటీపడి తీసుకువెళ్లారు. వివరాల్లోకి వెళితే.. తిరుపూర్ జిల్లా పల్లడం సమీపంలోని ప్రైవేట్ బ్రాయిలర్ ఉత్పత్తి కేంద్రానికి పల్లడం – తారాపురం రోడ్డులోని నందవనప్పాలయం నుంచి గుడ్లు సరఫరా అయ్యేవి. ఈ క్రమంలో సోమవారం యథావిధిగా నందవనప్పాలయం నుంచి కోడిగుడ్లతో లారీ పల్లడం–తారాపురం రహదారిపై కల్లగినారు ప్రాంతానికి వస్తోంది. ఆ సమయంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళుతున్న లారీ వెనుక వస్తున్న ప్రభుత్వ బస్సు లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించింది. ఆ సమయంలో అనుకోకుండా లారీని ప్రభుత్వ బస్సు ఢీకొంది. దీంతో లారీ బోల్తా పడింది. లారీలోని కోడిగుడ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అలాగే ప్రజలు పోటీ పడి గుడ్లను తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల విలువైన సుమారు 25 వేల గుడ్లు పగిలిపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

10 నిమిషాల్లో 10 సార్లు సూర్యనమస్కారం

• కళ్లకు గంతలు కట్టుకుని రికార్డు సృష్టించిన యోగా విద్యార్థులు



దీపం ఆకారంలో పడుకుని సూర్యనమస్కారం చేస్తున్న యోగా విద్యార్థులు

తిరువళ్లూరు: కళ్లకు గంతలకు కట్టుకుని పది నిమిషాల్లో పదిసార్లు సూర్యనమస్కారం చేసి, హ్యాపీ యోగా హెల్త్ కేర్ అండ్ ఫిట్‌నెస్ సంస్థకు చెందిన యోగా విద్యార్థులు గ్రేట్ యోగా వరల్డ్ రికార్డు బుక్‌లో స్థానం సంపాదించారు. తిరువళ్లూరులో హ్యాపీ యోగా హెల్త్‌కేర్ అండ్ ఫిట్‌నెస్ సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థలో మూడేళ్ల వయస్సు నుంచి 74 ఏళ్ల వరకు ఉన్న సుమారు వంద మంది కళ్లకు గంతలు కట్టుకుని పది నిమిషాల్లో పదిసార్లు సూర్య నమస్కారం చేసి, గ్రేట్ యోగా వరల్డ్ రికార్డు బుక్‌లో స్థానం సంపాదించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి యోగా సంస్థ నిర్వాహకుడు సెంథిల్‌కుమార్ అధ్యక్షత వహించగా నిర్వాహక అధ్యక్షురాలు గీత ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ ఉదయమలర్‌పాండ్యన్, వైస్ చైర్మన్ రవిచంద్రన్, మాజీ చైర్మన్ పాన్ పాండ్యన్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరుణన్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మూడేళ్ల నుంచి 74 ఏళ్ల వయస్సు ఉన్న సుమారు వంద మంది దీపం ఆకారంలో నిలబడి పది నిమిషాల్లో పదిసార్లు సూర్య నమస్కారం చేసి, గ్రేట్ యోగా వరల్డ్ రికార్డు బుక్‌లో చోటు సంపాదించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగాసనాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సినీ నిర్మాత హత్య కేసులో వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: విరుగంబాక్కంలో సినీ నిర్మాత హత్య కేసులో రెండేళ్లుగా పరారీలో ఉన్న వ్యభిచార బ్రోకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని అరుంబాక్కం ప్రాంతానికి చెందిన భాస్కరన్ సినీ నిర్మాత, పారిశ్రామికవేత్త. ఇతను సెప్టెంబర్ 2022లో విరుకంపాక్కం ప్రాంతంలోని కూవం నది ఒడ్డున అనుమానాస్పద రీతిలో హత్యకు గురయ్యారు. ఆ కేసులో గణేశన్ అనే వ్యభిచార బ్రోకర్‌ను విరుగంబాక్కం పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో సంఘటన జరిగిన రోజున విరుగంబాక్కంలో ఉన్న భాస్కర్ కార్యాలయానికి యువతులు రావడం ఆలస్యం కావడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న భాస్కరన్, గణేశన్‌ను దూషించినట్టు తెలుస్తోంది. దీంతో కోపోద్రిక్తుడైన గణేశన్, భాస్కరన్‌ను కొట్టి చంపి, మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి రోడ్డుపై పారేశాడు. ఈ కేసులో అరెస్టు అయ్యి, జైలుకు వెళ్లిన గణేశన్ జనవరి 2023లో బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత సైదాపేట కోర్టులో కొనసాగుతున్న కేసు కోర్టుకు హాజరు కాకపోవడంతో రెండేళ్లుగా పోలీసులు అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ పరిస్థితిలో విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు దేవాలయంలోని పూల దుకాణంలో గణేశన్ సన్యాసి వేషధారణలో పనిలో ఉన్నట్టు తెలిసింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మంగళవారం గణేషన్‌ను అరెస్టు చేశారు.

ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

అన్నానగర్: కుందుక్కోట సమీపంలోని అభయారణ్యంలో ఓ ఏనుగు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. రెండు వారాల క్రితం కర్ణాటకలోని బన్నెరఘట్ట అడవుల నుంచి 37 ఏళ్ల ఆడ ఏనుగు జవలగిరి అడవిలోకి వచ్చింది. అనంతరం అక్కడి నుంచి మిలితికి గ్రామం చుట్టూ తిరుగుతున్న ఆడ ఏనుగు నోటిపై గాయాలతో అలసిపోయి కనిపించింది. ఏనుగు కోసం అటవీశాఖ వెతుకుతుండగా, దట్టమైన అడవిలోకి వెళ్లిన ఏనుగు ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా అంశెట్టి ఫారెస్ట్రీలోని కుందుక్కోట సమీపంలోని అభయారణ్యంలో ఆడ ఏనుగు చనిపోయి పడి ఉందని అటవీశాఖకు మంగళవారం సమాచారం అందింది. దీంతో అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఏనుగు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య బృందం ఏనుగు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించింది. ఏనుగు నోరు, దవడ వద్ద గాయాలు ఉన్నాయి. దీంతో అడవి పందిపై విసిరిన బాంబును కొరికి ఆడ ఏనుగు మృతి చెంది ఉండవచ్చని పశువైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే అప్పటికే ఏనుగు నోరు, దవడ భాగాల్లో గాయమైందని, దాంతో ఏనుగు ఆహారం తినలేక అలసిపోయి ఆహారం తినక మృతి చెందినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. అయితే పేలుడులో ఆడ ఏనుగు గాయపడి చనిపోయిందా? లేదా దాని దంతాలను తెలుసుకోవడానికి దాన్ని చంపారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పోస్టుమార్టం అనంతరం కుళ్లిపోయిన ఏనుగు మృతదేహాన్ని ఇతర జంతువులకు ఆహారంగా వదిలేశారు.

జమాబందీ శిబిరంలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం (పళ్లిపట్టు): కాంచీపురం జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ శిబిరాలు (జమాబందీ) నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వాలాజా తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జమాబందీ అధికారి కలైసెల్వి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంగళవారం నిర్వహించిన జమాబందీ శిబిరంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉచిత ఇంటి పట్టాలు, పట్టా మార్పిడి, పింఛన్లు, ప్రత్యేక ప్రతిభావంతుల సర్టిఫికెట్లు సహా వివిధ సహాయకాల కోసం అర్జీలు అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించిన అధికారులు అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

మౌలిక సదుపాయాలపై విస్తృతంగా పెట్టుబడి

సాక్షి, చెన్నై : దీర్ఘ కాలిక మౌలిక సదుపాయాలపై విస్తృతంగా పెట్టుబడులు పెరిగినట్టు పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మహంతి తెలిపారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఎన్‌పీఎస్, ఏపీవై ద్వారా సాధించిన మైలురాళ్లు, 2024 మే నాటికి ఏయూఎంలో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు, ప్రైవేటు సెక్టార్, ప్రైవేటు రంగంలో చందాదారుల సంఖ్య తదితర అంశాల గురించి వివరించారు. వాణిజ్య సంస్థలతో ఒప్పందాలు, కార్పొరేట్లకు అవగాహన, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను విశదీకరించారు. జీడీపీ నిష్పత్తి, పెన్షన్ ఆస్తులు, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పింఛన్లు తదితర కార్యక్రమాలను గుర్తు చేశారు. పెన్షన్ ఫండ్ కింద ఉన్న ఆస్తులు దీర్ఘకాలిక పెట్టుబడులను పెంచుతాయని ప్రకటించారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెరుగుతున్నట్టు, ఇది బలమైన అవసరాలకు బలంగా సహాయ పడుతోందని వివరించారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందుకున్న విద్యార్థులతో కౌన్సిలర్ రాజేష్ తదితరులు

తిరువళ్లూరు: ప్రభుత్వ పాఠశాలలోని సుమారు 150 మంది విద్యార్థులకు ఉచితంగా రూ.లక్ష విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుమళిసైలో ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో నిరుపేదలైన 150 మంది విద్యార్థులకు విద్యా ఉపకరణాలను తిరుమళిసై మేజర్ పంచాయతీ దివంగత అధ్యక్షుడు వడివేలు జ్ఞాపకార్థం అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్, పెన్, బాక్సులు, దుస్తులు తదితర 8 రకాల వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కల్పనతో పాటు పీఎంకే కౌన్సిలర్ రాజేష్, సామాజిక సేవకులు దీపన్, మారి మణివన్నన్ పాల్గొన్నారు.

రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న బైక్

• విద్యార్థి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై, తిరువొత్తియూరు త్యాగరాయపురం 2వ వీధికి చెందిన అబ్దుల్ మజీద్ కుమారుడు అబ్దుల్ సాజిద్ (19). ప్లస్–2 పూర్తయ్యాక కాలేజీలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అతనికి గత పది రోజుల క్రితం ఖరీదైన కేటీఎమ్ బైక్‌ను తల్లిదండ్రులు కొనిచ్చారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఎన్నూరు బైపాస్ రోడ్డులో అబ్దుల్ సాజిద్ సదానందాపురం సమీపంలో బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో కింద పడిన అబ్దుల్ సాజిద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తిరువొత్తియూరు ట్రాఫిక్ పోలీసులు అతడిని రక్షించి స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అబ్దుల్ సాజిద్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు అబ్దుల్ సాజిద్ ఏడాది క్రితం కూడా మోటార్ సైకిల్ ప్రమాదానికి గురయ్యాడు. 6 నెలల క్రితమే కోమా నుంచి కోలుకున్నాడు. మళ్లీ ఖరీదైన మోటార్ సైకిల్ కొని ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు చాకలిపేట ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

స్థలం మోసం కేసులో మహిళా పోలీసు భర్త అరెస్టు

తిరువొత్తియూరు: స్థలం మోసం కేసులో మహిళా పోలీసు భర్తను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. దిండివనం ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మహిళ మాలతి. ఈమెకు అంబత్తూరులో స్థలం కొనుగోలు చేయడానికి స్నేహితుడు ఒకరి ద్వారా చెన్నైలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న రఘు, అతని భార్య, మహిళా పోలీసు దేవి పరిచయం చేసుకున్నారు. వారు మదనం కుప్పం ప్రాంతంలో స్థలం ఉందని, ఆ స్థలం విక్రయిస్తున్నట్టు మాలతి వద్ద రూ.32.50 లక్షలు తీసుకున్నట్టు తెలిసింది. కానీ వారు చెప్పినట్లు ఆ స్థలాన్ని మాలతికి రిజిస్టర్ చేసి ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీని గురించి మాలతి వారిని ప్రశ్నించగా ఆమెను బెదిరించారు. ఈ విషయమై మాలతి నొలంబూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, స్థలం మోసం కేసులో ఇప్పటికే విల్లుపురం జిల్లాకు చెందిన గోపాలకృష్ణన్, అతని స్నేహితులు ఇలంగో, మొహమ్మద్ అనీఫా తదితరులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఈ కేసు సంబంధించి పరారీలో ఉన్న మహిళా పోలీసు దేవి భర్త రఘును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

తెలుగు పుస్తకాల ఊసేది?

పళ్లిపట్టు: తెలుగుపై ప్రభుత్వం సవితిప్రేమను మరోసారి చాటుకుంది. సకాలంలో తెలుగు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీలో కాలయాపన చేస్తున్న క్రమంలో యథాప్రకారం ఈ విద్యా సంవత్సరంలో సైతం తెలుగు విద్యార్థులు కొత్త పుస్తకాల కోసం వేచిచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలైన చెన్నై, తిరువళ్లూరు, వేలూరు, కృష్ణగిరి జిల్లాలో 250కు పైబడిన తెలుగు మీడియం పాఠశాలలున్నాయి. నిర్బంధ తమిళ విద్యా విధానంతో ఇప్పటికే అనేక తెలుగు పాఠశాలలు తమిళ పాఠశాలలుగా రూపు మారిన క్రమంలో ఉన్న కొద్ది పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సైతం సకాలంలో పాఠ్యపుస్తకాలు ఇతర సామగ్రి అందకపోవడంతో వారిలో ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో తమిళ విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేస్తుంది. దీంతో విద్యా బోధన ప్రారంభమైంది. అయితే తెలుగు పాఠశాలల విద్యార్థులకు మాత్రం ఈ ఏడాది సైతం ఆలస్యం చేస్తుండడంతో ఉపాధ్యాయులు పాత పుస్తకాల సాయంతో బోధన చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం

తెలుగు భాషా పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాజేంద్రనాయుడు రాష్ట్రంలో మాతృభాష తెలుగు చదువుకుంటున్న విద్యార్థులపై ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు చిన్నచూపుతో మాతృభాషలో చదువుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గిన క్రమంలో ప్రభుత్వం పుస్తకాలు పంపిణీలో సైతం కాలయాపన చేస్తున్నందున టెన్త్, ప్లస్–2 పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు మార్కులు తగ్గి, ఉన్నత విద్యలో ప్రవేశానికి ఇబ్బంది పడుతుడడంతో విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ప్రభుత్వం స్పందించి మైనారిటీ విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు ఇచ్చి, ఆదుకోవాలని తెలుగు భాష పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాజేంద్రనాయుడు కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని మంగళవారం తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ సేవించుకున్నారు.

ఇద్దరు పిల్లల తల్లిని ప్రేమించిన యువకుడు

• పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

కొరుక్కుపేట: ప్రేమ గుడ్డిదన్న చందంగా ఓ యువకుడు ఇద్దరు పిల్లల తల్లిని ప్రేమించాడు. ఆ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. సేలం జిల్లా ధర్మంగళం సమీపంలోని కేఆర్ తోపూర్ ప్రాంతానికి చెందిన రాజేంద్రన్. అతని కుమారుడు విజయ్(25) తారామంగళంలో బాండ్ రిజిస్ట్రేషన్ గుమస్తాతో కలిసి పనిచేస్తున్నాడు. అలాగే బూదూర్ గాదంపట్టికి చెందిన గణేశన్, అతని భార్య లలిత (35) దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కరోనా సమయంలో గణేశన్‌కు కరోనా సోకి మృతి చెందాడు. దీంతో లలిత తన కుమార్తెతో కలిసి తారమంగళంలో ఒంటరిగా నివసించేది. పిల్లల చదువుల ఖర్చు, కుటుంబ ఖర్చులతో ఇబ్బంది పడుతున్న లలిత ఆరు నెలల క్రితం తారమంగళంలో బాండ్ రిజిస్ట్రేషన్ అధికారి వద్ద చేరింది. ఆ తర్వాత విజయ్‌తో లలితకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం చివరికి ప్రేమగా మారింది. ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మురుగన్ ఆలయంలో లలితను పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే లలితకు వివాహం జరగడంతో విజయ్ కుటుంబం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాలని ఇద్దరు తారమంగళం పోలీస్ స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరు కుటుంబాలను పిలిచి, శాంతియుతంగా మాట్లాడారు.

కారు ఢీకొని.. ఇద్దరు యువకుల దుర్మరణం

కొరుక్కుపేట: చెంగల్పట్టు సమీపంలో కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. అందులో దుబాయ్ వచ్చిన వ్యక్తి కూడా ఉన్నాడు. వివరాల్లోకి వెళితే.. మైలాడుదురై జిల్లా మల్లియమ్ అన్నైమలైనల్లూరునకు చెందిన జాఫర్ అలీ కుమారుడు ఇయ్యావుద్దీన్ (38) దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని రెండు వారాల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం కుటుంబ సమేతంగా బక్రీద్ జరుపుకున్నారు. అయితే మంగళవారం తిరిగి దుబాయ్ వెళ్లాల్సి వచ్చింది. అందుకే సోమవారం రాత్రి చెన్నైకి బయలుదేరాడు. అతనితో పాటు అన్వర్ సాధిక్ (3), అయ్యప్పన్ (38) కూడా ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చెంగల్‌పట్టు బైపాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి కారు టైర్ ఒకటి పంక్చర్ అయింది. దీంతో కొత్త టైర్‌ని డ్రైవర్ చంద్రు, అన్వర్ సాధిక్, ఇయ్యావుద్దీన్ కలసి మార్చుతున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న కారు వీరిపైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరూ దూరంగా వెళ్లి పడిపోయారు. అయితే కారు నంబర్ ప్లేట్ తెగి అక్కడే పడిపోయింది. ప్రమాదంపై చెంగల్‌పట్టు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన వెళ్లి ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో చంద్రు, ఇయ్యావుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు తుపాకీ పేలి వృద్ధుడికి గాయాలు

• ముగ్గురి అరెస్టు

వేలూరు: నాటు తుపాకీ పేలిన ఘటనలో వృద్ధుడికి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తిరువణ్ణామలై జిల్లా వెరియూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అండబల్లి గ్రామంలో ఈనెల 15వ తేదీన పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గ్రామం వద్దకు వస్తున్న పోలీసులను చూసిన ముగ్గురు బైకులో వస్తూ చేతిలో ఉన్న వస్తువులను ముళ్ల పొదల్లో విసిరి వేసి అక్కడ నుంచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తండర గ్రామానికి చెందిన రైతు తవమణి(62) వ్యవసాయ బావి వద్దకు వెళుతుండగా ముళ్ల పొదల్లో ఉన్న వస్తువులను గమనించి చేతిలోకి తీసుకుని వెంటనే అక్కడే వేశాడు. ఆ సమయంలో నాటు తుపాకీ పేలి, అతని శరీరంపై గుండు దూసుకెళ్లింది. తీవ్ర గాయపడిన తవమణిని స్థానికులు గమనించి తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాటు తుపాకీ వేసిన వారు ఎవరన్న కోణంలో విచారణ జరిపారు. అందులో విల్లుపురం జిల్లా వీరపాండి గ్రామానికి చెందిన బాలమురుగన్, పాండియన్, మణిగండన్‌గా తెలిసింది. వారి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ముగ్గురూ కలిసి అటవీ జంతువులను వేటాడేందుకు నాటు తుపాకీతో వచ్చినట్లు పోలీసులను చూసి వాటిని ముళ్ల పొదల్లో వేసి, అక్కడ నుంచి పరారీ అయినట్లు తెలిపారు. దీంతో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య

అన్నానగర్: కన్న బిడ్డలను ముద్దు పెట్టుకోకుండా అడ్డుకోవడంతో విసుగు చెందిన ఓ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు రాసిన ఐదు పేజీల లేఖ పోలీసులకు దొరికింది. వివరాల్లోకి వెళితే.. కన్యాకుమారి జిల్లా మేడుకుమ్మల్ పొన్నప్పకు చెందిన జాన్ ఆల్బర్ట్ (33) 2016లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరి, రెండేళ్లుగా చెన్నై డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇతని భార్య ఝాన్సీ జెస్సీ(30) ఉంది. వీరికి మూడేళ్ల కవల కుమార్తెలు ఉన్నారు. జాన్ ఆల్బర్ట్ చెన్నైలోని పట్టినబాక్కం పోలీసు క్వార్టర్లలోని 3వ అంతస్తులో నివసిస్తున్నాడు. జాన్ ఆల్బర్ట్ మంగళవారం మధ్యాహ్నం పని కోసం బయలుదేరాడు. అయితే ఎంతసేపటికీ భర్త గది నుంచి బయటకు రాకపోవడంతో ఝాన్సీ తలుపు తట్టింది. అయితే చాలా సేపటికి తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన ఝాన్సీ ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లింది. పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న తన భర్త ఉరికి వేలాడుతూ ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందింది. వెంటనే జాన్ ఆల్బర్ట్‌ను రక్షించి, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి జాన్ ఆల్బర్ట్ అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న పట్టినబాక్కం పోలీసులు జాన్ ఆల్బర్ట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందు జాన్ ఆల్బర్ట్ రాసిన ఐదు పేజీల లేఖ పోలీసులకు దొరికింది. అందులో.. ఆన్‌లైన్ స్కామ్‌లో చాలా డబ్బు పోగొట్టుకోవడంతో పాటు అప్పుల సమస్య పెరిగిపోవడంతో తన భార్యకు, తనకు మధ్య విభేదాలు వచ్చాయి.. దీనిపై తన భార్య డీజీపీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేయగా.. అధికారులు మాకు సర్ది చెప్పి పంపించేశారు. ఇటీవలే నా పిల్లల పుట్టినరోజు వచ్చింది.. ఆప్యాయంగా ముద్దుపెట్టుకోవడానికి వచ్చిన నన్ను ముద్దుపెట్టుకోకుండా అడ్డుకున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నా.. అని లేఖలో పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తిరువళ్లూరు: రెండో భార్య కండక్టర్‌తో వివాహేతర సంబంధం నెరపడాన్ని జీర్ణించుకోని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా చాకలికుప్పం ప్రాంతానికి చెందిన ఉత్తమన్ కుమారుడు పర్గుణన్(48). ఇతడికి రేవతి అనే మహిళతో మొదటి వివాహం జరిగింది. వీరికి విజయ్ అనే కుమారుడు ఉన్నాడు. కాగా మొదటి భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకుని శీయంజేరి గ్రామానికి చెందిన సంగీత అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. అయితే కొన్నాళ్ల తరువాత సంగీత అదే గ్రామానికి చెందిన కండక్టర్‌తో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్టు తెలుస్తుంది. ఈ విషయం పర్గుణన్‌కు తెలియడంతో నీ పద్ధతి మార్చుకోవాలని సంగీతకు పలుసార్లు సూచించాడు. అయితే మార్పు లేకపోగా ఇదే విషయంపై సంగీతకు, పర్గుణన్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగినట్టు తెలుస్తుంది. ఈ సమయంలో సంగీత తల్లిదండ్రులు, సోదరి పర్గుణన్‌పై దాడికి దిగారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పర్గుణన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్థానికులు చికిత్స కోసం చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పర్గుణన్ మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా అంకమ్మ కొలుపు

సత్యవేడు: మండలంలోని పేరడం గ్రామ పంచాయతీలో సోమ, మంగళ వారాలు అంకమ్మ కొలుపు ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామ వీధుల మలుపుల్లో కాపు కట్టారు. అంకమ్మ ఆలయం వద్ద ఇదే రోజు రాత్రి గంగమ్మ ముగ్గు, అంకాలమ్మ ముగ్గు, పోతురాజులు ముగ్గు వేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఉత్సవంలో వీధి వీధినా పోతురాజుకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. బుధవారం వరకూ సాగే ఈ కార్యక్రమం అనంతరం పోతురాజులు అంకమ్మ ఆలయం వద్ద కొలువు దీరుస్తారు.

కులహత్యల నివారణకు చట్టం తేవాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొరుక్కుపేట: రాష్ట్ర ప్రభుత్వం కుల హత్యల నిరోధానికి చట్టం తేవాలని తిరునేల్వేలిలో జరిగిన నిరసన ప్రదర్శనలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ డిమాండ్ చేశారు. కుల వ్యతిరేక ప్రేమ వివాహానికి మద్దతిచ్చినందుకు తిరునేల్వేల్లి పార్టీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ పాళయంగొట్టిలూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్యాలయంపై దాడిని ఖండిస్తూ పాళయంగోట్టైలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో అన్ని పార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ మాట్లాడుతూ తమ పార్టీ కార్యాలయంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సామాన్యులకు రక్షణ కల్పించడం పోలీసుల కర్తవ్యమన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా పోలీసు శాఖ పనిచేస్తోందని ఆరోపించారు. కార్యాలయంపై దాడికి సంబంధించి ముఖ్యమంత్రిని కలిసి వాస్తవ పరిస్థితిని వివరిస్తామని చెప్పారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రేమ పెళ్లిలో తప్పేమీ లేదన్నారు. కులమతాలకు అతీతంగా పెళ్లి చేసుకున్న వారిని రక్షించడం తమ పార్టీ కర్తవ్యం అని చెప్పారు. డబ్బును ప్రభావితం చేసేందుకు కొందరు కులాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కుల దురహంకారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కుల హత్యలను నివారించడానికి ఒక చట్టాన్ని తీసుకురావాలని సీఎం స్టాలిన్‌కు సీపీఎం నేతలు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి


తీవ్రంగా గాయపడిన అరుణకుమార్

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్లులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నంద అరుణకుమార్ సోమవారం రాత్రి నిద్రపోతున్న సమయంలో టీడీపీకి చెందిన మేకల లక్ష్మీనారాయణ, మేకల విజయకుమార్, మేకల శేషు, మేకల సైదారావులు ఆయనపై కర్రలతో దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన అరుణకుమార్‌ను అతని అక్క విజయ నర్సరావుపేటలోని ఎస్పీ ఆఫీస్‌కు తీసుకువెళ్లింది. పోలీస్ అధికారుల సూచనల మేరకు క్షతగాత్రుడిని నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. నరసరావుపేట ఆస్పత్రిలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెంటచింతల ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ నేత కార్యాలయంపై దాడి


పోలీసులు ఉండగానే కార్యాలయంపై రాళ్లు విసురుతున్న టీడీపీ కార్యకర్తలు

పొన్నూరు: వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆస్తులపై టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరుకి చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం నేత షేక్ నాజర్ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి రాళ్లను కార్యాలయంపై విసిరారు. ఇనుపరాడ్లతో బలంగా కొట్టి తలుపులు, అద్దాలను పగలగొట్టారు. ఈ ఘటనంతా పోలీసుల సమక్షంలోని జరగడం గమనార్హం. మే 13న ఎన్నికల రోజు ఇరువర్గాలకు మధ్య జరిగిన ఘర్షణతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆ రోజు నుంచి నేటి వరకు డఫ్ పేటలోనే పోలీసులు ఉండి స్థానికంగా ఎలాంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నాజర్ కార్యాలయానికి భద్రత కల్పిస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసులు ఉన్న సమయంలోనే టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు.

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ దాడి

ఒకరికి తీవ్ర గాయాలు..
పరిస్థితి విషమం

పుట్లూరు: అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కోమటికుంట్లలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎరికలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..సోమవారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మనోహర్ మధ్య ఏర్పడ్డ వివాదం ఘర్షణకు దారితీసింది. టీడీపీ నేతలు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ సమయంలో ఇరువర్గాలను పక్కకు పంపి ఘర్షణను నిలువరించడానికి ప్రయత్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎరికలయ్య తలపై రాయితో బలంగా దాడి చేయడంతో అతను అక్కడే కుప్పకూలిపోయాడు. అతన్ని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పంచాయతీ ఆఫీస్‌పై టీడీపీ జెండా ఎగురవేత

కార్యాలయం, డంపింగ్ యార్డ్‌కు టీడీపీ రంగులు


పంచాయతీ ఆఫీస్‌కు పసుపు రంగువేసి ఏర్పాటు చేసిన టీడీపీ జెండా

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ పంచాయతీ కార్యాలయంపై టీడీపీ నేతలు తమ పార్టీ జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు వేశారు. డంపింగ్ యార్డ్‌కూ పసుపు రంగు వేశారు. సచివాలయ తాళాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అధికారులను సంప్రదిస్తే తమకేమీ తెలియదన్నట్లు మౌనం వహించారు.

కొనసాగుతున్న టీడీపీ విధ్వంసం

వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మ ధ్వంసం • ముక్కలుముక్కలుగా శిలాఫలకాలు


పల్నాడు జిల్లా నాదెండ్ల ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం


బాపట్ల జిల్లా కర్లపాలెంలో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మ


పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి సచివాలయంపై ఉన్న శిలాఫలకాన్ని తొలగిస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త


ఏలూరు జిల్లా సీతంపేట పంచాయతీ కొమిరేపల్లికి వెళ్లే రహదారిలో శిలాఫలకాన్ని కూల్చివేసిన టీడీపీ నేతలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తల విధ్వంసం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మ, ప్రగతిపనుల శిలాఫలకాలను ముక్కలు చేశారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రంలోని గమేషన్ మిల్లు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం సమీపంలోని ఆ పార్టీ జెండా దిమ్మను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుద్ధాం గ్రామంలో సచివాలయ శిలాఫలకాన్ని సోమవారం తెలుగుదేశం కార్యకర్త పొలుగుతో పొడిచి ధ్వంసం చేశాడని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మను, సచివాలయ శిలాఫలకాన్ని ధ్వంసం చేసినవారిని అరెస్టుచేసి చట్టప్రకారం శిక్షించాలని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా సుబ్రమణ్యం, బాపట్ల ఏఎంసీ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి డిమాండ్ చేశారు. వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రహీమ్‌రెడ్డికి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ గణపవరం పంచాయతీ వార్డు మెంబరైన పి.నాగరాజురెడ్డిపై ఇటీవల దాడిచేసిన వారిమీద కూడా చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లినవారిలో కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కె ఆసిఫ్ అలీ, పేరలి సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, పెదగొల్లపాలెం సర్పంచ్ యల్లావుల సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి జయభారత్‌రెడ్డి, సలగల ధర్మేంద్ర, తాజుద్దీన్, షంషీర్, మనోహర్, మహేష్, నాగరాజురెడ్డి తదితరులున్నారు. పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు ఓ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎంపీ కోటా నిధుల నుంచి గ్రామాభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేయగా.. తిమ్మాపురం నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. అప్పట్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు మద్యం తాగి ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ కొమిరేపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు సోమవారం ధ్వంసం చేశారు. ఆ శిథిలాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, పార్టీ నాయకులు రాజు, గంటా పండు, దిలీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గుండుగొలను రోడ్డు నుంచి కొమిరేపల్లి గ్రామానికి రాకపోకలకు నరకాన్ని చవిచూశామని చెప్పారు. గత ఎన్నికల్లో కొఠారు రామచంద్రరావు పల్లె నిద్ర సమయంలో కొమిరేపల్లికి తారురోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొఠారు అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యేగా గుండుగొలను రోడ్డు నుంచి కొమిరేపల్లి గ్రామానికి కిలోమీటరున్నర మేర రూ.కోటికిపైగా వ్యయంతో తారురోడ్డు నిర్మించారని చెప్పారు. మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యే ఫొటోలున్న శిలాఫలకాన్ని కూల్చివేయడం, అగౌరవపర్చడం బాధాకరమని పేర్కొన్నారు. ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం ఫొటోలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు పంపించారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలోని గ్రామ సచివాలయంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న శిలాఫలకాన్ని తెలుగుదేశం కార్యకర్త మంగళవారం ధ్వంసం చేశాడు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి పాలా శారదా శ్రీనివాస్‌ను అడగగా.. తాను కార్యాలయం నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఈ దుశ్చర్య జరిగినట్టు తెలిసిందన్నారు. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

చిత్తూరులో వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై దాడి


ధ్వంసమైన కిటికీ అద్దాలు

చిత్తూరు అర్బన్ (చిత్తూరు జిల్లా): చిత్తూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అను ఇంటిపై మంగళవారం రాత్రి దాడి జరిగింది. మొహానికి కర్చీప్ కట్టుకున్న గుర్తుతెలి యని వ్యక్తులు గంగనపల్లెలోని ఆను ఇంటిపై రాళ్లదాడి చేశారు. ఈ దాడిలో ఇంటికి అమర్చిన అద్దాలు ధ్వంసమయ్యాయి. సీసీటీవీ పుటేజ్ ఆధారంగా టూటౌన్ పోలీసులు విచారిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ క్రియాశీలక నాయకుడైన అను చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లో కో–ఆప్షన్ సభ్యుడిగా ఉన్నారు.

ఎస్కేయూ వీసీ కారుపై దాడి

డ్రైవర్‌ను కొట్టి వీసీతో గొడవకు దిగిన వర్సిటీ ఉద్యోగి, రౌడీషీటర్

అనంతపురం: అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అధికారిక వాహనంపై మంగళవారం ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. మంగళవారం సాయంత్రం వీసీ బంగ్లాలోకి వెళుతున్న కారును వర్సిటీ ఉద్యోగి గంజి రామ్మోహన్, రౌడీషీటర్ హరి వెనుక వైపు నుంచి బైక్‌తో వేగంగా ఢీకొట్టారు. కారు వెనుక ఏదో తగిలిందని దిగి వచ్చిన డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టారు. కారులో ఉన్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డిని దుర్భాషలాడారు. 'రెక్టార్ పోస్టు మా ప్రొఫెసర్‌కు ఇస్తావా? లేదా? ఈ రోజే ఆర్డర్ ఇవ్వాలని కోరినా ఎందుకు ఇవ్వట్లేదు? రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నువ్వు వీసీగా ఉండడానికి వీల్లేదు..' అంటూ వీసీపై వ్యక్తిగత దూషణలకు దిగారు. నిబంధనల ప్రకారం రెక్టార్ పదవి ఇస్తామని, మీరు కోరిన ప్రొఫెసర్‌కే ఇవ్వాలని నిర్ణయించామని వీసీ చెప్పారు. అయినా వారు వీసీపై గొడవకు దిగి, బంగ్లా వద్దే బైఠాయించారు. ఇంతలో ఇటుకలపల్లి పోలీసులు వచ్చి వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ నేత షాపులు కూల్చివేత


కూల్‌డ్రింక్స్ షాపును కూల్చివేస్తున్న పొక్లయిన్. రోదిస్తున్న జాకీర్‌హుస్సేన్ సోదరుడు బాషీద్

పెదకాకాని: వైఎస్సార్ సీపీ నేత, గుంటూరు జిల్లా పెదకాకాని మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్‌కు చెందిన కూల్‌డ్రింక్ షాపును కూల్చివేసి టెంట్‌హౌస్‌కు తాళాలు వేశారు. పెదకాకానిలోని బాజీబాబా దర్గా వద్ద ముతవల్లీలు, ముజావర్లకు చెందిన 50 కుటుంబాలు షాపులు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వారిలో వైఎస్సార్‌సీపీ నేత జాకీర్ హుస్సేన్ ఒకరు. 20 ఏళ్లుగా దర్గా వద్ద కూల్‌డ్రింక్స్, టెంట్‌హౌస్ షాపు ఏర్పాటు చేసుకున్నారు. జాకీర్ నిర్వహిస్తున్న షాపులను తొలగించాలని వారం రోజులుగా వక్ఫ్‌బోర్డు అధికారికి కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో వక్ఫ్‌బోర్డు ఈవో షేక్ ముక్తార్ బాషా షాపుల వల్ల స్థానికంగా ఉన్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. షాపులు ఖాళీ చేయాలని జాకీర్ హుస్సేన్‌పై ఒత్తిడి తెచ్చారు. మంగళవారం పొక్లయిన్, ట్రాక్టర్ తెప్పించి కూల్‌డ్రింక్ షాపు షట్టర్‌ను పగులగొట్టి షాపులో వస్తువులు ట్రాక్టర్‌లోకి చేర్చి షాపును నేలమట్టం చేశారు. షాపు తొలగించవద్దని జాకీర్ సోదరుడు బాషీద్ రోదిస్తున్నా పట్టించుకోలేదు. టెంట్‌హౌస్‌లోని సామాగ్రి ఖాళీ చేసి గదికి వక్ఫ్‌బోర్డు అధికారులు తాళాలు వేశారు. వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన షాపులను మాత్రమే తొలగించడంపై తమకు ఒత్తిళ్లు ఉన్నాయని, అంతకన్నా తామేమి చెప్పలేమని వక్ఫ్‌బోర్డు ఈవో షేక్ ముక్తార్‌బాషా అన్నారు.

జగన్ అధికారంలోకి రాలేదనే మానసిక వేదనతో ఇద్దరి మృతి

- వైఎస్సార్ జిల్లా సీతారామాపురంలో ఒకరు
- గుంటూరు జిల్లా రేటూరులో మరొకరు


చిన్నవీరారెడ్డి (ఫైల్) సయ్యద్ బుడే సాహెబ్(ఫైల్ ఫొటో)

చాపాడు/రేటూరు (కాకుమాను): ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాలేదనే మానసిక వేదనతో ఇద్దరు మృతిచెందారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి వైఎస్ జగన్ అధికారంలోకి రాలేదని బాధపడుతూ ప్రాణాలు విడిచారు. వైఎస్సార్, గుంటూరు జిల్లాల్లో ఈ విషాదఘటనలు జరిగాయి. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం సీతారామాపురంలో 74 ఏళ్ల వృద్ధుడు బొర్రా చిన్నవీరారెడ్డి మంగళవారం మృతిచెందాడు. ఆయన కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి చిన్నవీరారెడ్డి.. జగన్‌ను మోసం చేసి ఎన్నికల్లో ఓడించారంటూ ఇంట్లోను, గ్రామస్తుల వద్ద వాపోయేవారు. ఎవరైనా ఆయనతో విభేదిస్తే ఇప్పటికిప్పుడు ఎన్నికలు మళ్లీ పెట్టినా జగనే గెలుస్తారని వాదించేవారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ అభిమాని అయిన చిన్నవీరారెడ్డి.. సీఎంగా జగన్ పరిపాలన పట్ల గ్రామంలో ప్రచారం చేసేవారు. మంచి పనులు చేస్తున్నారని, రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరుగుతోందని చెప్పేవారు. మోసంతో జగన్‌ను ఓడించడం అన్యాయమంటూ బాధపడేవారు. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో సాక్షి న్యూస్ చానల్ చూస్తూ మానసిక వేదనకు గురై ఉద్వేగంతో కుప్పకూలి మృతిచెందారు. మృతుడికి భార్య సరస్వతమ్మ, వివాహితులైన ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన సయ్యద్ బుడే సాహెబ్ (64) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీరాభిమాని అయిన సయ్యద్ బుడే సాహెబ్ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి.. కూటమి మోసం చేసిందంటూ చెప్పేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికి పథకాలను ప్రవేశపెట్టి సకాలంలో అర్హులైన వారందరికి ఇచ్చారని రోజూ ఎంతోమందికి చెబుతుండేవాడని చెప్పారు. ఆ వేదనతోనే గుండెపోటుకు గురయ్యాడని తెలిపారు.

ప్రభుత్వం మాది.. ఆఫీసులకు రాకండి

- అన్నమయ్య జిల్లాలో టీడీపీ నేత విజయశేఖర్ రెడ్డి అరాచకం
- ఎంపీడీవో కార్యాలయంలోకి ప్రవేశించి అధికారులపై దౌర్జన్యం
- ఎంపీడీవోను దుర్భాషలాడుతూ బెదిరింపులు
- ఆఫీసులకు రావద్దని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు హుకుం


ఎంపీడీవోను బెదిరిస్తున్న టీడీపీ నేత విజయశేఖర్ రెడ్డి

నందలూరు: రాష్ట్రంలో టీడీపీ నేతల అరాచకాలు మితిమీరిపోతున్నాయి. చివరకు అధికారులు, మండల ఉపాధ్యక్షుడిని కూడా ఆఫీసులకు రావద్దంటూ హుకుం జారీ చేసే స్థితికి చేరాయి. ప్రభుత్వం తమదని, ఆఫీసులకు రావద్దంటూ అధికారులను, ఇతర నేతలను అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ టీడీపీ నేత బెదిరించే స్థాయికి దిగజారారు.

ఇదీ జరిగింది..

నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మండల పరిషత్ అధికారులతో పలు ప్రజా సమస్యలపై చర్చించడానికి అధికారులతో సమావేశమయ్యారు. ఎంపీపీతోపాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నాయనపల్లి అనుదీప్ పలువురు ప్రజా ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇదే సమయంలో టీడీపీ నాయకుడు విజయశేఖర్ రెడ్డి తన అనుచరులతో ఎంపీడీవో కార్యాలయంలోకి ప్రవేశించారు. వస్తూనే ఎంపీడీవోను దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగారు. ప్రభుత్వం తమదని, ఇక్కడెవరూ సమావేశాలు పెట్టడానికి వీల్లేదని, కార్యాలయంలో ఎవరూ ఉండొద్దంటూ హుకుం జారీ చేశారు. అక్కడే ఉన్న మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లి అనుదీప్ అడ్డుకోబోగా, నీవసలు ఈ కార్యాలయంలోకి రావద్దంటూ దౌర్జన్యం చేశారు. ఇలా చెప్పడానికి నీవెవరని, నీకేమి సంబంధం అని విజయశేఖర్ రెడ్డిని అనుదీప్ గట్టిగా నిలదీశారు. దీంతో విజయశేఖర్ రెడ్డి తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున రగడ సృష్టించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయడంతో టీడీపీ నేత, అనుచరులు బయటకు వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు.

బెదిరిస్తే బెదిరేది లేదు : అనుదీప్

విజయశేఖర్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల పట్ల వ్యవహరించిన తీరు సిగ్గుచేటుగా ఉందని మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లి అనుదీప్ అన్నారు. మండల పరిషత్‌కు ఏమాత్రం సంబంధంలేని టీడీపీ నేత అధికారులను దుర్భాషలాడడం టీడీపీ అరాచకాలకు అద్దం పడుతోందన్నారు. తమను కూడా బెదిరించారని, అయినా బెదిరేది లేదని స్పష్టంచేశారు.

టీడీపీలో రగిలిన వర్గ విభేదాలు

- ఏవీ సుబ్బారెడ్డి ఫంక్షన్ హాలు, హోటల్, కాంప్లెక్స్‌లపై రాళ్లదాడి
- పగిలిన అద్దాలు.. పరుగులు తీసిన ప్రజలు


పగిలిన ఏవీ ప్లాజా అద్దాలు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు రగులుకున్నాయి. ఎమ్మెల్యే అఖిలప్రియ అనుచరులు మంగళవారం రాత్రి టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి ఆస్తులపైన దాడులు చేశారు. మూకుమ్మడిగా రాళ్ల వర్షం కురిపించారు. దీంతో అక్కడ ఉన్న ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున గెలిచిన అఖిలప్రియ ఎన్నికల ఫలితాలు వెలుబడిన మరుసటి రోజు నుంచి ఆళ్లగడ్డలో లేరు. మంగళవారం అఖిలప్రియ వస్తుందని నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చి స్వాగతం పలికాలని సమాచారం ఇచ్చారు. దీంతో మధ్యాహ్నం నుంచే అఖిలప్రియ అనుచరులు పెద్ద సంఖ్యలో ఆళ్లగడ్డకు చేరుకున్నారు. పట్టణ శివారులోని భూమా శోభనాగిరెడ్డి, భూమా నాగిరెడ్డిల ఘాట్‌కు చేరుకొని అక్కడ నివాళులు అర్పించి అనంతరం పట్టణంలోకి వస్తున్న తరుణంలో ముందుగా ఏవీ సుబ్బారెడ్డికి చెందిన ఏవీ ఫంక్షన్ హాల్‌పై అఖిలప్రియ అనుచరులు రాళ్లతో దాడి చేశారు. అనంతరం పట్టణం నడిబొడ్డున ఉన్న ఏవీ ప్లాజా హోటల్, కాంప్లెక్స్‌లపైనా మూకుమ్మడిగా రాళ్లదాడికి పాల్పడ్డారు. ఈ భవనాల అద్దాలను పగులగొట్టారు. ఈ క్రమంలో హోటల్‌కు, సినిమా హాలుకు, మాల్‌కు వచ్చిన వందలాది ప్రజలు భయంతో కేకలు పెడుతూ పరుగులు తీశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అయినా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు చెప్పారు.

దేశంలో తగ్గుతున్న నిరుద్యోగ రేటు

2021-22లో 4.1 శాతం.. 2022-23లో 3.2 శాతం

- నిరక్షరాస్యులతోపాటు విద్యావంతుల్లో తగ్గిన నిరుద్యోగ రేటు
- పీఎంఎంవై కింద స్వయం ఉపాధికి రూ.10 లక్షలు రుణం
- గత ఏడాది నవంబర్‌కి పీఎంఎంవై కింద 44.41 కోట్ల ఖాతాలకు రుణం
- కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ వెల్లడి



దేశంలో 15 సంవత్సరాలుపైబడిన వివిధ దశల విద్యావంతుల్లో నిరుద్యోగ రేటు

విద్య స్థాయి	2021-22 నిరుద్యోగ శాతం	2022-23 నిరుద్యోగ శాతం
అక్షరాస్యులు కాని వారు	0.4	0.2
ప్రైమరీ విద్య వరకు	1.0	0.5
మధ్య విద్య	2.6	1.7
సెకండరీ విద్య	3.4	2.2
సెకండరీ, ఆ పైబడి	8.6	7.3
ఉన్నత విద్య	6.3	4.6
మొత్తం	4.1	3.2

సాక్షి, అమరావతి: దేశంలో నిరుద్యోగ రేటు తగ్గుతోందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నిరక్షరాస్యులతో పాటు విద్యావంతుల్లో కూడా నిరుద్యోగ రేటు తగ్గిందని తెలిపింది. 2021–22లో దేశంలో నిరుద్యోగ రేటు 4.1 శాతం ఉండగా 2022 – 23లో 3.2 శాతానికి తగ్గిందని తెలిపింది. నైపుణ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం స్కిల్ ఇండియా మిషన్‌ను ప్రారంభించిందని, మార్కెట్‌లో అవసరమైన నైపుణ్యాలపై దేశంలోని యువతకు రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలను, ఉత్పాదకతను పెంచుతున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ వివరించింది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, జన శిక్షణ సంస్థాన్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొంది. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. జాతీయ విద్యా విధానంలో భాగంగా అన్ని విద్యా సంస్థల్లో విద్యతో పాటు వృత్తి విద్యా కార్యక్రమాలను ప్రారంభించినట్లు పేర్కొంది. యువతకు స్వయం ఉపాధిని మరింత సులభతరం చేసేందుకు ప్రధాన మంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) ప్రారంభించినట్లు తెలిపింది. దీని కింద స్వయం ఉపాధికి పూచీ కత్తు లేకుండా ఒక్కొక్కరికి రూ.10 లక్షల రుణం మంజూరు చేయించడం ద్వారా సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థలను విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. పీఎంఎంవై కింద గత ఏడాది నవంబర్ నాటికి 44.41 కోట్ల ఖాతాలకు రుణాలు మంజూరు చేసినట్లు వివరించింది. వీధి వ్యాపారుల కోసం కూడా ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపింది.

టీడీపీ నేతల వేధింపులతో చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

- సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగిన వైనం

కర్నూలు: కర్నూలు జిల్లా కోడుమూరులోని లక్ష్మీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు గణేష్ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులు తాళలేక మంగళవారం సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది తీవ్ర కలకలం రేపింది. గణేష్ స్థానికంగా ఓ ప్లాట్ కొనుగోలు చేసి అక్కడే రేకుల షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కోడుమూరు చెందిన తెలుగుదేశం నాయకులు టీచర్ రామచంద్రుడు, బాలకిట్టు, వీరేష్, మరోవ్యక్తి కలిసి ఆ ప్లాట్ తమదని గొడవకు దిగుతున్నారు. ప్లాట్‌ను ఖాళీ చేయాలని, లేదంటే రూ.8 లక్షలు చెల్లించాలని దౌర్జన్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ చేనేత కార్మికుడు అంత డబ్బు తెచ్చి కట్టలేక, వారి వేధింపులు తట్టుకోలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో తనువు చాలించేందుకు సిద్ధమయ్యాడు. మంగళవారం సెల్ఫీవీడియో తీసుకుంటూ కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిని కుటుంబ సభ్యులు కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


అల్కా యాగ్నిక్

చెవి జాగ్రత్త

వేల కొలది పాటలు పాడిన
గాయనికి హటాత్తుగా పాట వినపడకపోతే?
వాయిద్య ధ్వని వినపడకపోతే?
సంగీతమే చెవులకు సోకకపోతే?
అసలు ఏమీ వినిపించకపోతే?
అంతకు మించిన వేదన ఉంటుందా?
గాయని అల్కా యాగ్నిక్ తనకు
అరుదైన 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్'
వచ్చిందని ప్రకటించింది.
'మిత్రులారా... పెద్ద పెద్ద శబ్దాలకు,
హెడ్‌ఫోన్ల అతి వాడకానికి దూరంగా ఉండండి' అని హెచ్చరించింది.
ఆమె అవస్థ నుంచి మనం నేర్చుకోవాల్సిందేమిటి?

ఆమెకు పాట వినపడదు

'ఏక్ దో తీన్ చార్ పాంచ్ ఛే సాత్' (తేజాబ్), 'చోలీ కే పీఛే క్యా హై' (ఖల్ నాయక్), 'తాళ్ సే తాళ్ మిలా' (తాళ్) వంటి వందలాది హిట్ పాటలు పాడిన అల్కా యాగ్నిక్ (56) ఏ సంగీతాన్ని విని, పాడాలో ఆ సంగీతాన్ని వినలేని హఠాత్ స్థితికి వచ్చి పడింది. ఆమె 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్'తో బాధ పడుతున్నట్టు డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టా అకౌంట్ 'ది రియల్ అల్కా యాగ్నిక్' ద్వారా లోకానికి వెల్లడి చేసింది.

ఆమె చెప్పింది ఏమిటి?

'కొన్ని వారాల క్రితం నేను విమానం దిగగానే అసలు ఏమీ వినపడని స్థితికి చేరుకున్నాను. ఆ దెబ్బ నుంచి నేను ధైర్యం చిక్కబట్టుకోవడానికి కొన్నివారాల సమయం పట్టింది. ఇన్నాళ్లుగా నేను ఎందుకు కనపడటం లేదని అడుగుతున్న అభిమానులకు, మిత్రులకు నేను ఒక విషయం చెప్పదలుచుకున్నాను. నేను 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్' అనే అరుదైన జబ్బుతో బాధ పడుతున్నట్టు డాక్టర్లు తేల్చారు. ఇది వైరల్ అటాక్ అని చెప్పారు. ఈ స్థితి నుంచి కోలుకొని నేను తిరిగి వస్తానని భావిస్తున్నాను. దయచేసి అందరూ పెద్ద శబ్దాలకు, హెడ్‌ఫోన్ల విపరీత వాడకానికి దూరంగా ఉండండి' అని తన ఇన్‌స్టా అకౌంట్‌లో రాసిందామె.

'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్' అంటే?

ఇది హఠాత్తుగా వచ్చే చెవుడు. చెవిలోని హియరింగ్ నర్వ్ మీద వైరస్ దాడి చేయడంతో ఆ నర్వ్ ఉబ్బుతుంది. అయితే ఆ నర్వ్ ఒక ఇరుకైన అస్థిక ద్వారా ప్రయాణిస్తుంది కనుక ఎప్పుడైతే ఉబ్బుతుందో అప్పుడు ఒత్తిడికి లోనవుతుంది. దాంతో పనిచేసే గుణం కోల్పోతుంది. దీనివల్ల శబ్దాలు మెదడుకు చేరే వ్యవస్థ దెబ్బ తింటుంది. హఠాత్తుగా చెవుడు వస్తుంది.

- ఈ స్థితికి ముందు ఎటువంటి లక్షణాలూ కనిపించవు.
- ఒక చెవితో మొదలై రెండోచెవికి వ్యాధి రావచ్చు. ఒకోసారి రెండు చెవులకు ఒకేసారి రావచ్చు.
- వార్థక్యం వల్ల, అనువంశికంగా ఈ వ్యాధి రావచ్చు.
- వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల రావచ్చు.
- ఆటో ఇమ్యూన్ డిసీజ్ వల్ల రావచ్చు.
- కొన్ని రకాల మందుల వాడకం వల్ల రావచ్చు.
- పెద్ద పెద్ద శబ్దాలు వినడం, పెద్ద శబ్దంతో హెడ్ ఫోన్ ఎక్కువ సేపు వాడటం వల్ల రావచ్చు.

అల్కా కోలుకోవాలి

అల్కా తన పరిస్థితిని ప్రకటించిన వెంటనే ఆమె సహ గాయకులు సోను నిగమ్, ఇలా అరుణ్, శంకర్ మహదేవన్, కుమార్ సాను స్పందించారు. 'మళ్లీ నిన్ను యథావిధిగా చూస్తాం. మా ప్రేమ నీతో ఉంది' అని వారు కామెంట్లు చేశారు. ధైర్యం చెప్పారు. గాయనిగా ఉంటూనే అల్కా వివిధ రియాల్టీ షోలలో హోస్ట్‌గా పాల్గొంటూ ఉంటుంది. ఆమె మన బాలూతో పాడిన 'దేఖా హై పెహెలీ బార్' (సాజన్) వంటి పాటలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా స్టేజ్ షోలు ఇస్తూ ఉంటుంది. ఇప్పుడు కొన్నాళ్ల పాటు వాటన్నింటికి ఆమె దూరంగా ఉండాల్సిందే. అన్నింటికంటే పెద్ద ఇబ్బంది ఏమిటంటే హఠాత్తుగా వచ్చిన చెవుడు వల్ల తిరిగి సహజంగా / కృత్రిమంగా వినికిడి వ్యవస్థ పునరుద్ధరింపబడే వరకూ అసలేమీ వినిపించకపోవడంతో అయోమయం ఏర్పడుతుంది. డిప్రెషన్ రావచ్చు. జీవితేచ్ఛ నశించవచ్చు. బంధుమిత్రుల గట్టి సపోర్ట్ ఉంటే, ఆత్మవిశ్వాసం నిలుపుకుంటే తప్ప ఈ పరిస్థితి దాటటం కష్టం. 'మీ ప్రార్థనల్లో నన్ను ప్రస్తావించండి' అని కోరిన అల్కాకు అభిమానుల ప్రార్థనలు సమృద్ధిగా ఉన్నాయి. ఆమె తప్పక కోలుకుంటుందని ఆశిద్దాం.



చికిత్స

- ఈ స్థితి కనిపించిన వెంటనే చికిత్సకు వెళితే కొన్ని రకాల హైడోస్ స్టెరాయిడ్స్ వల్ల పరిస్థితిని మెరుగు పరిచే వీలు ఉంటుంది.
- కొంతమంది ఏ చికిత్సా చేయించుకోకపోయినా కొన్నాళ్లకు యాభై శాతం వినికిడి రావచ్చు.
- కొందరి విషయంలో కాక్లియర్ ఇంప్లాంట్స్ పని చేయవచ్చు.
- ఎక్కువమంది విషయంలో చికిత్స ఉండదనే చెప్పాలి.
- వినికిడి సాధనాలతో వీరు జీవితం గడపాల్సి వస్తుంది.

యూత్ పల్స్

'నా కాళ్లకు ప్రయాణ దాహం పట్టుకుంది' అంటున్నారు యువ ఆర్టిస్టులు. ఆ ప్రయాణ అనుభవాలు వారి కళకు బలాన్ని ఇస్తున్నాయి. సమాజంతో కలిసి పనిచేయడానికి అవసరమైన స్ఫూర్తిని ఇస్తున్నాయి. పబ్లిక్ ఆర్ట్‌గా ప్రాచుర్యం పొందిన 'మ్యూరల్ ఆర్ట్' ద్వారా మానసిక ఆరోగ్యం నుంచి మహిళాశక్తి వరకు ఎన్నో విషయాలను ప్రచారం చేస్తున్నారు. కార్టూన్‌లతో నవ్వించడమే కాదు ఆరోగ్య సమస్యల గురించి ఆలోచించేలా చేస్తున్నారు. కళకు సామాజిక ప్రయోజనాన్ని జోడించిన వారి క్రియేటివ్ జర్నీ గురించి....

సామాజిక కళకు సై అంటున్నారు...



ముంబైకి చెందిన మేఘకు మ్యూరల్ ఆర్ట్ అంటే ఎంత ఇష్టమో ప్రయాణాలు అంటే కూడా అంతే ఇష్టం. ఆ ప్రయాణాలలో ప్రకృతి అందాలను ఆస్వాదించడం అంటే ఇష్టం.

ఆమె దృష్టిలో ప్రకృతి అనేది విశాలమైన కాన్వాస్. అస్సాంలోని పచ్చటి కొండల నుంచి జమ్మూ కశ్మీర్‌లోని తెల్లటి మంచుల కొండల వరకు నదుల జలకళ నుంచి ఎడారుల ఇసుక మెరుపుల వరకు ఎన్నో ప్రాంతాల అందాలను ఆస్వాదించింది.

తన కళకు ఇన్‌స్పిరేషన్ తాను వెళ్లిన ప్రాంతాలే.

'ప్రయాణం అంటే ప్రతి రోజు ఒక కొత్త ఎనర్జీతో నిద్ర లేచే ఉత్సాహం. ఆ ఉత్సాహ శక్తి మన కళలో ప్రతి ఫలిస్తుంది' అంటుంది మేఘ.

మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి తన మ్యూరల్ ఆర్ట్‌ను సాధనంగా వాడుకుంటుంది స్నేహ చక్రవర్తి. 'మైండ్ అండ్ మ్యాటర్' చారిటబుల్ ట్రస్టుతో కలిసి 'ది ట్రావెల్ అండ్ పెయింట్: ఇండియా టూర్' చేసింది. ఆల్ ఇండియా ఆర్ట్ టూర్‌లో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంది. అట్టడుగు వర్గాల పిల్లలతో సంభాషించి వారితో స్నేహం చేసే అవకాశం వచ్చింది.

'కళ' అనేది మానసిక ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడుతుందో విస్తృతంగా ప్రచారం చేస్తోంది స్నేహ చక్రవర్తి.

తిరువనంతపురానికి చెందిన అమితకు చిన్నప్పటి నుంచి చిత్రకళ అంటే ఇష్టం. ప్రయాణాలు అంటే మరీ ఇష్టం.

'మొదట్లో ప్రముఖ చిత్రకారుల ఆర్ట్ వర్క్స్‌ను అనుసరిస్తూ ఆనందించేదాన్ని. అయితే అసలైన ఆనందం నాకు వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజలతో మాట్లాడినప్పుడు దొరికింది. ఒక ప్రాంతానికి తనదైన అందాలు ఉన్నట్లే సమస్యలు కూడా ఉంటాయి. ఆ సమస్యలను నా కళ ద్వారా ప్రతిబింబించాలనుకుంటు న్నాను' అంటుంది అమిత.

చిత్రకళకు సంబంధించి నిర్దిష్టమైన శైలికి పరిమితం కావడం అంటే అమితకు ఇష్టం లేదు. ఐడియాల విషయంలో ఔట్ ఆఫ్ బాక్స్ ఆలోచించడం ఆమెకు ఇష్టం. 'యూనిక్ ఎక్స్‌ప్రెషన్'ను అమితంగా ఇష్టపడుతుంది.

మేఘ, స్నేహ, అమితలు మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఎంతోమంది యువ కళాకారులు తమవైన కళారూపాలతో సమాజంతో కలిసి నడుస్తున్నారు. సామాజిక కళకు సై అంటున్నారు.


ఐశ్వర్య మణివణ్ణన్

జస్ట్ లోకల్...

చెన్నైకి చెందిన పదహారుమంది యువ ఆర్టిస్టులు ఐశ్వర్య మణివణ్ణన్ మార్గదర్శకత్వంలో 'లోకల్' థీమ్‌తో వందకుపైగా కళారూపాలు ఆవిష్కరించారు.

టెక్నాలజీపై అతిగా ఆధారపడడం వల్ల కోల్పోతున్నది ఏమిటో తెలియజేస్తాయి ఈ చిత్రాలు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కడో జరిగే సంఘటనల గురించి తెలుసుకునే మనం, సమీపంలోని వాటి గురించి మాత్రం తెలుసుకోలేము. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడెక్కడో విషయాల గురించి అనర్గళంగా చెప్పగలిగే వాళ్లలో చాలామందికి లోకల్ విషయాలలో అంతంత మాత్రమే అవగాహన ఉంటుంది.

'తమ స్థానికతతో కళాకారులు మమేకం కావడానికి లోకల్ అనే థీమ్ ఉపయోగపడుతుంది' అంటుంది ఐశ్వర్య. చెన్నైలోని వైబ్రెంట్ స్ట్రీట్ లైఫ్... అందులోని సాంస్కృతిక వైవిధ్యం అంటే ఐశ్వర్యకు ఇష్టం. తన స్టూడెంట్స్‌తో కలిసి నార్త్ చెన్నైలోని కాశిమేడుకు వెళ్లింది. గంభీరమైన సముద్రాన్ని చూసిన తరువాత స్టూడెంట్స్‌కు కొత్తప్రపంచంలోకి వచ్చినట్లు అనిపించింది. ఎంతోమంది జాలరులతో మాట్లాడారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది వారి ట్రాన్స్‌ఫర్‌మేటివ్ జర్నీ. అక్కడి దృశ్యాలు స్టూడెంట్స్ ముందున్న కాన్వాస్‌లోకి నడిచొచ్చాయి. సహజత్వాన్ని ప్రతిబింబించాయి.

ఈజ్ దట్ యూ?


ప్రణీత కొవ్రేకర్

'టాలెంటెడ్ ఇలస్ట్రేటర్'గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది ముంబైకి చెందిన ప్రణీత కొవ్రేకర్. దైనందిన జీవిత దృశ్యాల నుంచి మానసిక ఒత్తిడి, ఆందోళన వరకు ఎన్నో అంశాలు ఆమె చిత్రాలకు థీమ్‌గా ఉంటాయి. ఊహల్లో నుంచి కాకుండా సొంత అనుభవాల్లో నుంచి చిత్రాలు వేయడం అంటే ప్రణీతకు ఇష్టం.

'కళకు సామాజిక ప్రయోజం ఉంది. అది శక్తిమంతమైన మాధ్యమం' అంటున్న ప్రణీత తన కళ ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. వివిధ సామాజిక మాధ్యమాలను తన కళకు వేదికగా ఉపయోగించుకుంటోంది.

యాంగ్జయిటీ డిజార్డర్‌లపై 'ఇజ్ దట్ యూ?' టైటిల్‌తో వేసిన డ్రాయింగ్ సిరీస్‌కు మంచి స్పందన వచ్చింది. తన బొమ్మల ద్వారా నవ్వించడంతోపాటు ఆలోచించేలా చేయడం ప్రణీత ప్రత్యేకత.

'డా.ఇంటర్‌నెట్' పేరుతో యాంగ్జయిటీని తగ్గించుకోవడానికి ఏంచేస్తే బాగుంటుందో చిత్రం చివర సలహా కూడా ఇస్తుంది ప్రణీత.

బ్యూటిప్స్

యాక్నే పోవాలంటే...

మాయిశ్చరైజర్‌లో రెండు చుక్కల టీట్రీ ఆయిల్ కలిపి ముఖానికి రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే వారం– పది రోజుల్లోనే మచ్చలు తొలగి చర్మం కాంతిమంతమవుతుంది.

ముడతలు తొలగడానికి...

టొమాటో రసం పావు కప్పు తీసుకుని అందులో దూది ముంచి ముఖానికి అద్దాలి. ఆరిన తర్వాత వలయాకారంగా మర్దన చేస్తూ చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా కాంతిమంతంగా మారుతుంది. వార్ధక్య లక్షణాలుగా కనిపించే ముడతలు కూడా తొలగిపోతాయి.



మృతకణాలు తొలగాలంటే...

బొప్పాయిగుజ్జు పావు కప్పు తీసుకుని అందులో టీ స్పూన్ పన్నీరు (రోజ్‌వాటర్) కలిపి ముఖానికి రాయాలి. పది లేదా పదిహేను నిమిషాలకు తేమను చర్మం పీల్చుకుంటుంది. అప్పుడు వేళ్లతో వలయాకారంగా ముఖమంతా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. బొప్పాయిలోని ఎంజైమ్‌లు చర్మంలోని మృతకణాలను తొలగించి చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి.

చర్మం పొడిబారుతుంటే...

కలబంద గుజ్జును ముఖం, మెడ, చేతులకు, పాదాలకూ రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమను గ్రహించి కాంతిమంతమవుతుంది. ఇన్‌ఫెక్షన్‌లు, దద్దుర్లు కూడా తగ్గిపోతాయి.

కిచెన్ టిప్స్





- ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించేటప్పుడు కొద్దిగా ఉప్పు వేస్తే త్వరగా మెత్తబడతాయి.
- నిమ్మకాయలు ఎక్కువ రోజులు నిలువ ఉండాలంటే నీటిలో వేసి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- వెల్లుల్లి రేకలను ముప్పై సెకన్లపాటు పెన మీద వేడిచేస్తే పొట్టు త్వరగా వస్తుంది.
- ఆమ్లెట్ కోసం కోడిగుడ్డును గిన్నెలో వేసి గిలక్కొట్టే ముందు గిన్నెలో నీళ్లు పోసి వంపేస్తే గుడ్డు సొన గిన్నెకు అంటుకోకుండా ఉంటుంది.
- వంటలో ఉప్పు ఎక్కువైందనిపిస్తే వెంటనే పచ్చి బంగాళాదుంపను చక్రాలుగా కోసివేయాలి. బంగాళాదుంప ముక్కలు ఉప్పును పీల్చుకుంటాయి.
- క్యాలీఫ్లవర్ వండిన తర్వాత కూడా తెల్లగా ఆకర్షణీయంగా కనిపించాలంటే వండేటప్పుడు ఒక టీ స్పూన్ పాలు కలపాలి.
- అల్లంపై తొక్క తీయడానికి చాకుకు బదులుగా స్పూను వాడితే సులభంగా పోతుంది. అల్లాన్ని ఫ్రీజర్‌లో నిల్వ ఉంచితే ఎక్కువ రోజులు ఉంటుంది. తొక్క సులభంగా వస్తుంది.





గిరిజన నేతకు 'రిచా' బ్రాండ్


రిచా మహేశ్వరి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన రిచా మహేశ్వరి కెరీర్‌లో సంతృప్తిని కలిగించే మూలాలను వెతికింది అయితే వాటి ఆచూకి ఆ ఉద్యోగంలో లభించలేదు. ఫలితంగా లాంగ్ లీవ్ పెట్టి దేశవ్యాప్తంగా ఉన్న ప్రాచీన గిరిజన తెగల వద్దకు వెళ్లింది. ఒడిశాలో గిరిజన తెగల కళాత్మక నేత పనితో మమేకమై ఆ అరుదైన కళను ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఉద్యోగి నుంచి వ్యాపారవేత్తగా మారిన తన ప్రయాణం గురించి వివరించే విశేషాలు మనదైన ప్రపంచాన్ని వెతుక్కునేందుకు తప్పక ఉపయోగపడతాయి.

''నేను పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో. మా నాన్నగారిది ఒడిశా. నాన్న బ్యాంకు ఉద్యోగి కావడం, తరచూ బదిలీలు ఉండటం వల్ల కుటుంబంతో పాటు దేశవ్యాప్తంగా తిరిగాను. ఇంజినీరింగ్ డిగ్రీ తర్వాత శాప్ కెరీర్‌ను ఎంచుకున్నాను. కొన్నాళ్ల తర్వాత ఆ ఉద్యోగం నాకు డబ్బు మాత్రమే ఇస్తుంది కానీ, ఉద్యోగం చేసిన సంతృప్తి నివ్వదనిపించింది. దాంతో 2021లో ఏడాదిపాటు ఉద్యోగానికి లీవ్ పెట్టేసి దేశంలోని చాలా గ్రామాలు తిరిగాను. ఒడిశాలోని గ్రామాల్లోకి వెళ్లినప్పుడు నాదైన ప్రపంచంలోకి వచ్చిన భావన నాలో కలిగింది. అక్కడి గిరిజన సంఘాలను కలిశాను. వారి కళాత్మక వస్త్ర శ్రేణులను చూశాను. నాకు అవి అత్యద్భుతంగా కనిపించాయి.

నేత పని...

కొండపత్తితో అక్కడి తెగల కళాత్మక నేత పనితనాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నాను. 'బోయిటో' పేరుతో నాదైన డిజైనర్ స్టూడియో ఏర్పాటు చేశాను. అశోకుని కాలంలో ఈ కళింగ రాజ్యానికి గొప్ప చరిత్ర ఉంది. ఓడరేవు ద్వారా విదేశీ వాణిజ్యాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఇక్కడి పత్తిని ఇండోనేషియా, చైనా వంటి దేశాలకు తీసుకెళ్లి అక్కడి పట్టును తెచ్చేవారు. బోట్‌ను బోయిటో అని కూడా పిలుస్తారు. ఆ పేరునే మా బ్రాండ్‌కు పెట్టాను. టెక్స్‌టైల్స్ ద్వారా ఒడిశాను అన్వేషిస్తూ పూరీ సమీపంలోని పిప్లిలో నా మొదటి సంస్థను ప్రారంభించాను. పిప్లి అప్లిక్ వర్క్‌కు ప్రసిద్ధి. నుపట్నాలోని ఖండువా, సంబల్‌పూర్, పశ్చిమ బెల్ట్‌లోని సోనేపూర్, బర్గర్, బార్పల్లి వంటి ఇతర నేత యూనిట్‌లు కలుసుకున్నాను. కోరాపూట్‌లో కోట్‌పాడ్ శాలువాలకు ప్రసిద్ధి. దీంతో కోట్‌పాట్ నేత సంఘాన్ని కలుసుకున్నాను. ఆ తర్వాత చుట్టుపక్కల పర్వతాలను డిజైన్ చేసినట్టుగా ఉండే కప్పగండ శాలువాలను తయారు చేసే డోంగ్రియా సంఘం వారితో చర్చించాను. మల్కన్‌గిరిలో నివసించే ప్రాచీన తెగలలో ఒకటైన బోండాల గురించి తెలుసుకున్నాను. వారి అద్భుతమైన, అందమైన నెక్‌పీస్, తలపాగా డిజైన్లను చూశాను. వారంతా వారి సొంత సంస్కృతిని ఇప్పటికీ కాపాడుకుంటున్నాను. శరీరాన్ని పూసలతో కప్పుతారు. దిగువ శరీరాన్ని కప్పి ఉంచే రింగా అనే చిన్న వస్త్రాన్ని ఉపయోగిస్తారు. సంప్రదాయకంగా కెరాంగా అనే చెట్టు ఫైబర్‌ను ఉపయోగించి ఆ వస్త్రాన్ని తయారు చేస్తారు. ఇప్పుడు దానిస్థానంలో పత్తి నుంచి తీసిన నూలు దారాన్ని వాడుతున్నారు.

డాక్యుమెంట్ వైపుగా..

ఇక్కడి తెగల వారితో మాట్లాడుతూ, వారితో కలిసి ఉంటున్నప్పుడు స్వచ్ఛమైన మనుషుల మధ్య నేను ఒదిగిపోతున్నాను అనిపించింది. వీరంతా చెప్పే కథలను డాక్యుమెంట్ చేస్తున్నాను. ఈ అద్భుతమైన పనితనం, ప్రత్యేకమైన కళారూపాలు ప్రపంచానికి తెలియాలి అనే ఆలోచనతో డిజైనర్లతో కలిసి పనిచేయాలనుకున్నాను. అలా ప్రయాణాలు చేస్తూ, ఆలోచిస్తూ, పనులను ఆచరణలో పెట్టడానికి ఆరునెలల సమయం పట్టింది.



సంఘాలతో కలిసి..

గిరిజన తెగల నేత పనితనాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి ముందు అక్కడి సంఘాలను కలిసి మాట్లాడాను. ఇది ఒక రోజులో జరగలేదు. మొదట్లో చాలా కష్టమైంది. తూర్పు బెల్ట్‌లోని నేత కార్మికులను కలిసినప్పుడు నా కోసం ప్రత్యేక రంగులలో చీరలను తయారుచేయగలవా అని అడిగాను. కానీ, వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో నాకూ పట్టుదల పెరిగింది. వారితో కలిసి కూర్చోవడం, మాట్లాడటం చేస్తూ వచ్చాను. నా మార్గంలోకి వారు రావాలంటే వారి సంస్కృతిని నేను పూర్తిగా అర్థం చేసుకోవాలి అని గుర్తించాను. ఒక 'రింగా' నేయడానికి బోండా కమ్యూనిటీకి చెందిన నలుగురు ఒడియా మహిళలు ఒప్పుకున్నారు.



ప్రత్యేకంగా..

కోరాపుట్‌లోని గడబా కమ్యూనిటీచే నేసిన కేరాంగ్ వస్త్రాల కోసం అన్వేషిస్తున్నాను. డిజైనర్లు, నేత కార్మికులు చర్చలు జరుపుతున్నారు. ఫాస్ట్ ఫ్యాషన్‌కు విరుద్ధంగా మేం అందించేవి తరతరాలుగా ధరించడానికి వీలైన క్లాసిక్ కళాఖండాలు. గిరిజన సంఘాలు మేం సూచించిన స్వల్ప రంగు మార్పులకు, సవాళ్లకు సిద్ధంగా ఉన్నాయి. బోయిటో నుంచి ట్రెంచ్ కోట్లు, అన్ని రకాల జాకెట్లు తయారు చేస్తున్నాం. ఇప్పుడు ఇదొక లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్‌గా పేరొందింది. మేం వీటిని అంతర్జాతీయంగా కూడా తీసుకెళుతున్నాం. మా కేటలాగ్‌లో ట్రెంచ్ కోట్లు, కిమోనో జాకెట్లు, ప్యాంటు, బేసిక్ షర్టులు, డ్రెస్సులు ఉన్నాయి. పూసలతో కూడిన బోండా జాకెట్, డోంగ్రియా డిజైన్, కోట్‌పాడ్ మోటిఫ్‌లు.. మా డిజైన్స్‌లో తీసుకువస్తున్నాం. కొన్ని నెలలుగా బోయిటోతో కలిసి పని చేయడం వల్ల నా ఆర్థిక స్థిరత్వం గణనీయంగా మెరుగుపడింది. ఇప్పుడు నాలుగైదు వారాలకు ఒకసారి నా పని కోసం సంఘాలను చేరుకుంటాను. వారికి కావల్సిన మొత్తాన్ని చెల్లిస్తూ, నాకు కావల్సిన డిజైన్లను పొందుతాను. కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం వహించే హెరిటేజ్ షోలను కూడా చేయాలని చూస్తున్నాం. ప్రతి వస్త్ర డిజైన్ వెనుక అది నేసిన విధానం గురించి కథగా కూడా అందిస్తున్నాం'' అంటూ చేస్తున్న పని, దాని వెనుక దాగున్న కృషిని వివరిస్తుంది ఈ నిరంతర అన్వేషి.



అంతర్జాతీయ క్రికెట్‌కు బౌల్ట్ గుడ్‌బై

న్యూజిలాండ్ పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టి20 ప్రపంచకప్‌లో పాపువా న్యూగినీతో మ్యాచ్ ముగిశాక 34 ఏళ్ల బౌల్ట్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. 2011లో బౌల్ట్ తొలిసారి న్యూజిలాండ్ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తన 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో బౌల్ట్ 78 టెస్టులు ఆడి 317 వికెట్లు, 114 వన్డేలు ఆడి 211 వికెట్లు, 61 టి20 మ్యాచ్‌లు ఆడి 83 వికెట్లు పడగొట్టాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బౌల్ట్ రాజస్తాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ఆడాడు.

మూడో ర్యాంక్‌లో స్మృతి మంధాన



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు స్థానాలు ఎగబాకి 715 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో నిలిచింది. బెంగళూరులో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో స్మృతి సెంచరీ సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది. గత వారం వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 768 పాయింట్లతో రెండో ర్యాంక్‌కు పడిపోయింది.

చాంపియన్ అర్జున్

జెర్మక్ (అర్మేనియా): స్టెపాన్ అవగ్యాన్ స్మారక అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన ఇరిగేశి అర్జున్ విజేతగా నిలిచాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. వరంగల్ జిల్లాకు చెందిన 21 ఏళ్ల అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.



నాలుగు గేముల్లో నెగ్గిన అర్జున్, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. తాజా ప్రదర్శనతో అర్జున్ లైవ్ చెస్ రేటింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 2778.1 పాయింట్లతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరుకోవడంతోపాటు భారత నంబర్‌వన్‌గా ఉన్నాడు.

గట్టెక్కిన ఫ్రాన్స్



డసెల్‌డార్ఫ్ (జర్మనీ): 'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ ఫ్రాన్స్ జట్టు గెలుపు బోణీ కొట్టింది. ఆ్రస్టియా జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ఫ్రాన్స్ 1–0 గోల్‌తో గెలిచింది. ఆట 38వ నిమిషంలో ఆ్రస్టియా ప్లేయర్ మాక్సిమిలన్ వొబెర్ సెల్ఫ్ గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతా తెరిచింది. అనంతరం రెండు జట్లు మరో గోల్ చేయడంలో విఫలమయ్యాయి. చివర్లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్, కెప్టెన్ ఎంబాపె హెడర్ షాట్ కోసం ప్రయత్నించి ఆ్రస్టియా ప్లేయర్ కెవిన్ డాన్సోను ఢీకొట్టడంతో ఎంబాపె ముక్కుకు గాయమైంది. దాంతో ఈ టోర్నీలోని తదుపరి మ్యాచ్‌లకు ఎంబాపె అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. గ్రూప్ 'ఎఫ్'లో టర్కీ జట్టు శుభారంభం చేసింది. జార్జియాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టర్కీ 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. టర్కీ తరఫున మెర్ట్ ముల్దర్ (25వ ని.లో), అర్డా గులెర్ (65వ ని.లో), కరీమ్ (90+7వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... జార్జియా జట్టుకు మికాటాడ్జె (32వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

విండీస్ ధనాధన్

అఫ్గానిస్తాన్‌పై 104 పరుగులతో ఘనవిజయం

పూరన్ మెరుపు ఇన్నింగ్స్ ● 53 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 98

గ్రాస్ ఐలెట్: అహా..! ఎట్టకేలకు టి20 ప్రపంచకప్ లీగ్ దశ ఆఖరి మ్యాచ్‌లో క్రికెట్ ప్రేక్షకులకు అసలైన మజా లభించింది. నామమాత్రమైన మ్యాచ్‌లో కరీబియన్ హిట్టర్ నికోలస్ పూరన్ (53 బంతుల్లో 98; 6 ఫోర్లు, 8 సిక్సర్లు) అఫ్గానిస్తాన్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతని వీరవిహారంతో ఈ టి20 ప్రపంచకప్‌లోనే ఆతిథ్య వెస్టిండీస్ అత్యధిక స్కోరు నమోదు చేసింది. ఇప్పటికే ఇరుజట్లు తదుపరి 'సూపర్–8' దశకు అర్హత సంపాదించాయి. దీంతో గ్రూప్ 'సి'లో ఎవరికీ ఫలితంతో పని లేని ఈ మ్యాచ్‌లో విండీస్ 104 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్తాన్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గిన అఫ్గాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది.

ఒకే ఓవర్లో 36 పరుగులు...

విండీస్ ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే ఓపెనర్ బ్రాండన్ కింగ్ (7) రెండో ఓవర్లో నిష్క్రమించాడు. క్రీజులో ఉన్న మరో ఓపెనర్ జాన్సన్ చార్లెస్ (27 బంతుల్లో 43; 8 ఫోర్లు)తో జతకట్టిన పూరన్... అఫ్గాన్‌పై విధ్వంసరచన చేశాడు. దీంతో జట్టు స్కోరు కేవలం 3.1 ఓవర్లలోనే 50 దాటింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన ఈ నాలుగో ఓవర్లోనే ఏకంగా 36 పరుగులు వచ్చాయి. ఈ ఓవర్‌ను పూర్తిగా పూరనే ఎదుర్కొని 6, నోబ్+4, వైడ్+4, 0, లెగ్‌బై 4, 4, 6, 6లతో చుక్కలు చూపించాడు. ఈ మెరుపుల తుఫాన్‌తో కరీబియన్ జట్టు పవర్ ప్లే (6 ఓవర్లు)లో 92/1 స్కోరు చేసింది. 7.4 ఓవర్లలో జట్టు స్కోరు 100 దాటాక చార్లెస్ అవుటయ్యాడు. 37 బంతుల్లో 80 పరుగుల ధనాధన్ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి షై హోప్ (17 బంతుల్లో 25; 2 సిక్స్‌లు) రావడంతో పూరన్ 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే హోప్ అవుట్ కావడంతో కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (15 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ధాటిగానే ఆడాడు. ఆఖర్లో కెప్టెన్ రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్‌ను అసాంతం ఆడిన పూరన్ 0, 6, 4, 6, 2, 6లతో 24 పరుగులు సాధించాడు. ఈ వేగంలో విండీస్ 19వ ఓవర్లో 200 పరుగుల మైలురాయిని దాటింది. కానీ ఆఖరి ఓవర్లో సెంచరీకి 2 పరుగుల దూరంలో పూరన్ రనౌటయ్యాడు. గుల్బదిన్ నైబ్‌కు 2 వికెట్లు దక్కగా, అజ్మతుల్లా ఒమర్జాయ్, నవీనుల్ హక్ చెరో వికెట్ తీశారు.

అఫ్గాన్ టపటపా...

అనంతరం అసాధ్యమైన లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 16.2 ఓవర్లలోనే 114 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ ఇబ్రహీమ్ జద్రాన్ (28 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, నాలుగో వరుస బ్యాటర్ అజ్మతుల్లా (19 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) కాస్త మెరుగ్గా ఆడారంతే! ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు. విండీస్ బౌలర్లలో పేసర్ ఒబెద్ మెకాయ్ 3 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు గుడకేశ్ మోతీ, అకీల్ హొసేన్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ గెలుపుతో విండీస్ గ్రూప్ 'సి'లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అజేయంగా 'సూపర్–8' పోరుకు సమాయత్తమైంది.



పూరన్

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X అమెరికా

వేదిక: నార్త్‌సౌండ్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


నీరజ్ చోప్రాకు స్వర్ణ పతకం



టుర్కు (ఫిన్‌లాండ్): ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మూడో పతకాన్ని సాధించాడు. మంగళవారం జరిగిన పావో నుర్మీ గేమ్స్‌లో ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. నీరజ్ జావెలిన్‌ను 85.97 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని సంపాదించాడు. టోనీ కెరనెన్ (ఫిన్‌లాండ్; 84.19 మీటర్లు) రజతం నెగ్గగా... ఒలివెర్ హెలాండర్ (ఫిన్‌లాండ్; 83.96 మీటర్లు) కాంస్య పతకాన్ని సాధించాడు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 82.58 మీటర్లు) నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది నీరజ్ దోహా డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానాన్ని పొందగా... భువనేశ్వర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ మీట్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

ఇంటర్వ్యూకు హాజరైన గంభీర్

త్వరలోనే భారత హెడ్ కోచ్ ఎంపిక



న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్లు గౌతమ్ గంభీర్, డబ్ల్యూవీ రామన్ టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ప్రస్తుతం జట్టుతో పాటు ఉన్న హెడ్ కోచ్, బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం గత ఏడాది నవంబర్‌లో ముగిసింది. అయితే అమెరికా, వెస్టిండీస్‌లలో జరుగుతున్న టి20 ప్రపంచకప్ కోసం ద్రవిడ్‌కు తాత్కాలిక పొడిగింపు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ కోసం ఇదివరకే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అన్వేషణ మొదలు పెట్టింది. నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ, స్క్రూటినీ పూర్తయ్యాక చివరకు మిగిలిన ఇద్దరు గంభీర్, రామన్‌లలో గౌతీనే ఖాయం చేద్దామని బోర్డు సుముఖంగా ఉంది. అయితే తుది ఇంటర్వ్యూ ముగించాకే సీఏసీ సిఫార్సు మేరకు నిర్ణయం వెలువరించాలనే యోచనలో బీసీసీఐ ఉంది. మంగళవారం సీఏసీ హెడ్ అశోక్ మల్హోత్రా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో గంభీర్, రామన్‌లు తమ ప్రజెంటేషన్ ఇచ్చారు. సుమారు 40 నిమిషాల పాటు టీమిండియా కోసం వచ్చే మూడేళ్లపాటు తన అనుభవాన్ని ఎలా వెచ్చిస్తాననేది, పూర్తిస్థాయిలో ఏమేరకు అందుబాటులో ఉంటాననేది గంభీర్ తెలిపాడు.

విద్యుత్ బకాయిలు చెల్లించిన హెచ్‌సీఏ

సాక్షి, హైదరాబాద్: పదేళ్లుగా తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డి్రస్టిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్‌ఎస్‌పీడీసీఎల్)తో నడుస్తున్న విద్యుత్ వివాదానికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్ నేతృత్వంలోని కార్యవర్గం ముగింపు పలికింది. 2015లో మొదలైన ఈ విద్యుత్ జగడానికి తమ కార్యవర్గం శుభం కార్డు వేసిందని జగన్‌మోహన్ రావు వెల్లడించారు. సుమారు రూ. ఒక కోటి 64 లక్షల విద్యుత్ బిల్లు బకాయిగా ఉండగా, ఐపీఎల్ సమయంలో తొలుత రూ.15 లక్షలు చెల్లించామని ఆయన చెప్పారు. మిగిలిన మొత్తం 45 వాయిదాల్లో చెల్లించాలని అనుకున్నారు. అయితే హెచ్‌సీఏ పేరు ప్రతిష్టలను దృష్టిలో పెట్టుకుని ఒకేసారి అంతా చెల్లించామని ఆయన వివరించారు. మంగళవారం టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి జగన్‌మోహన్ రావు రూ.1 కోటి 48 లక్షల 94 వేల 521ల మొత్తాన్ని చెక్ రూపంలో అందించారు. ఐపీఎల్ సందర్భంగా విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉందనే కారణంతో క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండగా కరెంట్ తీసేసి, హైదరాబాద్, తెలంగాణ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫరూఖీని జగన్ కోరారు.



టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీకి చెక్ అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

భారత ఆర్చరీ జట్లకు టాప్ సీడింగ్



జ్యోతి సురేఖ

అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నీ కాంపౌండ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లకు టాప్ సీడింగ్ లభించింది. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆసియా క్రీడల చాంపియన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు 2100 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఫలితంగా టీమ్ విభాగంలో భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడుతుంది. జ్యోతి సురేఖ 705 పాయింట్లతో రెండో స్థానంలో, అదితి 699 పాయింట్లతో 10వ స్థానంలో, పర్ణీత్ 696 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచారు. ప్రియాంశ్ (710 పాయింట్లు), అభిషేక్ వర్మ (710 పాయింట్లు), ప్రథమేశ్ (705 పాయింట్లు)లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు క్వాలిఫయింగ్ రౌండ్‌లో 2125 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

ఒలింపిక్స్‌కు భారత షాట్‌గన్ జట్టు ప్రకటన



పృథ్వీరాజ్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ఈవెంట్‌లో పాల్గొనే ఐదుగురు సభ్యులతో కూడిన భారత షాట్‌గన్ జట్టును ప్రకటించారు. జట్టులోకి ఎంపికైన ఐదుగురూ తొలిసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనున్నారు. పురుషుల ట్రాప్ విభాగంలో పృథ్వీరాజ్ తొండైమన్... మహిళల ట్రాప్ విభాగంలో రాజేశ్వరి కుమారి... పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరూకా... మహిళల స్కీట్ ఈవెంట్‌లో రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో అనంత్, మహేశ్వరి పోటీపడతారు. 37 ఏళ్ల పృథ్వీరాజ్ ఇప్పటి వరకు ప్రపంచకప్ టోర్నీల్లో ఒక స్వర్ణం, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో కలిపి భారత్ నుంచి మొత్తం 21 మంది షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడనున్నారు.

సినిమా

తర్వాత ఏం జరుగుతుందో ఊహించలేరు

- వరుణ్ సందేశ్



''నింద' చిత్రంలోని నా పాత్రకి, నిజ జీవితంలోని నాకు అస్సలు పోలిక ఉండదు. నేను సరదాగా ఉంటాను. సీరియస్‌గా ఉండను. 'నింద'లో నా మనస్తత్వానికి భిన్నమైన పాత్ర చేశాను. ఈ చిత్రంలో ఎంతో సెటిల్డ్‌గా, మెచ్యూర్డ్‌గా కనిపిస్తాను'' అని వరుణ్ సందేశ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం వరుణ్ సందేశ్ మీడియాతో పంచుకున్న విశేషాలు.

● నా కెరీర్‌లో ఒకే తరహా సినిమాలు చేస్తూ ఉండటంతో నాకే బోరింగ్‌గా అనిపించింది. దీంతో సినిమాల నుంచి కాస్త విరామం తీసుకుని యూఎస్ వెళ్లాను. అక్కడ రాజేశ్‌గారు 'నింద' కథ చెప్పారు. నచ్చడంతో ఈ సినిమా చేశాను. 'కానిస్టేబుల్' సినిమా షూటింగ్‌లో నా కాలికి గాయమైంది. అయితే రాజేశ్ గారి డెడికేషన్ చూసి రిస్క్ చేసి ఆ గాయంతోనే 'నింద' షూటింగ్‌లో పాల్గొన్నాను. ● సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో ఇప్పటివరకూ ఎన్నో సినిమాలు వచ్చాయి. 'నింద' స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. తర్వాత ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. నటీనటుల్లో ఎవరికీ ఈ మూవీ పూర్తి కథను చెప్పలేదు రాజేశ్‌గారు. దీంతో ఆర్టిస్టుల్లోనూ ఈ సినిమాపై ఓ క్యూరియాసిటీ పెరిగింది. కథ పరంగా అసలు నేరస్థుడు ఎవరనే విషయాన్ని నేను కూడా చెప్పలేక పోయాను. ● మా దర్శక–నిర్మాత రాజేశ్‌గారి ఫ్రెండ్ అమెరికాలో 'నింద'ని రిలీజ్ చేస్తున్నారు. ఆయన మైత్రీ మూవీస్ నవీన్‌గారికి తెలుసు. అలా మైత్రీ శశిగారు మా సినిమా చూడటం, నచ్చడంతో నైజాంలో విడుదల చేస్తున్నారు. 'నింద' తర్వాత ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాను. అలాగే 'కానిస్టేబుల్' అనే సినిమాలో నటిస్తున్నాను.

ఫ్రస్ట్రేషన్ ఖలాసే...



● ప్రియదర్శి

'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకుడు. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఖలాసే..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను హనుమాన్ సీహెచ్‌తో కలిసి రామ్ మిరియాల పాడారు. ''రొమాంటిక్ కామెడీగా రూపొందుతోన్న చిత్రం 'డార్లింగ్'. ఫ్రస్ట్రేషన్ ఆంథమ్‌గా ప్రమోట్ చేస్తున్న 'ఖలాసే...' పాటలో ప్రియదర్శి తన డ్యాన్సింగ్ స్కిల్స్‌తో మెస్మరైజ్ చేస్తారు. ఈ పాట ఓ కామన్‌మ్యాన్ ఫ్రస్ట్రేషన్‌ని ప్రజెంట్ చేస్తుంది'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకి కెమెరా: నరేష్ రామదురై.

తేదీ తార్ మార్



● 'దేవర'లో ఎన్టీఆర్



● 'పుష్ప–2'లో అల్లు అర్జున్



● 'డబుల్ ఇస్మార్ట్'లో రామ్



● 'లక్కీ భాస్కర్'లో దుల్కర్ సల్మాన్

వచ్చేస్తున్నా అంటూ ఓ డేట్ చెప్పారు. అయితే ఆ డేట్‌కి కాకుండా కాస్త లేట్‌గా వస్తా అంటున్నారు. చెప్పిన డేట్ కన్నా ముందే వస్తా అంటున్న వారూ ఉన్నారు. ఈ మధ్య కొన్ని తెలుగు చిత్రాల విడుదల తేదీలు తారుమారయ్యాయి. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' అలా వాయిదాలు పడి, ఫైనల్లీ ఈ 27న థియేటర్స్‌కి వస్తోంది. ఇలా రిలీజ్ డేట్‌ను తారుమారు చేసుకున్న కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

దేవర.. ఓ పెద్ద కథ

'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' సినిమాని ప్రకటించినప్పుడే విడుదల తేదీ (2024 ఏప్రిల్ 5న)ని కూడా ప్రకటించారు మేకర్స్. కానీ కథ పెద్దది కావడంతో ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నట్లుగా ఆ తర్వాత పేర్కొన్నారు. అయితే చిత్రీకరణ ప్లాన్ చేసిన ప్రకారం జరగకపోవడంతో తొలి భాగం విడుదలను అక్టోబరు 10కి వాయిదా వేశారు. కానీ కాస్త ముందుకి వస్తున్నాడు 'దేవర'. సెప్టెంబరు 27న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు. ముందుగా ప్రకటించిన మరో సినిమా సెప్టెంబరు 27న రాకపోవడంతో ఈ తేదీకి 'దేవర' రావడానికి రెడీ అయ్యాడట. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం కానున్నారు.

పుష్పరాజ్... సీన్ రిపీట్

'పుష్ప' ఫ్రాంచైజీ తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై, మంచి విజయం సాధించింది. హీరో పుష్పరాజ్‌గా టైటిల్ రోల్ చేసిన అల్లు అర్జున్‌కి ఉత్తమ జాతీయ నటుడి అవార్డుని తెచ్చిపెట్టింది ఈ చిత్రం. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రష్మికా మందన్నా కథానాయిక. ఇక తొలి భాగం సాధించిన విజయంతో జోష్‌గా మలి భాగం 'పుష్ప: ది రూల్'ను ఆరంభించారు. కొంత చిత్రీకరణ తర్వాత ఈ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కానీ అనుకున్న సమయానికి చిత్రీకరణ పూర్తి కాలేదు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాలేక 'పుష్ప: ది రూల్' రిలీజ్‌ను ఆగస్టు 15 నుంచి డిసెంబరు 6కు వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. 'పుష్ప: ది రైజ్'ను కూడా తొలుత 2021 ఆగస్టు 13న విడుదల చేయాలనుకున్నారు. కానీ డిసెంబరులో విడుదల చేశారు. అలాగే 'పుష్ప 2: ది రూల్'ని 2024 ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకుని డిసెంబరు 6కి మార్చారు. తొలి భాగానికి జరిగిన సీన్ రిపీట్ అయింది. మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డబుల్ ఇస్మార్ట్ రెడీ

'ఇస్మార్ట్ శంకర్'గా హీరో రామ్‌లోని మాస్ యాంగిల్‌ని ఓ రేంజ్‌లో చూపించారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ చిత్రం 2019లో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. 'ఇస్మార్ట్ శంకర్' కథలో సీక్వెల్‌కు స్కోప్ ఉండటంతో రామ్‌తోనే 'డబుల్ ఇస్మార్ట్'ను ప్రకటించారు పూరి. ఈ సినిమా ప్రకటించిన రోజునే 2024 మార్చి 18న రిలీజ్ చేయనున్నట్లు కూడా వెల్లడించారు. కానీ విడుదల కాలేదు. ఆ తర్వాత జూలైలో విడుదల కావొచ్చనే ప్రచారం సాగింది. ఈ మూవీ చిత్రీకరణ అనుకున్నట్లుగా సాగలేదట. దీంతో 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఆగస్టు 15న రిలీజ్‌కి రెడీ చేస్తున్నట్లుగా తాజాగా ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మాతలు.

ముందుకు రానున్న లక్కీ భాస్కర్

'మహానటి', 'సీతా రామం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. ఈ హీరో ప్రస్తుతం చేస్తున్న సినిమా 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'లక్కీ భాస్కర్'ని సెప్టెంబరు 27న విడుదల చేస్తున్నట్లుగా ఇటీవల ప్రకటించారు. కానీ ఎన్టీఆర్ 'దేవర' సినిమా అదే తేదీకి తెరపైకి రానుంది. 'లక్కీ భాస్కర్' సినిమా నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగవంశీ 'దేవర' సినిమా డి్రస్టిబ్యూషన్ హక్కులను తీసుకున్నారట. దీంతో ఒకే రోజు ఒకే బ్యానర్ నుంచి రెండు సినిమాల విడుదల ఎందుకని భావిస్తున్నారట నాగవంశీ. ఈ నేపథ్యంలో 'లక్కీ భాస్కర్‌ను కాస్త ముందుగానే ఆగస్టులో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారని భోగట్టా. అయితే ఆగస్టు 15న ఇప్పటికే రామ్ 'ఇస్మార్ట్ శంకర్', కీర్తీ సురేష్ 'రఘుతాత' సినిమాలు ఉన్నాయి. సో.. 'లక్కీ భాస్కర్' ఏ తేదీన వస్తాడో చూడాలి. ఇక దుల్కర్ సూపర్ హిట్ మూవీ 'సీతారామం' 2022 ఆగస్టు తొలివారంలో విడుదలైంది. ఈ సెంటిమెంట్‌ని అనుసరించి, 'లక్కీ భాస్కర్'ని కూడా ఆగస్టు తొలి వారంలో రిలీజ్ చేస్తారా? అనే చర్చ కూడా జరుగుతోంది.

ఈ కోవలోనే మరికొన్ని సినిమాల రిలీజ్ డేట్‌లు ముందుకు, వెనక్కు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచంలోని అందరూ కల్కికి కనెక్ట్ అవుతారు

- నాగ్ అశ్విన్



''కల్కి 2898 ఏడీ' చిత్రకథ రాయడానికి నాకు ఐదేళ్లు పట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ మూవీ నుంచి ఆదివారం విడుదలైన 'భైరవ ఆంథమ్' ఇండియన్స్ బిగ్గెస్ట్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా టాప్ చార్ట్‌లో నిలిచినట్లు మేకర్స్ తెలిపారు. కాగా 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ 1 – ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' అనే వీడియోను విడుదల చేసింది యూనిట్. ఆ వీడియోలో డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''చిన్నప్పటి నుంచి నాకు పౌరాణిక చిత్రాలంటే చాలా ఇష్టం. 'పాతాళ భైరవి, భైరవ ద్వీపం, ఆదిత్య 369' ఇష్టమైన సినిమాలు. హాలీవుడ్ 'స్టార్ వార్స్' లాంటి సినిమాలు చూసినప్పుడు చాలా బాగున్నాయనిపించేది. కానీ ఇలాంటివి అక్కడే ఉండాలా? మన కథలతోనూ సినిమా తీయొచ్చు కదా అనిపించేది. ఆ ఆలోచనలోంచి పుట్టినదే 'కల్కి 2898 ఏడీ'. మన మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణావతారంతో అది ఎండ్ అవుతుంది. అక్కడి నుంచి కలియుగానికి ప్రవేశించినప్పుడు ఈ కథ ఎలా వెళుతుందనే ఊహతో 'కల్కి' రాశాను. కేవలం ఇండియాలోనే కాదు.. ప్రపంచంలోని అందరూ ఈ కథకు రిలేట్ అవుతారు'' అన్నారు.

ప్రేక్షకుల్ని ఆకర్షించేది టైటిలే

- దర్శకుడు తేజ



● తేజ, బాబ్జీ

''ఏ సినిమాకైనా ప్రేక్షకులను మొదట ఆకర్షించేది, వారిని థియేటర్‌కి వచ్చేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' అలాంటి శక్తివంతమైన మాస్ టైటిల్. చిత్ర యూనిట్‌కి ఈ సినిమా మంచి విజయాన్ని అందిస్తుంది అనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ తేజ అన్నారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే, హిమజ, జయవాహినీ, 'శంకరాభరణం' తులసి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మించిన ఈ చిత్రం టైటిల్ లోగోను తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా బెల్లి జనార్థన్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు బాబ్జీ.

సాక్షి బిజినెస్
బుధవారం
19-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
308	92
77,301	23,558

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,876	▲	40
డోజోన్స్	38,813	▲	35
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,191	▲	49
డాక్స్	18,132	▲	64
షాంఘై	3,030	▲	14
నికాయ్	38,482	▲	380

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 క్యారెట్)	71,285
బంగారం (99.5 క్యారెట్)	71,000
వెండి (కేజీ)	87,553

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.73	85.41
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.45	108.40
€	యూరో	ఎస్‌బీఐ	87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	42.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.78	57.63
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.44	64.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.65
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

మనోళ్లు 'మ్యాగీ' లాగించేస్తున్నారు!



- భారత్‌లోనే అత్యధికంగా వినియోగం
- కిట్‌క్యాట్‌కు టాప్–2 మార్కెట్‌గా స్థానం

న్యూఢిల్లీ: మ్యాగీ.. బహుశా భారత్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరేమో. నూడుల్స్‌కు మారుపేరుగా స్థానం సంపాదించిందంటే ఎంతలా మార్కెట్లోకి చొచ్చుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. నూడుల్స్, సూప్స్ ఉత్పత్తులను ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే మ్యాగీ బ్రాండ్ కింద విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రపంచవ్యాప్తంగా మ్యాగీ ఉత్పత్తుల అమ్మకాల్లో భారత్ తొలి స్థానంలో నిలవడం విశేషం. 2023–24లో ఏకంగా 600 కోట్లకుపైగా సర్వింగ్స్ (ఒకరు తినగలిగే పరిమాణాన్ని ఒక సర్వింగ్‌గా పరిగణిస్తారు) స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయని కంపెనీ వెల్లడించింది. అంతేకాదు నెస్లే కిట్‌క్యాట్ బ్రాండ్‌కు టాప్–2 మార్కెట్‌గా భారత్ స్థానం సంపాదించింది. గత ఆర్థిక సంవత్సరంలో 420 కోట్ల కిట్‌క్యాట్ ఫింగర్స్ అమ్ముడయ్యాయి. ఈ విషయాలను నెస్లే ఇండియా తన 2023–24 వార్షిక నివేదికలో వెల్లడించింది. రెండంకెల వృద్ధితో నెస్లే ఇండియా వేగంగా దూసుకెళ్తున్న మార్కెట్లలో ఒకటిగా నిలిచిందని సంస్థ తెలిపింది. భారత్‌లో 10వ ప్లాంటును నెస్లే ఒడిశాలో ఏర్పాటు చేస్తోంది. ప్లాంట్ల విస్తరణ, సామర్థ్యం పెంపునకు 2020–25 మధ్య రూ.7,500 కోట్లు వెచ్చిస్తున్నట్టు నెస్లే ఇండియా సీఎండీ సురేశ్ నారాయణన్ వెల్లడించారు. గడిచిన ఎనిమిదేళ్లలో కంపెనీ భారత్‌లో 140కిపైగా ఉత్పత్తులను పరిచయం చేసింది.

ఇక్సిగో లిస్టింగ్ అధరహో!

ముంబై: ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ను నిర్వహిస్తున్న లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ (ఇక్సిగో) షేరు లిస్టింగ్ సూపర్ హిట్టయ్యింది. ఇష్యూ ధర(రూ.93)తో పోలిస్తే బీఎస్‌ఈలో 45% ప్రీమియంతో రూ.135 వద్ద లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు ఈ షేరుకు కొనేందుకు ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో ట్రేడైంది. చివరికి 74% పెరిగి ఇంట్రాడే గరిష్టం రూ.162 వద్ద ముగిసింది. ఎక్స్ఛేంజీల్లో మొత్తం 76.43 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,276 కోట్లుగా నమోదైంది.



భారత్‌లో గూగుల్ 'జెమిని' యాప్

తెలుగు, హిందీలో కూడా లభ్యం



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) అసిస్టెంట్ 'జెమిని' ఆండ్రాయిడ్ యాప్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టినట్లు టెక్ దిగ్గజం గూగుల్ తెలిపింది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీ సహా తొమ్మిది భారతీయ భాషల్లో ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. ఐఫోన్ యూజర్ల కోసం గూగుల్ యాప్ ద్వారా మరికొన్ని వారాల్లో జెమిని యాప్‌ను ప్రవేశపెడతామని పేర్కొంది. భారత్‌లో విద్యార్థుల నుంచి డెవలపర్ల వరకు వివిధ వర్గాల వారు ఉత్పాదకతను పెంచుకునేందుకు, కొత్త విషయాలు నేర్చుకునేందుకు, సృజనాత్మకతను మెరుగుపర్చుకునేందుకు దీన్ని ఉపయోగించుకుంటున్నారని జెమిని ఎక్స్‌పీరియన్సెస్ వైస్ ప్రెసిడెంట్ అమర్ సుబ్రమణ్య ఒక బ్లాగ్ పోస్ట్‌లో తెలిపారు. తాజాగా గూగుల్‌కి చెందిన లేటెస్ట్ ఏఐ మోడల్ జెమిని 1.5 ప్రో ఫీచర్లు కూడా భారత్‌లోని యూజర్లకు అందుబాటులో ఉంటాయని వివరించారు.

పాలసీ విధానంలో మార్పు 'దుస్సాహసం': శక్తికాంతదాస్



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుసరిస్తున్న ద్రవ్య పరపతి విధానంలో ఇప్పటికిప్పుడు ఏదైనా మార్పు చేస్తే అది ''చాలా ముందస్తు చర్య'' అవుతుందని గవర్నర్ శక్తికాంతదాస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి ''సాహసోపేత చర్యలకు'' దూరంగా ఉండాలని కూడా ఆయన పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో అధిక ట్రేడింగ్ వాల్యూమ్‌లను సెబీతో పాటు రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షిస్తోందని అన్నారు. అయితే దానిపై ఏ చర్య అయినా.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తీసుకుంటుందని దాస్ చెప్పారు.

ఎన్‌ఎండీసీ నూతన పరిశోధన కేంద్రం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ నూతన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని హైదరాబాద్ సమీపంలోని పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేసింది. ఖనిజాల ప్రాసెసింగ్, ఉక్కు సాంకేతికతలో స్థిర ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ సెంటర్‌ను నెలకొల్పారు. రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాన్ని సంస్థ మంగళవారం ప్రారంభించింది. అయిదేళ్లలో పరిశోధన, అభివృద్ధికి రూ.150 కోట్లు ఖర్చు చేసినట్టు ఎన్‌ఎండీసీ సీఎండీ (అదనపు బాధ్యతలు) అమితవ ముఖర్జీ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

రికార్డుల ర్యాలీ



- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు
- 77,000 స్థాయిపై ముగిసిన సెన్సెక్స్
- బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీ డిమాండ్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో పాటు బ్యాంకులు, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ మూడో రోజూ కొనసాగింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడి ఇంట్రాడే, ముగింపులో సరికొత్త రికార్డులు లిఖించాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తి ఆర్థిక సంవత్సరం(2024–25) కోసం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న సమగ్ర బడ్జెట్ వృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే., ప్రజారంజకంగా ఉంటుందని మార్కెట్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. సెన్సెక్స్ ఉదయం 242 పాయింట్ల లాభంతో 77,235 వద్ద మొదలైంది.

ట్రేడింగ్‌లో 374 పాయింట్లు పెరిగి 77,366 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. చివరికి 308 పాయింట్ల లాభంతో 77,301 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 113 పాయింట్లు బలపడి 23,579 వద్ద రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 92 పాయింట్లు 23,558 వద్ద ముగిసింది. బ్యాంకులు, ఐటీతో పాటు రియల్టీ, కన్జూమర్, యుటిలిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1శాతం, అరశాతం చొప్పున రాణించాయి. ఆటో, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా మార్కెట్లు జీవితకాల గరిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

ఇన్వెస్టర్ల సంపద రయ్...

సెన్సెక్స్ నాలుగోరోజూ రాణించడంతో బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్టానికి చేరింది. మంగళవారం ఒక్కరోజే రూ.2.42 లక్షల కోట్లు పెరగడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ రూ. 437.24 లక్షల కోట్లకు చేరింది. ఈ మొత్తం 4 రోజుల్లో రూ.10.29 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

- అమెరికా ఫ్యాషన్ దుస్తుల సంస్థ హానెస్ బ్రాండ్స్‌తో వ్యాపార కాంట్రాక్టు కొనసాగింపుతో పాటు జీఐఎస్‌టీతో కొత్త వ్యాపార భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో విప్రో షేరు 3% పెరిగి రూ.492 వద్ద ముగిసింది.
- రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి 156 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల కొనుగోళ్ల ఆర్డర్ దక్కించుకోవడంతో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) షేరు 6 శాతం పెరిగి రూ. 5,533 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 7% ఎగసి రూ. 5,565 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.

రూ. 20 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఊరటనివ్వాలి

బడ్జెట్‌పై కేంద్రానికి సీఐఐ వినతి



న్యూఢిల్లీ: త్వరలో పెట్టబోయే పూర్తి స్థాయి బడ్జెట్‌లో వినియోగానికి ఊతమిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కోరింది. ఇందులో భాగంగా రూ. 20 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వ్యక్తులకు ఆదాయపు పన్నుపరంగా 'స్వల్ప ఊరట' ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే, పీఎం కిసాన్ స్కీము కింద ఇచ్చే మొత్తాన్ని పెంచాలని, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ పథకం కింద వేతనాన్ని కూడా పెంచాలని కోరింది. ఇలాంటి చర్యలతో వినియోగానికి తోడ్పాటు లభించగలదని పేర్కొంది. బడ్జెట్ ప్రతిపాదనలపై కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాకు రాసిన లేఖలో సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి పలు అంశాలను ప్రస్తావించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం, క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ల క్రమబద్ధీకరణ, ప్రస్తుత స్థాయిల్లోనే కార్పొరేట్ ట్యాక్స్‌లను కొనసాగించడం వీటిలో ఉన్నాయి. ఆర్‌బీఐ నుంచి లభించిన రూ. 2.11 లక్షల కోట్లలో కొంత మొత్తాన్ని ప్రభుత్వం వినియోగించుకోవచ్చని సీఐఐ సూచించింది.

గ్లాండ్ ఫార్మాలో వాటా విక్రయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ సంస్థ గ్లాండ్ ఫార్మాలో 5 శాతం వాటాను విక్రయించాలని షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ కో నిర్ణయించింది. ఫోసన్‌కు గ్లాండ్ ఫార్మాలో 58 శాతం వాటా ఉంది. ఒకేసారి మొత్తం వాటాను అమ్మడం వీలుకాకపోవడంతో బ్లాక్ డీల్స్ రూపంలో వాటాలను ఉపసంహరించుకుంటోంది. తాజా డీల్ ద్వారా ఒక్కొక్కటి రూ.1,750 చొప్పున 82 లక్షల షేర్లను అమ్మనుంది. వీటి విలువ రూ.1,435 కోట్లు. గ్లాండ్ ఫార్మాలో 74 శాతం వాటాను 2017లో 1.1 బిలియన్ డాలర్లకు ఫోసన్ దక్కించుకుంది. క్రితం ముగింపుతో పోలిస్తే గ్లాండ్ ఫార్మా షేరు ధర మంగళవారం 0.49 శాతం క్షీణించి రూ.1,838.50 వద్ద స్థిరపడింది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్- నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్‌ఈఆర్ పరిధిలోని వివిధ యూనిట్లలో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1104;
శిక్షణ వ్యవధి: ఒక ఏడాది.
» **వర్క్‌షాప్/యూనిట్:** మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్‌నగర్), డీజిల్ షెడ్(ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(లక్నో జంక్షన్), డీజిల్ షెడ్(గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
» **ట్రేడ్‌లు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 12.06.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.07.2024
» **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in

సెబీలో 97 ఆఫీసర్ గ్రేడ్ -ఎ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులు

ముంబైలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ).. వివిధ స్ట్రీమ్‌లలో ఆఫీసర్ గ్రేడ్–ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97.
» **స్ట్రీమ్:** జనరల్–62, లీగల్–05, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–24, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–02, రీసెర్చ్–02, అఫీషియల్ లాంగ్వేజ్–02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎల్ఎల్‌బీ/పీజీ/సీఏ/సీఎఫ్ఏ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1, ఫేజ్–2(పరీక్షలు), ఫేజ్–3(ఇంటర్వ్యూ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 30.06.2024.
» **ఫేజ్–1 ఆన్‌లైన్ పరీక్షతేది:** 27.07.2024.
» **ఫేజ్–2 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 31.08.2024.
» **ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్ట్రీమ్ ఫేజ్–2 పేపర్–2 పరీక్ష తేది:** 14.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.sebi.gov.in

కాటన్ కార్పొరేషన్, నవీ ముంబైలో 214 పోస్టులు

నవీ ముంబైలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 214
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(లీగల్) -01, అసిస్టెంట్ మేనేజర్ (అఫీషియల్ లాంగ్వేజ్)–01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్)– 11, మేనేజ్‌మెంట్ ట్రైనీ (అకౌంట్స్)–20, జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్–120, జూనియర్ అసిస్టెంట్(జనరల్)–20, జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్)–40, జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు,ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.40,000 నుంచి రూ.1,40,000. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000, ఇతర పోస్టులకు రూ.22,000 నుంచి రూ.90,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష కేంద్రాలు:** ముంబై/నవీ ముంబై, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లక్నో, చండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పాట్నా, జయపుర.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**02.07.2024
» **వెబ్‌సైట్:** https://cotcorp.org.in

సాయుధ దళాల్లో.. పోలీస్ కొలువు

» 1,526 పోస్టులకు బీఎస్ఎఫ్ నోటిఫికేషన్
» ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు
» బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
» పే లెవల్ 5, 4లతో ప్రారంభ వేతనం

దేశ అంతర్గత భద్రతలో కీలకమైన సాయుధ దళాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్.. మొత్తం 1,526 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఎంపికైతే ప్రారంభంలోనే పే లెవల్ 4, 5లతో ఆకర్షణీయ వేతనం అందుకునే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. బీఎస్ఎఫ్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ టిప్స్ తదితర సమాచారం..



పోలీస్ ఉద్యోగాలంటే యువతలో ఎంతో క్రేజ్. అందుకే ఇంటర్ మొదలు ప్రొఫెషనల్ డిగ్రీల ఉత్తీర్ణుల వరకూ.. వేల మంది పోలీస్ కొలువుల కోసం పోటీ పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్మీడియెట్ అర్హతతోనే సాయుధ దళాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది బీఎస్ఎఫ్ తాజా నోటిఫికేషన్.

మొత్తం పోస్టులు 1,526

- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ దళాల్లో మొత్తం 1,526 పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఏఎస్ఐ 243 పోస్టులు, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు 1,283 ఉన్నాయి.
- **అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్/కంబాటెంట్ స్టెనోగ్రాఫర్), వారంట్ ఆఫీసర్ (పర్సనల్ అసిస్టెంట్):** బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)లో 17 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)లో 21 పోస్టులు, ఇండో టిబెటిన్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)లో 56 పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో 146 పోస్టులు, సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ)లో 3 పోస్టులు చొప్పున భర్తీ చేయనున్నారు.
- **హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్/కంబాటెంట్ మినిస్టీరియల్), హవాల్దార్(క్లర్క్):** బీఎస్ఎఫ్‌లో 302 పోస్టులు, సీఆర్‌పీఎఫ్‌లో 282 పోస్టులు, ఐటీబీపీలో 163 పోస్టులు, సీఐఎస్ఎఫ్‌లో 496 పోస్టులు, ఎస్ఎస్‌బీలో 5 పోస్టులు, అస్సాం రైఫిల్స్‌లో 35 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2024 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆగస్ట్ 1, 2024 నాటికి 18–25 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్, స్కిల్ టెస్ట్.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

ఇందులో భాగంగా అభ్యర్థులకు నిర్దేశిత శారీరక ప్రమాణాలను పేర్కొన్నారు. పురుష అభ్యర్థులు 165 సెంటీమీటర్ల ఎత్తు, ఛాతీ విస్తీర్ణం 77 సెంటీ మీటర్లు(శ్వాస తీసుకున్నప్పుడు 82 సెంటీ మీటర్లు కలిగుండాలి. మహిళా అభ్యర్థులు 150 సెంటీ మీటర్లు ఎత్తు ఉండాలి. ఈ ప్రమాణాలు ఉన్న వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

- పీఎస్‌టీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా పరుగు పందెం నిర్వహిస్తారు.
- పురుష అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఆరు నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 800 మీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల 45 సెకన్లలో పూర్తి చేయాలి.

రాత పరీక్ష

- పీఎస్‌టీ, పీఈటీలలో ఉత్తీర్ణత సాధించిన వారికి తదుపరి దశలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- మొత్తం 100 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో అయిదు విభాగాల (హిందీ /ఇంగ్లిష్, జనరల్ ఇంటెలిజెన్స్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, క్లరికల్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఒక్కో విభాగం నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతిప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- పరీక్షకు అందుబాటులో ఉండే సమయం 1 గంట 40 నిమిషాలు.
- హిందీ/ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న విభాగాన్ని ఎంచుకోవచ్చు.

స్కిల్ టెస్ట్

- కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఏఎస్ఐ పోస్ట్‌లకు 1:30 (ఒక్కో పోస్ట్‌కు 30 మంది), హెడ్ కానిస్టేబుల్ పోస్ట్‌లకు 1:10 (ఒక్కో పోస్ట్‌కు 10 మంది) నిష్పత్తిలో అభ్యర్థుల జాబితా రూపొందించి.. వారికి తదుపరి దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.
- స్కిల్ టెస్ట్‌లో భాగంగా ఏఎస్ఐ అభ్యర్థులకు నిమిషానికి 80 పదాలు చొప్పున పది నిమిషాల వ్యవధిలో ఏదైనా అంశాన్ని డిక్టేట్ చేస్తారు. దాన్ని వారు ఇంగ్లిష్‌లో అయితే 50 నిమిషాల్లో, హిందీలో అయితే 65 నిమిషాల్లో కంప్యూటర్‌లో టైప్ చేయాల్సి ఉంటుంది.
- హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులు స్కిల్ టెస్ట్‌లో భాగంగా నిమిషానికి 35 పదాలు చొప్పున టైప్ చేయాల్సి ఉంటుంది.

ప్రారంభ వేతనం

పీఎస్‌టీ,పీఈటీ,కంప్యూటర్ బేస్డ్ టెస్ట్,స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్‌లలో విజయం సాధించిన వారిని తుది విజేతలుగా నిర్ణయిస్తారు.వీరికి నియామకాలు ఖరారు చేస్తారు. ఏఎస్ఐ ఉద్యోగాలకు పే లెవల్–5 (రూ.29,200–రూ.92,300); హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు పే లెవల్ 4 (రూ.25,500 –రూ.81,100)తో ప్రారంభ వేతనం అందుతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 8.
- **సీబీటీ తేదీ:** 2024, అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ (హైదరాబాద్).
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన మాదిరిగా క్రోడీకరించడానికి సాధన చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో స్కోర్ కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

క్లరికల్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో స్కోర్ కోసం డేటా చెకింగ్, కంపేరిజన్, స్పెల్ చెక్, స్పాటింగ్ ద ఎర్రర్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు బేసిక్ కంప్యూటర్ ఫండమెంటల్స్, కంప్యూటర్స్ వినియోగం, ఆపరేటింగ్ సిస్టమ్, ఎంఎస్ ఆఫీస్ టూల్స్, ఇంటర్నెట్ బ్రౌజింగ్, ఈ–మెయిల్ అంశాలపై దృష్టి పెట్టాలి.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

రాత పరీక్ష కంటే ముందు నిర్వహించే ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతి రోజు కనీసం రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలను ప్రాక్టీస్ చేయాలి. ఈ ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇలా దరఖాస్తు సమయం నుంచే సన్నద్ధత పొందితే విజయావకాశాలు మెరుగవుతాయి.

క్లుప్తంగా...

ఏపీ పీజీ ఈసెట్-24 ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ

తిరుపతి సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఎస్వీయూ నిర్వహించిన ఏపీ పీజీ ఈసెట్-2024 ఫలితాలను ఎస్వీయూ వీసీ, సెట్ చైర్మన్ వీ.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వర్సిటీల్లో ఫార్మసీ, ఇంజినీరింగ్ విభాగాల్లోని పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఏపీ పీజీ ఈసెట్ గత నెల 29–31 వరకు జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 10,143 మంది దరఖాస్తు చేసుకోగా 8,706 మంది హాజరైనట్లు చెప్పారు. ఇందులో 7,874 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సెట్ కన్వీనర్ రమాశ్రీ మాట్లాడుతూ..ఏపీపీజీఈసెట్-24 ప్రవేశ పరీక్షలో 90.44% ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాలను https://cets.apsche.ap.gov.in/ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దామోదర్‌రెడ్డి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

24 నుంచి ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ(తిరుపతి జిల్లా): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్-2023-24కు సంబంధించిన ఇంటర్వ్యూలు ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఏపీఆర్‌సెట్‌కు 10వేల మంది దరఖాస్తు చేసుకోగా 4,352 మంది ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర వివరాల కోసం అభ్యర్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చునని ఆయన సూచించారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు 'ఎడిట్' అవకాశం

సాక్షి, అమరావతి: గ్రూప్-2 మెయిన్స్ దరఖాస్తులో పోస్టుల ప్రాధాన్యతను మార్చుకునేందుకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించినట్లు కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించినవారిలో అధికశాతం అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 25 వరకు పోస్టుల ప్రాధాన్యం, పరీక్ష కేంద్రాలతో పాటు మండల, జిల్లా ప్రాధాన్యతలను మార్చుకోవచ్చని పేర్కొన్నారు.

వర్షాభావ పరిస్థితులతోనే ధరలు పెరుగుదల

మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రశాంతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టమాటాతో పాటు ఇతర కూరగాయల ధరల పెరుగుదలకు వర్షాభావ పరిస్థితులే కారణమని మార్కెటింగ్ శాఖ కమిషనర్ పీ ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పొరుగు రాష్ట్రాల్లో ఈ సీజన్‌లో టమాటా సాగు లేకపోవడం, మన రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మినహా మిగిలిన రాష్ట్రాల్లో టమాటా లభ్యం కాకపోవడం తదితర కారణాల వల్ల టమాటా ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. రిటైల్ మార్కెట్‌లో టమాటా కిలో రూ.65 పలుకుతుండగా, రైతు బజార్లలో సగటున కిలో రూ.54కు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో గడిచిన 10 రోజుల్లో 30 టన్నులు సేకరించి గుంటూరు, కృష్ణా జిల్లా రైతు బజార్లలో అందుబాటులో ఉంచామని తెలిపారు. అవసరమైన మేరకు టమాటా కొనుగోలు కోసం ప్రతి జిల్లాకు రూ.5లక్షలు రివాల్వింగ్ ఫండ్‌ను అందుబాటులో ఉంచామని వివరించారు.

కాంగ్రెస్ బలోపేతంపై సలహాలు, సూచనలు

ఖర్గే, కేసీలతో షర్మిల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పలు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు ఆ పార్టీ ఏపీ అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. ఆమె మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఖర్గే, కేసీలతో సమావేశమయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్ల శాతంపై చర్చించారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై మమకారం, నమ్మకం ఉన్నట్లు ఖర్గే చెప్పారని ఆమె తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అధికార పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై పోరాడే విషయం తదితర అంశాలపై మాట్లాడుకున్నట్లు చెప్పారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

పంపిణీకి ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు వివిధ యాజమాన్యాల పరిధిలోని కాలేజీల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు బ్యాగ్ (బ్యాక్‌ప్యాక్)ను ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ ఉత్తర్వులు జారీచేశారు.

బోర్లతో బ్లో అవుట్‌లు

అధిక ఉప్పు శాతం నీటి కోసం ఆక్వా రైతుల తవ్వకాలు

- అనేకచోట్ల 200–300 అడుగుల్లో బోర్లు
- దీంతో 100 అడుగులు దాటగానే ఎగదన్నుతున్న చమురు, సహజవాయువు
- ఇవి మినీ బ్లో అవుట్‌లుగా మారడంతో కోనసీమ వాసుల్లో కలవరం
- బోరుబావులపై కొరవడిన నియంత్రణ


రాజోలు మండలం శివకోడు వద్ద ఆక్వా చెరువుల వద్ద గ్యాస్ లీకేజీతో వ్యాపిస్తున్న మంటలు

సాక్షి అమలాపురం : గ్యాస్ పైప్‌లైన్ల లీకేజీలు.. తద్వారా వెదజల్లే చమురు.. అప్పుడప్పుడూ బ్లో అవుట్‌లు.. పచ్చని కోనసీమలో ఇవి సర్వసాధారణం. కృష్ణా-గోదావరి బేసిన్ (కేజీ బేసిన్)లో గ్యాస్, చమురు వెలికితీత కార్యకలాపాలు మొదలైన తరువాత ఈ ప్రాంత వాసులకు ఇది నిత్యకృత్యంగా మారిపోయింది. వీటికి ఇప్పుడు ఆక్వాసాగు తోడైంది. చప్పనీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఉప్పు నీటి కోసం వందల అడుగుల లోతున బోర్లు వేస్తుండడం.. వాటి నుంచి గ్యాస్, చమురు వచ్చి మినీ బ్లో అవుట్‌లుగా మారడం కోనసీమ వాసుల కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. తాజాగా.. రాజోలు మండలం చింతపల్లిలో బోరుబావి నుంచి భారీగా గ్యాస్ ఎగదన్నిన విషయం తెలిసిందే. అసలు కేజీ బేసిన్‌లో చమురు, గ్యాస్ వెలికితీతల సమయంలో పలు దుర్ఘటనలు చోటుచేసుకోవడం.. కొన్ని విషాదకరమైన చేదు జ్ఞాపకాలను కూడా మిగిల్చిన విషయం తెలిసిందే. జిల్లాలో అల్లవరం గ్రామాన్ని ఆనుకుని దేవర్లంక, అమలాపురం మండలం తాండవపల్లి వద్ద భారీ బ్లో అవుట్ చోటుచేసుకున్నాయి. నగరం గ్యాస్ పైప్‌లైన్ లీకవ్వడంవల్ల 19 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఇవికాకుండా.. ఏదోక ప్రాంతంలో తరచూ గ్యాస్ పైప్‌లైన్ల లీకులు, చమురు లీకేజీలు జరుగుతూనే ఉన్నాయి.

మినీ బ్లో అవుట్‌లుగా మారిన ఆక్వా బోర్లు..

ఆక్వా చెరువుల కోసం తవ్వుతున్న బోర్లు ఇప్పుడు మినీ బ్లో అవుట్‌లుగా మారిపోయాయి. అధిక ఉప్పు సాంద్రత (సెలైనిటీ) ఉన్న నీటికోసం వందల అడుగుల లోతున బోర్లు వేస్తున్నారు. వీటి ద్వారా గ్యాస్, చమురు ఎగదన్నుకు వస్తున్నాయి. ఇక్కడ భూమిలోని మట్టి పొరల్లో గ్యాస్ నిక్షిప్తమై ఉంది. రైతులు చప్పనీటి సాగు పేరుతో గ్రామీణ నీటి సరఫరా శాఖ నుంచి అనుమతి పొందుతున్నారు. 30–40 అడుగులు లోతున బోరు బావి తవ్వకాలు చేస్తే సరిపోతుంది. కానీ, ఆక్వా రైతులు అధిక ఉప్పు శాతం ఉన్న నీటి కోసం ఏకంగా 250 నుంచి 300 అడుగుల లోతున తవ్వేస్తున్నారు. దీంతో చాలాచోట్ల దిగువనున్న గ్యాస్, చమురు ఎగదన్నుకు వస్తోంది. బోరు అనుమతిచ్చే సమయంలోనే ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు బోరు తవ్వకాలపై పక్కాగా నిఘా పెట్టాల్సి ఉంది. ఇటీవల రాజోలు మండలం శివకోడు వద్ద ఓ ఆక్వా రైతు ఏకంగా 270 అడుగుల లోతున ఉప్పు నీటి తవ్వకాలు చేయడంతో గ్యాస్ ఎగదన్ని ప్రమాదానికి కారణమైంది. అక్కడున్న గ్యాస్ లభ్యతను బట్టి ఒకట్రెండు రోజులు గ్యాస్ ఎగిసిపడుతుంది. ఒకప్పుడు సముద్ర తీర ప్రాంతాలు.. గ్రామ శివారుల్లో ఉండే ఆక్వా చెరువులు ఇప్పుడు జనావాసాల మధ్యకు వస్తున్నాయి. ఇటువంటి చోట గనుక బోరు బావుల నుంచి గ్యాస్ ఎగదన్ని మంటలు వ్యాపిస్తే ప్రమాదం తీవ్రత అధికంగా ఉంటుంది.

ఆక్వాసాగుతో పైపులైన్లకు దెబ్బ..

నిజానికి.. ఆక్వాసాగు పెరగడంవల్ల ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలకు చెందిన పైప్‌లైన్లు తుప్పుపడుతున్నాయి. ఈ సాగువల్ల భూమిలో ఉప్పుశాతం పెరిగి 25 ఏళ్లు బలంగా ఉండాల్సిన ఈ గ్యాస్ పైప్‌లైన్లు 15 ఏళ్లకే దెబ్బతింటున్నాయి. అలాగే, సిస్మిక్ సర్వేల పేరుతో జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వేలాదిచోట్ల భూమి పొరల్లో బాంబింగ్ చేస్తోంది. వీటిని నిబంధనల మేరకు పూడ్చకుండా వదిలేస్తున్నారు. ఇటువంటి చోట నిల్వ ఉన్న గ్యాస్ అప్పుడప్పుడు ఎగదన్నుకు వచ్చి మంటలు చెలరేగుతున్నాయి.

కేజీ బేసిన్ చమురు, గ్యాస్‌ల అక్షయపాత్ర..

గోదావరి, కృష్ణా నదీపాయలు సముద్రం వద్ద కలిసేచోట కోనసీమ, దివిసీమలు ఏర్పడ్డాయి. భౌగోళిక శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఐదు లక్షల ఏళ్ల క్రితం ఇవిలేవు. నదుల ద్వారా కొట్టుకొచ్చిన వృక్ష, శిలా జాతులు, ఒండ్రు వంటి మట్టితో డెల్టాలు ఏర్పడ్డాయి. డెల్టా మధ్య ప్రాంతంలో వ్యర్థాలు కుళ్లిపోయి చమురు, సహజ వాయువులుగా మారి భూమిలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇదే కృష్ణా–గోదావరి బేసిన్ (కేజీ బేసిన్). ఇప్పుడిది దేశానికి చమురు, సహజ వాయువు అందించే అక్షయపాత్రగా మారింది. ఆన్‌షోర్ (సముద్ర గర్భం), ఆఫ్‌షోర్ (భూమి మీద) పెద్దఎత్తున చమురు, సహజ వాయువులు వెలికితీస్తున్నారు. కేజీ బేసిన్ అడ్డాగా ప్రభుత్వరంగ సంస్థలైన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ), గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్), ఆయిల్ ఇండియా లిమిటెడ్‌తోపాటు ప్రైవేట్‌కు చెందిన రిలయన్స్, వేదాంత వంటి సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉన్నాయి.

చమురు సంస్థల సమక్షంలోనే తవ్వకాలు..



నిజానికి.. ఆక్వాసాగుకు అవసరమైన బోరు బావులకు అనుమతిచ్చేటప్పుడు ప్రభుత్వ శాఖలు నిఘా పెట్టాల్సి ఉంది. నిర్దేశించిన లోతున మాత్రమే బోరు బావులు తవ్వాల్సి ఉంది. బోర్ల తవ్వకాలను ప్రభుత్వరంగ చమురు సంస్థల ప్రతినిధుల సమక్షంలో చేయాల్సి ఉంది. కోనసీమలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బోర్ల తవ్వకాలకు మార్గదర్శకాలు ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది.

– డాక్టర్ పెచ్చెట్టి కృష్ణకిశోర్, కోనసీమ కాలుష్య అధ్యయన నిపుణుడు, అమలాపురం

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

- రెండో ఏడాదిలో 59 శాతం ఉతీర్ణత
- 1,27,190 మంది పరీక్షలకు హాజరు.. 74,868 మంది పాస్
- రేపటి నుంచి రీ వెరిఫికేషన్‌కు అవకాశం


ఫలితాలను విడుదల చేస్తున వీవీ సుబ్బారావు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను మంగళవారం ప్రకటించారు. తాడేపల్లిలోని ఇంటర్మీడియెట్ విద్యామండలిలో పరీక్షల విభాగం కంట్రోలర్ వీవీ సుబ్బారావు విడుదల చేశారు. ఈ ఏడాది మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. రెండో ఏడాది విద్యార్థులు 1,37,587 మంది పరీక్ష ఫీజు చెల్లించగా, 1,15,319 మంది జనరల్ విద్యార్థులు 11,871 మంది ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 1,27,190 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో మొత్తం 74,868 మంది (59 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 42,200 మంది బాలురు కాగా, 32,668 మంది బాలికలు ఉన్నారు. జిల్లాల వారీగా సప్లిమెంటరీ ఉత్తీర్ణతలో పార్వతీపురం మన్యం జిల్లా 84 శాతంతో ముందుండగా, పశ్చిమ గోదావరి జిల్లా 41 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది రెండో సంవత్సరం పరీక్షలకు మార్చి, మే నెలల్లో మొత్తం 4,67,080 మంది (జనరల్ 4,31,432, ఒకేషనల్ 35,652) విద్యార్థులు హాజరయ్యారు. మార్చి సెషన్‌లో 3,06,528 మంది, మే సెషన్‌లో 68,070 మంది జనరల్ విద్యార్థులు మొత్తం 3,74,598 మంది (87 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఒకేషనల్ విభాగంలో రెండు సెషన్స్‌లో 29,798 మంది (84 శాతం) విజయం సాధించారు. మార్కులు తగ్గిన విద్యార్థులు గురువారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు రూ.1,000 చెల్లించి రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సుబ్బారావు సూచించారు. కాగా, ఈ నెల 26న మొదటి ఏడాది ఫలితాలను వెల్లడించనున్నట్టుపేర్కొన్నారు.

'నైరుతి' దోబూచులాట!

- కొద్ది రోజులుగా విజయనగరం వద్దే తిష్ట
- ముందుకు కదలని రుతుపవనాలు
- దీంతో ఉష్ణతాపం.. అరకొర వానలు
- రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి అంటున్న నిపుణులు

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది రుతుపవనాలు నిర్ణీత సమయానికి ముందే రాష్ట్రంలోకి విస్తరించాయి. వస్తూనే మంచి వర్షాలను కురిపించాయి. వారం రోజులు చురుగ్గానే ఉన్నాయి. తర్వాత ఉత్తర కోస్తా వైపు కదిలి కొద్ది రోజల క్రితం విజయనగరం వరకు చేరగానే, ముందుకు విస్తరించకుండా అక్కడే తిష్టవేశాయి. దీంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పైగా, వర్షాకాలంలో వేసవిని తలపించే ఎండలు కాస్తున్నాయి. సాధారణంకంటే 4 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతూ వడగాడ్పులూ వీస్తున్నాయి. ప్రధానంగా తీర ప్రాంత జిల్లాల్లో వీటి ప్రభావం ఎక్కువ కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాలు విజయనగరం నుంచి మిగిలిన ప్రాంతాలకు విస్తరించకపోవడానికి కొన్నాళ్లుగా కొనసాగుతున్న అధిక పీడన ద్రోణి (రిట్జ్) కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా అల్పపీడన ద్రోణి ఏర్పడితే వర్షాలు కురుస్తాయి. కానీ, అధిక పీడన ద్రోణి ఉంటే అందుకు విరుద్ధంగా వర్షాభావ పరిస్థితులేర్పడతాయని విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణం, సముద్ర అధ్యయన విభాగం పూర్వ అధిపతి ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ 'సాక్షి'కి చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో రుతు పవనాల్లో కదలిక వచ్చే అవకాశం ఉందన్నారు. అప్పటివరకు ఉత్తర కోస్తాంధ్రలో ఉష్ణ తీవ్రత ఉంటుందని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న ఆవర్తనాలు..

ప్రస్తుతం కోస్తాంధ్రకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఒకటి, రాయలసీమ, పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో మరొకటి ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. బుధవారం అల్లూరి సీతారామరాజు, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే గురు, శుక్రవారాల్లో పార్వతీపురం మన్యం, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. మరోవైపు గంటకు 40 – 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అక్కడక్కడ పిడుగులు పడవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆల్ టైం రికార్డు

రూ.60,524 కోట్ల విలువైన 17.82 లక్షల టన్నుల ఎగుమతి

- వీటిలో రూ.40 వేలకోట్ల విలువైన రొయ్యలు, రూ.5,510 కోట్ల విలువైన చేపలు
- ఎగుమతుల్లో అమెరికా, చైనా, జపాన్‌లకే ఎక్కువ
- 2023–24లో ఎగుమతుల వివరాలను ప్రకటించిన ఎంపెడా



సాక్షి, అమరావతి: సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు 2023–24లో ఆల్ టైమ్ రికార్డు నమోదు చేశాయని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపెడా) చైర్మన్ డి.వి.స్వామి వెల్లడించారు. ఘనీభవించిన రొయ్యలు, చేపలు అమెరికా, చైనా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల వివరాలను ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు. 2022–23తో పోలిస్తే ఎగుమతి పరిమాణం 2.67 శాతం పెరిగింది. 2022–23లో రూ.63,969.14 కోట్ల (8,094.31 మిలియన్ డాలర్ల) విలువైన 17,35,286 టన్నుల సముద్రపు ఉత్పత్తుల ఆహారం ఎగుమతి కాగా, 2023–24లో రూ.60,523.89 కోట్ల (7.38 బిలియన్ డాలర్ల) విలువైన 17,81,602 టన్నుల సముద్ర ఉత్పత్తులు దేశం నుంచి ఎగుమతి అయ్యాయి. ఘనీభవించిన రొయ్యల పరిమాణం, విలువ రెండింటి పరంగా ప్రధాన ఎగుమతి ఉత్పత్తిగా నిలిచింది. గతేడాది తీవ్రమైన మార్కెట్ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ 7.38 బిలియన డాలర్ల విలువైన 17,81,602 టన్నుల సముద్రపు ఆహారాన్ని రవాణా చేయడం ద్వారా ఆల్ టైమ్ గరిష్ఠ ఎగుమతులను నమోదు చేసినట్లు ఎంపెడా ప్రకటించింది. ప్రపంచస్థాయి వాణిజ్యరంగంలో భారతదేశ సముద్ర ఆహార దిగుమతుల్లో అమెరికా మొదటి స్థానంలో నిలిచింది. మత్స్య ఉత్పత్తుల ఎగుమతి ద్వారా 2,549.15 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అమెరికా నుంచి భారత్ ఆర్జించింది. గతేడాదితో పోలిస్తే 34.53 శాతం వృద్ధిరేటు సాధించింది. ఆ తర్వాత మన మత్స్య ఉత్పత్తుల దిగుమతిలో చైనా రెండో అతిపెద్ద దేశంగా నిలిచింది. ఈ ఏడాది 1,384.89 మిలియన్ డాలర్ల విలువైన 4,51,363 టన్నుల మత్స్య ఉత్పత్తులు చైనాకు ఎగుమతి అయ్యాయి. 25.33 శాతం వృద్ధి రేటు నమోదైంది. చైనా తర్వాత స్థానాల్లో జపాన్, వియత్నం, థాయలాండ్, కెనడా, స్పెయిన్, బెల్జియం దేశాలున్నాయి.

రొయ్య ఎగుమతుల్లో అగ్రస్థానం అమెరికాకే

ఎగుమతుల్లో 7.16 లక్షల టన్నులతో ఘనీభవించిన రొయ్యలు మొదటిస్థానంలో నిలిచాయి. వీటిద్వారా దేశానికి రూ.40,013.54 కోట్ల ఆదాయం వచ్చింది. అత్యధికంగా 2,97,571 టన్నులు అమెరికాకు ఎగుమతి కాగా.. చైనాకు 1,48,483 టన్నులు, యూరోపియన్ దేశాలకు 89,697 టన్నులు, సౌత్ ఈస్ట్ ఏషియాకు 52,254 టన్నులు, జపాన్‌కు 35,906 టన్నులు, మిడిల్ ఈస్ట్ దేశాలకు 28,571 టన్నులు ఎగుమతి అయ్యాయి. ఆ తర్వాత ఘనీభవించిన చేపలు రెండో అతిపెద్ద ఎగుమతి ఉత్పత్తిగా గుర్తింపు పొందింది. వీటిద్వారా రూ.5,509.69 కోట్ల ఆదాయం లభించింది. చేప, రొయ్యల ఆహారం, పొడి దాణా ఉత్పత్తులు ఎగుమతిలో మూడో అతిపెద్ద ఉత్పత్తిగా నిలిచింది. వీటి ద్వారా దేశానికి రూ.3,684.79 కోట్ల ఆదాయం వచ్చింది. ఘనీభవించిన స్క్విడ్ నాలుగో అతిపెద్ద ఎగుమతిగా నిలిచింది. దీనిద్వారా రూ.3,061.46 కోట్ల ఆదాయం లభించింది. సురిమి, సురిమి అనలాగ్స్‌కు చెందిన ఉత్పత్తులు ఐదోస్థానంలో నిలిచాయి. ఇవి రూ.2,414.43 కోట్ల విలువైన 1,35,327 టన్నులు ఎగుమతి అయ్యాయి. ఆ తర్వాత రూ.2,252.63 కోట్ల విలువైన 54,316 టన్నుల ఎగుమతితో ఫ్రోజెన్ కాటిల్ ఫిష్ ఆరోస్థానంలో నిలిచింది. చిల్డ్ ఐటమ్స్, ఆక్టోపస్ ఎగుమతులు ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచాయి.


వాసుదేవరెడ్డి పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)కు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను తరలించారంటూ తనపై సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆ సంస్థ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది. సీఐడీ తరపు న్యాయవాదుల అభ్యర్థన మేరకు హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం పిటిషన్

ఏపీఎస్‌బీసీఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర కీలక పత్రాలను వాసుదేవరెడ్డి తీసుకెళ్లారని, ఇవన్నీ ఆయన తన కారులో తరలిస్తుండగా చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ అధికారులు ఈ నెల 6న వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసు పెట్టారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎం.లక్ష్మీనారాయణ స్పందిస్తూ, విజయవాడలోని వాసుదేవరెడ్డి ఇంటిలో సోదాలు చేయాల్సి ఉందని, ఆ ఇంటి తాళాన్ని పగలగొట్టి సోదాలు చేసేందుకు అనుమతినివ్వాలని కోరుతూ కింది కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉందని, పూర్తి వివరాల సమర్పణకు విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు. మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం అనుబంధ పిటిషన్ వేశామని వాసుదేవరెడ్డి తరపు న్యాయవాది ఎస్.నగేష్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ పిటిషన్‌ను కూడా తదుపరి విచారణలో పరిశీలిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

హీరో దర్శన్ ఫాంహౌస్ మేనేజర్ ఆత్మహత్య


శ్రీధర్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: కర్ణాటకలో ప్రముఖ సినీ హీరో దర్శన్ కేసు మలుపులు తిరుగుతోంది. ఈ నెల 8వ తేదీన బెంగళూరులో జరిగిన రేణుకాస్వామి హత్య కేసులో పోలీసులు దర్శన్ ప్రియురాలు పవిత్ర గౌడను ఏ1, దర్శన్‌ను ఏ2గా చేర్చారు. విచారణ సాగుతుండగా, దర్శన్ మేనేజర్ ఒకరు ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. బెంగళూరు శివారు ఆనేకల్ తాలూకా బగ్గనదొడ్డికి చెందిన శ్రీధర్ గత ఏప్రిల్ 16న డెత్‌నోట్ రాసి, సెల్ఫీ తీసుకుని వాస్మోల్ రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. తన చావుకు ఎవరూ కారణం కాదని అందులో పేర్కొన్నాడు. గ్రామ శివారులోని బండరాళ్లపై శ్రీధర్ మృతదేహం లభించినట్టు తెలిసింది. స్థానికంగా సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దర్శన్ ఫాంహౌస్‌కు శ్రీధర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో ఈ కేసుపైనా పోలీసులు దృష్టి సారించారు.

రైతుల పోరాటాల వల్లే బీజేపీకి సీట్లు తగ్గాయి

అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు రావుల వెంకయ్య

సాక్షి, అమరావతి: రైతుల పోరాటాల వల్లే ఉత్తరాది రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి 151 పార్లమెంట్ సీట్లు కోల్పోయిందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య అన్నారు. మంగళవారం విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ రైతు సంఘం కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

రైతుల ప్రయోజనాలను దెబ్బతీయాలన్న కుట్ర ఫలితంగానే ఎన్డీయే కూటమి అభ్యర్థులను రైతులు చైతన్యవంతంగా అడ్డుకున్నారన్నారు. సీ2 ప్లస్ 50 శాతం అదనంగా మద్దతు ధరల ప్రకటన, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం సాధన, పంట రుణాలన్నీ ఒకేసారి మాఫీ చేయడం కోసం రైతులు మరోసారి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారాలు, రబీ ధాన్యం బకాయిలను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అమరావతి రైతు ఉద్యమకారులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, ప్రజా సంఘాల కార్యకర్తలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలన్నారు. ఏపీ రైతు సంఘ అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఉపాధ్యక్షులు మల్నీడు యల్లమందారావు. ఎ.రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 27న ఆందోళన

రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న రాష్ట్రంలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం పిలుపు నిచ్చింది. ఈ మేరకు సంఘ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. సంప్రదాయ వ్యవసాయంలో భాగంగా రైతులు వినియోగించే ఎద్దులు, ఎడ్లబండ్లతో పాటు ఇతర పనిముట్లను 50 శాతం రాయితీతో ఇవ్వాలని, ట్రాక్టర్లు వినియోగించే రైతులకు అవసరమైన డీజిల్‌ను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని, రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయానికి బదులుగా ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

'విశాఖ' ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తాం

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస వర్మ


మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసవర్మ

సాక్షి, న్యూఢిల్లీ/భీమవరం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తామని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని మంత్రిత్వ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు' అనే సెంటిమెంట్ దెబ్బతినకుండా ఏపీ ప్రజల ఆలోచన విధానాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ విధానంలో భాగంగా కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడటం సముచితం కాదన్న శ్రీనివాస వర్మ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేస్తూ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌కు క్యాపిటివ్ మైన్స్ కేటాయింపు విషయంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడతానని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077.
Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943